# భారత్ శక్తి ®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 285 | హైదరాబాద్ | శుక్రవారం 08-05-2026 | పేజీలు : 12 | వెల : 1.00




రేవంత్ రెడ్డికి కనీస కనికరం లేదు : హరీశ్ రావు ఆగ్రహం 11లో

## రైతు సభ కాదు, అది ఫ్రస్ట్రేషన్ సభ
# కేటీఆర్‌కు పొంగులేటి కౌంటర్

- వరంగల్‌లో బీఆర్ఎస్ నిర్వహించింది రైతు సంగ్రామ సదస్సు కాదని, అది ఆక్రోశ సభ అని ఎద్దేవా
- కేంద్రంలో బీజేపీతో కుమ్మక్కై, రాష్ట్ర ప్రభుత్వంపై బీఆర్ఎస్ నిందలు వేస్తోందని ఆరోపణ
- కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం నెలకు సగటున రూ. 5,500 కోట్లు ఖర్చు చేస్తోందని వెల్లడి 11లో







## హైడ్రా భారీ విజయం
# ₹85 వేల కోట్ల భూములు సేఫ్

- హైడ్రా పరిధిలో రూ.10 లక్షల కోట్ల విలువ చేసే భూములు కబ్జాకు గురయ్యాయన్న రంగనాథ్
- హైడ్రాను తెలంగాణవ్యాప్తంగా విస్తరిస్తామన్న రంగనాథ్
- సమస్యల పరిష్కారం కోసమే ప్రజావాణిని నాలుగు వారాలపాటు నిలిపివేశామని వెల్లడి 11లో




## ముగియని ఆపరేషన్ 11లో
# త్రివిధ దళాల స్పష్టీకరణ

- ఆపరేషన్ సిందూర్ ఆరంభం మాత్రమే అన్న త్రివిధ దళాలు
- దేశ ప్రజలను, సార్వభౌమత్వాన్ని భారత్ కాపాడుకోగలదని ఆపరేషన్ స్పష్టం చేసిందని వెల్లడి
- పాక్‌లో ఏ ఉగ్రస్థావరం సురక్షితం కాదని ఆపరేషన్ ద్వారా సందేశమిచ్చామని వెల్లడి

## గవర్నర్‌పై కాంగ్రెస్ గుస్సా
# రేపు తమిళనాడు బంద్!

- తమిళనాడులో ప్రభుత్వ ఏర్పాటుపై కొనసాగుతున్న ఉత్కంఠ
- టీవీకేను అధికారంలోకి రాకుండా అడ్డుకుంటున్నారని బీజేపీపై కాంగ్రెస్ ఆరోపణ
- కేంద్రం, గవర్నర్ వైఖరికి నిరసనగా రేపు చెన్నైలో ధర్నా
- టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై నేతృత్వంలో ఆందోళన
- పార్టీ ముఖ్య నేతలంతా పాల్గొంటారని ప్రకటన 11లో





ఏపీలో త్వరలో స్థానిక ఎన్నికలు..
# సీఎం కీలక ఆదేశం

- లాజిస్టిక్స్ ఖర్చులు తగ్గితేనే రాష్ట్రానికి మేలు అని అభిప్రాయం
- రాష్ట్రానికి లక్షల కోట్ల విలువైన రహదారి, రైల్వే ప్రాజెక్టులు
- ఎల్‌నినో ప్రభావంపై కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని సూచన
- పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు ఆదేశం

11లో



## విజయ్‌కు అవకాశం ఇవ్వండి
# గవర్నర్‌కు వినతి

- మొదట విజయ్ సీఎంగా ప్రమాణం చేయడానికి ఆహ్వానించాలన్న పార్టీలు
- అసెంబ్లీలో మెజారిటీ నిరూపించుకోవడానికి అవకాశం కల్పించాలన్న వీసీకే
- గవర్నర్ రాజ్యాంగ పరిధిలో వ్యవహరించాలని సీపీఐ డిమాండ్

11లో

## విద్యుత్ ఆర్టిజన్ల పోరాటానికి ఫలితం
# చర్చలకు భట్టి గ్రీన్ సిగ్నల్!

- ప్రజా భవన్‌లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతో TVAE JAC నేతల భేటీ
- ప్రొఫెసర్ కోదండరాం, అద్దంకి దయాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కీలక సమావేశం
- సమ్మె విరమణ తదనంతర పరిణామాలపై మంత్రికి వివరించిన జేఏసీ నాయకులు

11లో





# రిజిస్ట్రేషన్లకు 'విలువల' సెగ!

- తెలంగాణలో భూముల మార్కెట్ విలువల పెంపునకు ప్రభుత్వం సిద్ధం
- ప్రాంతాలను బట్టి 20 శాతం నుంచి 100 శాతానికి పైగా పెరగనున్న రిజిస్ట్రేషన్ విలువలు
- ప్రభుత్వ, వాస్తవ మార్కెట్ ధరల మధ్య అంతరాన్ని తగ్గించడమే ప్రధాన లక్ష్యం
- పశ్చిమ హైదరాబాద్‌లోని కోకాపేట, గచ్చిబౌలి ప్రాంతాల్లో అత్యధిక పెరుగుదల
- కొనుగోలుదారులపై స్టాంప్ డ్యూటీ భారం గణనీయంగా పెరిగే అవకాశం

11లో

భారత శక్తి

# కాంగ్రెస్ పునరాగమనం...

దక్షిణాదిలో కాంగ్రెస్ హవా కొనసాగుతున్నది. ఇప్పటికే కర్నాటక, తెలంగాణ రాష్ట్రాల్లో అధికారాన్ని దక్కించుకున్న హస్తం పార్టీ, ఇప్పుడు కేరళలోనూ జైత్రయాత్రను కొనసాగించింది. రెండేండ్లుగా దక్షిణాది రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ తన బలాన్ని నిరూపించుకుంటూ వస్తోంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కర్నాటకలో మొత్తం 224 స్థానాలకుగాను కాంగ్రెస్ ఏకంగా 135 స్థానాలను గెలుచుకుని భారీ మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఇక్కడ బీజేపీని కేవలం 66 స్థానాలకే పరిమితం చేసి తన సత్తా చాటింది. తెలంగాణలోనూ పదేండ్ల బీఆర్ఎస్ పాలనకు బ్రేక్ వేస్తూ కాంగ్రెస్ సంచలన విజయం సాధించింది. మొత్తం 119 స్థానాల్లో కాం గ్రెస్ 65 స్థానాలను గెలుచుకొని రేవంత్ రెడ్డి నేతృత్వంలో అధికారాన్ని చేజిక్కించుకుంది. కర్నాటక, తెలంగాణ తర్వాత ఇప్పుడు కేరళలోనూ విజయం సాధించడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం ఉరకలే స్తున్నది. ఈ విజయంతో దక్షిణాదిలో ప్రధాన రాష్ట్రాలన్నీ ఇప్పుడు కాంగ్రెస్ ఖాతాలో చేరాయి.తాజాగా.. వెలువడిన కేరళ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) ప్రభంజనం సృష్టించింది. దశాబ్ద కాలంగా అధికారంలో ఉన్న లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్డీఎఫ్) పాలనకు చరమగీతం పాడుతూ, కేరళ ఓటర్లు యూడీఎఫ్ వైపు మొగ్గు చూపారు.మొత్తం 140 స్థానాలు ఉన్న కేరళ అసెంబ్లీలో, యూడీఎఫ్ 102 స్థానాల్లో విజయం సాధించి స్పష్టమైన మెజారిటీని దక్కించుకుంది. ఇందులో ఒక్క కాంగ్రెస్ పార్టీయే 63 స్థానాలను గెలుచుకోవడం విశేషం. పినరయి విజయన్ నేతృత్వంలోని ఎల్డీఎఫ్ కేవలం 35 స్థానాలకే పరిమితమైంది. 2026 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు పశ్చిమ బెంగాల్, అస్సాంలలో బీజేపీకి అధికారాన్ని కట్టబెట్టి ఉండవచ్చు. కానీ ఈ గణాంకాల వెనుక భారత రాజకీయ గమనాన్ని మార్చగల ఒక లోతైన కథ దాగి ఉంది. అది 'కాంగ్రెస్ పార్టీ పునరాగమనం'. పైకి ఓటమిలా కనిపిస్తున్నా, వ్యూహాత్మకంగా చూస్తే ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీయే అతిపెద్ద రాజకీయ లబ్ధిదారుగా అవతరించిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.ముఖ్యంగా మలబార్ రీజియన్‌లో ముస్లిం లీగ్ (ఐయూఎంఎల్) తో కలిసి కాంగ్రెస్ క్లీన్ స్వీప్ చేసింది.క్షిణ భారతదేశం కాంగ్రెస్ ఒక అభేద్యమైన కంచుకోట అని, ఇక్కడ బీజేపీ గడ్డు రాజకీయ పరిస్థితులను ఎదుర్కొంటోందని కేరళ ఫలితాలు మరోసారి నిరూపిస్తున్నాయి. ఈ విధంగా దక్షిణాన కర్ణాటక, తెలంగాణల తర్వాత కేరళలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వమే ఏర్పడనుంది. నిజానికి కేరళలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల చరిష్మా, క్షేత్రస్థాయిలో పార్టీ పటిష్టత రాష్ట్రాన్ని కాంగ్రెస్‌కు సురక్షిత ప్రాంతంగా మార్చాయి. కర్ణాటక, తెలంగాణ తర్వాత కేరళలోనూ గెలవడంతో దక్షిణ భారతదేశంలో కాంగ్రెస్ ఒక తిరుగులేని శక్తిగా ఎదిగింది. ఇక్కడ బీజేపీ ఎంత ప్రయత్నించినప్పటికీ, తన స్థానాలను పెంచుకోలేకపోయింది.2021లో బెంగాల్‌లో కాంగ్రెస్ రాష్ట్రంలో పూర్తిగా కనుమరుగు అయ్యింది. కానీ ఈ దఫా జరిగిన ఎన్నికల్లో బెంగాల్‌లో కాంగ్రెస్ 3% ఓట్ల వాటాను సంపాదించి, రెండు సీట్లను కూడా గెలుచుకుంది. ప్రస్తుతం రాష్ట్రంలో మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ బలహీనపడటం కాంగ్రెస్‌కు వరంగా మారింది. టీఎంసీ పతనం తర్వాత ఏర్పడిన ప్రతిపక్ష శూన్యతను పూరించడానికి లౌకికవాద ఓటర్లు మళ్లీ కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. భవిష్యత్తులో ఇక్కడ పోరు బీజేపీ వర్సెస్ కాంగ్రెస్‌గా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత 15 ఏళ్లుగా మమతా బెనర్జీతో సంబంధం ఉన్న ముస్లిం ప్రాబల్య ప్రాంతంలో తన రాజకీయ పట్టును బలపరుచుకునేందుకు కాంగ్రెస్‌కు ఇప్పుడు అవకాశం ఉంది. బెంగాల్‌లో అధికార మార్పిడి భవిష్యత్తులో బీజేపీ, కాంగ్రెస్ మధ్య పోటీకి దారితీయవచ్చని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇక తమిళనాడులో నిజానికి రాష్ట్రంలో కాంగ్రెస్ ద్రావిడ రాజకీయ పార్టీల కారణంగానే అధికారం కోల్పోయి, తిరిగి రాలేక కేవలం ఒక 'జూనియర్ భాగస్వామి'గా మిగిలిపోయింది. కానీ ఇప్పుడు విజయ్ పార్టీ గెలుపు, అధికారాన్ని హస్తగతం చేసుకోవడానికి టీవీకేకు కాంగ్రెస్ అవసరం ఏర్పడటం చూస్తుంటే.. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు మళ్లీ మంచి రోజులు రాబోతున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు. అస్సాంలో మైనారిటీ ఓటర్లు పూర్తిగా కాంగ్రెస్ గూటికి చేరిపోయారు. బద్రుద్దీన్ అజ్మల్ ఓటమి అస్సాం భవిష్యత్ రాజకీయాలను ద్విముఖంగా మార్చేసింది. ఇప్పుడు బీజేపీకి ఓట్లను చీల్చే పార్టీలు ఏవీ మిగలకపోవడంతో, భవిష్యత్తులో కాంగ్రెస్‌కు అధికార పీఠం సులువుగా చేజిక్కించుకునే మార్గం కనిపిస్తోంది. ఐదు రాష్ట్రాల్లోని ఎన్నికల ఫలితాలు మమతా బెనర్జీ, స్టాలిన్, బద్రుద్దీన్ అజ్మల్ వంటి నాయకులను బలహీనపరిచి, ప్రతిపక్ష "ఇండియా" కూటమిలో కాంగ్రెస్‌ను అత్యంత శక్తివంతమైన పాత్రలో నిలబెట్టాయి. గత కొన్ని దశాబ్దాలుగా ప్రాంతీయ పార్టీలైన టీఎంసీ, డీఎంకే బలంగా ఉండటం కాంగ్రెస్‌కు అతిపెద్ద సమస్యగా ఉండేది. ఈ 2026 ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్‌కు దేశ వ్యాప్తంగా ఒక కొత్త "అవకాశాన్ని" కల్పించాయని విశ్లేషకులు చెబుతున్నారు. బీజేపీ 'సాంస్కృతిక జాతీయవాదం'కు వ్యతిరేకంగా 'రాజ్యాంగ జాతీయవాదం'ను నిలబెట్టి ఓట్లు గెలుచుకోగలమని నిరూపించుకోవడానికి కాంగ్రెస్‌కు ఒక అవకాశం లభించిందని అంటున్నారు.2026 ఎన్నికల ఫలితాలు బీజేపీకి అధికారాన్ని ఇవ్వడంతో పాటు, కాంగ్రెస్‌కు ఒక ఆశాకిరణాన్ని కూడా అందించాయి. ఇకపై కాంగ్రెస్ కేవలం ఒక పార్టీ మాత్రమే కాదని, బీజేపీకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఉన్న ఏకైక శక్తి అని నిరూపించుకుంది.

# మారిపోతున్న ఎన(ర్న) లిస్టులు

విజయవాడ, మే 7,

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో సంక్లిష్ట పరిస్థితి కనిపిస్తోంది. గతంలో ఎన్నడూ లేని ఓ వాతావరణం ఇప్పుడు ప్రధానంగా కనిపిస్తుండడం చర్చకు దారితీస్తోంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా టీవీ డిబేట్లతోపాటు సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండేవారు ఇప్పుడు అదే పార్టీకి వ్యతిరేకంగా మారుతున్నారు. ఆ పార్టీ అగ్రనేతలపై ఇప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. అయితే వారిని దూరం పెట్టడం వల్ల అలా చెబుతున్నారా? లేకుంటే ఆశించిన స్థాయిలో వారికి చెల్లింపులు చేయడం లేదా? అందుకే వారు ఎదురు తిరిగారా? అనేది తెలియడం లేదు. ప్రధానంగా పాషా, కె ఎస్ ప్రసాద్ ఇప్పుడు వరుసగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలకు వ్యతిరేకంగా ఒకరికొకరు ఇంటర్వ్యూలు ఇస్తున్నారు. ఇక సాక్షి ఛానల్ లో జరిగే డిబేట్ కు హాజరు కాబోమని తేల్చి చెబుతున్నారు. అయితే ఇంతవరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వీరిని పెంచి పోషించిందన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పుడు ఈ ఇద్దరు ఆ పార్టీ అగ్ర నేతలను వ్యతిరేకిస్తుండడం చూస్తుంటే తెర వెనుక ఏదో జరిగిందన్న అనుమానం వ్యక్తం అవుతోంది.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియాతో పాటు డిజిటల్ మీడియాలో పనిచేసే వారికి ఆశించిన స్థాయిలో చెల్లింపులు జరగడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. పార్టీలో ఇటువంటి వాటిని సజ్జల రామకృష్ణారెడ్డి హ్యాండిల్ చేసేవారు. అయితే ఇప్పుడు చెల్లింపులు నిలిపివేయడంతో ఆయన టార్గెట్ అవుతున్నట్లు పొలిటికల్ వర్గాల్లో ప్రచారం నడుస్తోంది. సాక్షి ఛానల్ డిబేట్ లు అంటే ముందుగా పాషా, కె ఎస్ ప్రసాద్ గుర్తుకు వస్తారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా డిబేట్లు ఇచ్చే వీరు అవసరం అనుకుంటే వ్యక్తిగత దాడికి దిగుతారు కూడా. అంతలా ఉంటుంది వీరి జోరు. అయితే క్రమేపి ఇటీవల వారి నోరు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలపై పడుతోంది. తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తున్నారు. ప్రధానంగా సాక్షిలో కనిపించే వీరు ఇకనుంచి ఆ ఛానల్ వైపు వెళ్ళమని చెబుతుండడం కూడా విశేషం.మొన్న మధ్యన జగన్మోహన్ రెడ్డి మావిగన్ ప్రతిపాదన తెచ్చిన సంగతి తెలిసిందే. మచిలీపట్నం- విజయవాడ= గుంటూరును కలుపుతూ మావిగన్ అని పేరు పెట్టాలని సూచించారు జగన్మోహన్ రెడ్డి. సోషల్ మీడియాలో విపరీతంగా ట్రోల్స్ కు గురయ్యారు. ఆ సమయంలో విశ్లేషకుడి రూపంలో కేఎస్ ప్రసాద్ జగన్మోహన్ రెడ్డి తీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అయితే ఆ తర్వాత సాక్షి ఛానల్ డిబేట్లో పాల్గొని భిన్నంగా స్పందించారు. దీంతో అందరూ పేటీఎం డబ్బులు దక్కకపోవడంతోనే కేఎస్ ప్రసాద్ అలా మాట్లాడారని.. సోషల్ మీడియా వేదికగా కామెంట్లు పెట్టారు. అదే సమయంలో పాషా సైతం జగన్ మావిగన్ ప్రతిపాదనను గట్టిగానే తిప్పి కొట్టారు. అయితే ఇప్పుడు ఏకంగా ఇద్దరూ ఒకరికొకరు ఇంటర్వ్యూలు ఇస్తూ.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అగ్ర నేతలపై విరుచుకుపడుతున్నారు. జగన్మోహన్ రెడ్డి చుట్టూ వలయంగా ఏర్పడి పార్టీని పాతాళంలోకి నెట్టేస్తున్నారంటూ ఆరోపణలు చేస్తున్నారు.ప్రధానంగా సజ్జల రామకృష్ణారెడ్డి తీరుపై ఆ ఇద్దరూ ఇప్పుడు బాహటంగానే ఆరోపణలు చేస్తున్నారు. కోవర్టు అంటూ కొత్త ముద్ర వేస్తున్నారు. జగన్మోహన్ రెడ్డికి ఎలివేషన్లు ఇచ్చి.. పక్కదారి పట్టించి.. పార్టీని పూర్తిగా భ్రష్టు పట్టించారన్న ఆరోపణలతో రెచ్చిపోతున్నారు. అయితే వీరికి చెల్లింపులు నిలిచిపోయాయని.. అందుకే అలా మాట్లాడుతున్నారని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. అయితే సాక్షి ఛానల్ కు వెళ్తుంటే.. తమను పెయిడ్ ఆర్టిస్టుల మాదిరిగా చూస్తున్నారని.. అందుకే అటువైపు వెళ్ళమని చెబుతున్నారు. మొత్తానికి ఇద్దరు ఇప్పుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకులుగా మారిపోవడం చూస్తుంటే మాత్రం ఆ పార్టీలో ఒక రకమైన ఆందోళన కనిపిస్తోంది.

# రైల్వే జోన్ రాజకీయం...

విశాఖపట్టణం, మే 7,

ఎట్టకేలకు విశాఖ రైల్వే జోన్ ఏర్పాటుకు కేంద్రం గెజిట్ ఇచ్చింది. జూన్ ఫస్ట్ నుంచి విశాఖ కేంద్రంగా యాక్టివిటీ స్టార్ట్ కానుంది. అయితే రైల్వే జోన్ చుట్టూ ఇప్పుడు రాజకీయ రచ్చ నడుస్తోంది. కేకే లైన్ లేకుండా జోన్ ఎందుకు అంటూ పోరాటానికి సై అంటోంది వైసీపీ. ఇటు ప్రజా పోరాటాల వల్లే జోన్ వచ్చిందని వామపక్ష పార్టీలు చెప్పుకుంటుంటే..చంద్రబాబు కృషి వల్లే కేంద్రం జోన్ ఏర్పాటునకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది టీడీపీ నేతలు చెబుతున్నారు. దీంతో ఉత్తరాంధ్ర వేదికగా రైల్వే జోన్ సెంట్రిక్‌గా పొలిటికల్ ఫైట్ ఇంట్రెస్టింగ్‌గా మారింది.ఏపీ ప్రజల చిరకాల కోరిక నెరవేరింది. విశాఖపట్నం కేంద్రంగా రైల్వే జోన్ జూన్ ఫస్ట్ నుంచి స్టార్ట్ కానుంది. ఇప్పుడున్న గుంతకల్లు, గుంటూరు, విజయవాడ డివిజన్లతో పాటు విశాఖ డివిజన్‌ను కలిపి కొత్త రైల్వే జోన్ పని చేయనుంది. దక్షిణ కోస్తా జోన్ పేరుతో ఏర్పాటైన ఈ రైల్వే జోన్ కోసం ఉత్తరాంధ్ర ప్రజలు రాజకీయాలకు అతీతంగా సుదీర్ఘ పోరాటం చేశారు. రాష్ట్ర విభజన తర్వాత ప్రత్యేక రైల్వే జోన్ లేకుండానే ఇన్నాళ్లూ ఏపీలో రైల్వే యాక్టివిటీ నడిచింది.ఆంధ్రప్రదేశ్ వార్తలుప్రధాని నరేంద్ర మోదీ 2019 ఎన్నికల ప్రచారంలో విశాఖపట్నం వచ్చినపుడు రైల్వే జోన్ ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రధాని హామీ అమలు కావడానికి ఏడేళ్ల సమయం పట్టింది. విశాఖపట్నం కేంద్రంగా రైల్వే జోన్ ప్రకటించిన తర్వాత ప్రధాన కార్యాలయం నిర్మాణానికి అప్పట్లో కేంద్ర ప్రభుత్వం రూ.150 కోట్ల వరకు మంజూరు చేసింది. అయితే అవసరమైన భూముల కేటాయింపులో నాటి వైసీపీ ప్రభుత్వం జాప్యం చేసిందని టీడీపీ ఆరోపిస్తోంది. ఒక విధంగా రైల్వే జోన్ పనులను ముందుకు వెళ్లకుండా వైసీపీ అడ్డుకుందనే వాదన వినిపిస్తోంది.అయితే విశాఖ రైల్వే జోన్ క్రెడిట్ సీఎం చంద్రబాబు, కేంద్ర ప్రభుత్వానిదే అంటూ టీడీపీ నేతలు ప్రచారం చేసుకుంటుండగా..వైసీపీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. కొత్తవలస-కిరండూల్ లైన్ లేకుండా విశాఖ రైల్వేజోన్ ప్రకటించి తీవ్ర అన్యాయం చేశారని అంటోంది వైసీపీ. కేకే లైన్ లేకుండా విశాఖ రైల్వే జోన్ ఇచ్చి లాభమేంటి అంటూ ప్రశ్నిస్తోంది. కేకే లైన్‌ను మినహాయించి రైల్వే జోన్ ఇవ్వడమంటే..చనిపోయిన బిడ్డను చేతిలో పెట్టినట్టుగా ఉందని విమర్శిస్తోంది. సీఎం చంద్రబాబు అసమర్ధత వల్లే కేకే లైన్, అరకు కోరాపుట్ లేని రైల్వేజోన్ విశాఖకు దక్కిందని మండిపడుతోంది వైసీపీ. ఈ తరహా విశాఖ రైల్వేజోన్ రాష్ట్రానికి భారమే తప్ప మరొకటి కాదంటున్నారు ప్రతిపక్ష నేతలు.కేకే లైన్‌తో కూడిన విశాఖ రైల్వేజోన్ ఏర్పాటు చేయాలన్నదే తమ ప్రధాన డిమాండ్ అంటోంది వైసీపీ. కేకే లైన్, అరకు, కోరాపూట్ వంటి టూరిజం ప్రాంతాలు లేకుండా కేంద్రం ప్రకటించిన రైల్వేజోన్ ఏపీకి గుదిబండగా మారుతుందనే వాదన వినిపిస్తున్నారు. 446 కిలోమీటర్ల పొడవున్న ఉన్న కేకే లైన్ ఐరన్ ఓర్, మాంగనీస్, బాక్సైట్ ట్రాన్స్‌పోర్ట్‌కు ప్రధాన మార్గమే కాదు..విశాఖ రైల్వే జోన్‌కు అతిపెద్ద ఆదాయ వనరు అన్న విషయాన్ని మర్చిపోతుయారని ఫైర్ అవుతున్నారు వైసీపీ లీడర్లు. ఇక ప్రజా పోరాటాల ఫలితమే రైల్వే జోన్ అంటున్న వామపక్షాలు..కేకే లైన్ విషయంలో వైసీపీ డిమాండ్‌నే వినిపిస్తున్నాయి.ప్రతిపక్ష వైసీపీ వాదనపై..టీడీపీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తుంది. విశాఖపట్నం రైల్వేజోన్ విషయంలో వైసీపీ క్రెడిట్ చోరీకి పాల్పడుతోందని?రాజకీయ లబ్ధి కోసమే జగన్ అండ్ కో లేనిపోని విమర్శలు చేస్తున్నారని రివర్స్ అటాక్ చేస్తున్నారు తెలుగు తమ్ముళ్లు. 2019 నుంచి ఐదేళ్ల పాటు వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు ప్రత్యేక రైల్వే జోన్‌ను సాధించలేకపోయారో చెప్పాలని ప్రశ్నిస్తున్నారు. కూటమి ప్రభుత్వం వల్లే రైల్వేజోన్ వచ్చిందన్న విషయం అందరికీ తెలుసు అంటున్న తెలుగు తమ్ముళ్లు..విశాఖ కేంద్రంగా రైల్వేజోన్ కావాలన్న ఉత్తరాంధ్ర ప్రజల కల ఫలించిందని చెప్తున్నారు.తెలుగు వార్తలుకేంద్రంలో ఎన్డీయే భాగస్వామిగా ఉంది టీడీపీ. పైగా రాష్ట్రంలో కూటమి సర్కార్ ఉంది. ఈ ఈక్వేషన్స్ నేపథ్యంలోనే రైల్వే జోన్ సాధ్యమైందన్నది కూటమి నేతల వాదన. కేంద్రం అలా రైల్వే జోన్‌పై గెజిట్ రిలీజ్ చేసిందో లేదో..ఇలా పొలిటికల్ ఫైట్ స్టార్ట్ అయింది. విశాఖ కేంద్రం ఉత్తరాంధ్ర లీడర్లు..ఎవరి వాదన వాళ్లు వినిపిస్తున్నారు. ప్రజల చిరకాట కోరిక నెరవేరింది సరే కానీ..రైల్వే జోన్ చుట్టూ కొనసాగుతున్న రాజకీయ యుద్ధం ఎటు దారితీస్తుందో చూడాలి.

# గుంటూరు చుట్టూ ఆరు కారిడార్లు

గుంటూరు, మే 7,

గుంటూరు నగర రూపురేఖలను సమూలంగా మార్చేందుకు నగరపాలక సంస్థ భారీ ప్రణాళికను సిద్ధం చేసింది. రాజధాని ప్రాంతంలో కీలకమైన నగరంగా ఉన్న గుంటూరును మరింత సుందరంగా, సౌకర్యవంతంగా తీర్చిదిద్దేందుకు ఆరు ప్రధాన మార్గాలను 'మోడల్ కారిడార్లు'గా అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. సుమారు రూ. 210 కోట్ల అంచనా వ్యయంతో 39.3 కిలోమీటర్ల మేర ఈ రహదారులను ఆధునిక హంగులతో తీర్చిదిద్దనున్నారు.

అభివృద్ధి చేయనున్న ఆరు కారిడార్లు..

చుట్టుగుంట సెంటర్ ? గోరంట్ల రోడ్డు: 8 కి.మీ పొడవునా అమరావతి రోడ్డు వరకు విస్తరణ.

మద్రాసు గుంటూరు రోడ్డు: దండిమార్చి విగ్రహం నుండి అంకిరెడ్డిపాలెం వరకు 8 కి.మీ మేర అభివృద్ధి.ఇన్నర్ రింగ్ రోడ్డు: మహాత్మా గాంధీ ఇన్నర్ రింగ్ రోడ్డు నుండి జాతీయ రహదారి అనుసంధానం వరకు 12 కి.మీ.పొన్నూరు రోడ్డు: బీఆర్ స్టేడియం నుండి బైపాస్ వరకు 4.5 కి.మీ.గుంటూరు ? హనుమాన్ పాలెం రోడ్డు: చాకలి చెరువు నుండి బైపాస్ వరకు 3.8 కి.మీ.గుంటూరు వీఐపీ రోడ్డు: వెస్ట్ పోలీస్ స్టేషన్ నుండి బైపాస్ వరకు 3 కి.మీ మేర ఆధునికీకరణ.ప్రత్యేకంగా వెండింగ్ జోన్లు..ఈ ప్రాజెక్టులో భాగంగా కేవలం రోడ్ల విస్తరణే కాకుండా.. పాదచారుల కోసం ప్రత్యేక నడక మార్గాలు, సైకిల్ ట్రాకులు, కూర్చోవడానికి బెంచీలు ఏర్పాటు చేయనున్నారు. వీటితో పాటు స్మార్ట్ బస్ స్టాప్‌లు, ఆధునిక మరుగుదొడ్లు, డివైడర్ల మధ్య పచ్చదనం, వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు ఆధునిక బోలార్డ్స్‌ను ఏర్పాటు చేస్తారు. చిరువ్యాపారుల కోసం ప్రత్యేకంగా వెండింగ్ జోన్లను కూడా క్రమబద్ధీకరించనున్నారు. ఈ కారిడార్ల ద్వారా ట్రాఫిక్ సమస్యలు తగ్గడమే కాకుండా, నగర జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని కమిషనర్ మయూర్ అశోక్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఇక ప్రజల్లోనే లోకేష్

గుంటూరు, మే 7,

యువ నాయకుడు లోకేష్ ప్రభావం ఇప్పుడు ఏపీలో కనిపిస్తోంది. జాతీయస్థాయిలో కూడా ఆయన పేరు వినిపిస్తోంది. మొన్ననే ఆయన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కూడా అయ్యారు. పేరుకే టిడిపి జాతీయ అధ్యక్షుడిగా చంద్రబాబు ఉన్నారు. కానీ ఆయనకు మించి అన్నట్టు లోకేష్ వ్యవహారం నడుస్తోంది. ఆయన కనుసన్నల్లోనే పార్టీ ఉంది. పార్టీ ముందుకు సాగుతోంది. ప్రస్తుతం పార్టీపై పూర్తి పట్టు సాధించారు లోకేష్. ప్రభుత్వంలోనూ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రజల్లో మాస్ లీడర్ గా ఎదగాలని గట్టి ప్రయత్నం లో ఉన్నారట నారా లోకేష్. పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు యువగళం పాదయాత్ర చేపట్టారు. తనను తాను ప్రూవ్ చేసుకున్నారు. పార్టీ అధికారంలోకి వచ్చేందుకు దోహదపడ్డారు. ఇప్పుడు మంత్రిగా ఉండడంతో పాటు పార్టీ బాధ్యతలు తీసుకున్న దృష్ట్యా.. మరింత ప్రభావంతమైన నేతగా మారాలన్న ఆలోచనలో లోకేష్ ఉన్నట్లు తెలుస్తోంది.లోకేష్ పొలిటికల్ ఎంట్రీ సమయంలో ఆయన ఒక సాధారణ వ్యక్తి. చంద్రబాబు తనయుడు మాత్రమే. రాజకీయ వారసుడు అనిపించుకోలేకపోయారు. చాలా ఇబ్బందులు పడ్డారు కూడా. పైగా చంద్రబాబు లోకేష్ ను ఎమ్మెల్సీ చేసి ఆపై మంత్రివర్గంలోకి తీసుకున్నారు. ప్రత్యక్ష ఎన్నికల ద్వారా కాకుండా పరోక్షంగా ఆయనకు పదోన్నతి కల్పించారు. లోకేష్ కెరీర్ కు అది కూడా ఒక రకమైన ఇబ్బందికరమే. చంద్రబాబు రాజకీయ ప్రత్యర్థులంతా లోకేష్ ను వ్యతిరేకించడం ప్రారంభించారు. ఆయన వ్యక్తిత్వాన్ని కూడా హననం చేశారు. నిత్యం వ్యక్తిగతంగా టార్గెట్ చేశారు. అయితే అన్నింటిని మించి అన్నట్టు రాటు తేలారు నారా లోకేష్. రాజకీయంగా పూర్తిగా పట్టు సాధించారు. వ్యక్తిగతంగా తన శరీర ఆకృతిని మార్చుకున్నారు. పరిపూర్ణమైన నాయకుడిగా ఎదిగారు. అయితే ఇది చాలదు అనేది టిడిపిలో ఉన్న ఒక భావన.రాజకీయాల్లో మాస్ లీడర్ గా ఎదిగితేనే నాలుగు కాలాలపాటు గుర్తిస్తారు. అయితే చంద్రబాబు పాలనా థక్షుడు. ఆయన మాస్ లీడర్ కాదు. ప్రారంభంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్న చంద్రబాబు ఇప్పుడు చివరి దశలో మాత్రం చాలా గౌరవాన్ని దక్కించుకున్నారు. అయితే చంద్రబాబు మాదిరిగా కాకుండా లోకేష్ ఒక మాస్ లీడర్ గా ఎదగాలి అంటే ప్రజలతో మమేకమై పని చేయాల్సి ఉంటుంది. 2029 ఎన్నికలను టార్గెట్ చేసుకొని ఇప్పుడు లోకేష్ ప్రజల మధ్యకు వచ్చేందుకు పక్కాగా ప్రణాళిక రూపొందించుకున్నట్లు తెలుస్తోంది. తరచూ జిల్లాల్లో పర్యటిస్తూ పార్టీని అభివృద్ధి చేయడమే కాదు ప్రజల్లో తన ఇమేజ్ను పెంచుకునే ప్రయత్నంలో ఉన్నారట. త్వరలో రాష్ట్ర వ్యాప్త పర్యటనలకు శ్రీకారం చుడతారట. చూడాలి మరి అందులో ఎంతవరకు సక్సెస్ అవుతారో..

=====================

# పవన్ తప్పటడుగులు వేశారా... సోషల్ మీడియాలో ప్రశ్నలు

కాకినాడ, మే 7, (న్యూస్ పల్స్)

జనసేన అధినేత పవన్ కల్యాణ్ వేసిన రాజకీయ అడుగు ఆయనను ముఖ్యమంత్రిని కానివ్వకుండా చేశాయి. ఆయనసరైన సమయంలో ఎంట్రీ ఇవ్వకపోవడంతో పాటు, పార్టీ పెట్టిన వెంటనే ఇతర పార్టీలకు మద్దతు ప్రకటించడం కూడా ఆయన ముఖ్యమంత్రి కాకపోవడానికి కారణాలయ్యాయి. 2014లో పార్టీ పెట్టి పోటీ చేయకుండా బీజేపీ, టీడీపీకి బేషరతుగా మద్దతు ఇవ్వడంతోనే ఆయన రాజకీయ ప్రయాణం డిప్యూటీ సీఎం వరకే నిలిచిపోయిందంటున్నారు. పవన్ కల్యాణ్ తమిళనాడు ఎన్నికలను చూసి నేర్చుకోవాల్సింది చాలా ఉంది. ధైర్యాన్ని ప్రదర్శించలేకపోవడం, రాజకీయ శూన్యత ఉందా? లేదా? అన్నది చూసుకోకుండా పార్టీ పెట్టడం కూడా పవన్ ను సీఎం కుర్చీకి దూరం చేసింది.టీవీకే చీఫ్ విజయ్ పార్టీ పెట్టిన రెండేళ్లకే అధికారంలోకి వచ్చిన తర్వాత పవన్ కల్యాణ్ రాజకీయాల్లోకి వచ్చిన తీరుపై ఆంధ్రప్రదేశ్ లోనూ చర్చ జరుగుతుంది. పవన్ కల్యాణ్ విజయ్ లాగే చరిష్మా ఉన్న వ్యక్తి. లక్షలాది మంది అభిమానులు పవన్ సొంతం. ఇక కాపు సామాజికవర్గం మొత్తం ఆయన వెనక ఉంది. అదే ఆయనకు ప్లస్ పాయింట్ అయ్యేది.

2024 ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసి ఉంటే ఖచ్చితంగా సీఎం పదవి సులువుగా దక్కేదన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. కానీ పవన్ కల్యాణ్ అది చేయకుండా పొత్తులతో సరిపెట్టుకుని, జగన్ ను ఓడించడమే ధ్యేయంగా పెట్టుకోవడం ఆయన డిప్యూటీ సీఎం వరకే ఆగిపోవాల్సి వచ్చింది.ఏదైనా పార్టీ పెట్టిన తొలి నాళ్లలో ఉన్న క్రేజ్, ఇమేజ్ రాను రాను తగ్గుతుంది. అది పవన్ కైనా, విజయ్ కైనా ఒకటే ఫార్ములా. రాజకీయ పార్టీ పెట్టిన పవన్ కల్యాణ్ తొలుత బీజేపీని తిట్టిపోశారు. తర్వాత అదే పార్టీతో చేతులు కలిపారు. తర్వాత బీఎస్పీ, కమ్యునిస్టులతో కలసి నడిచారు. మళ్లీ టీడీపీ, బీజేపీతో జత కట్టారు. తనకంటూ ఒక సిద్ధాంతం ఉందని ప్రజలను నమ్మించలేకపోయారు. ఏదో వంద శాతం స్ట్రయిక్ రేట్ సాధించామని గొప్పలు చెప్పుకోవడం కాదు... అది జగన్ వైఫల్య పాలన వచ్చిందని తెలుసుకుంటే మంచిది. రాజకీయ పార్టీ పెట్టినప్పుడు, మార్పు కావాలనుకుంటున్నప్పుడు అన్నీ ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి. ఆవేశంతో తీసుకున్న నిర్ణయాలు పవన్ ను అక్కడి వరకే ఆపివేస్తాయి. ఇక అడుగు ముందుకు పడాలంటే పవన్ కు కష్టమే. ఈ సూత్రాన్ని అర్థం చేసుకోని పవన్ కల్యాణ్ పొలిటికల్ గా ఫెయిల్ అయినట్లేనన్నది రాజకీయ విశ్లేషకుల అంచనా.

# యువతుల ఫోటోలతో నకిలీ ప్రొ////
## “యయయయయయయయయయయయయయయయయసైట్స్

గుంటూరు, మే 7,

సైబర్ నేరగాళ్ల మాయలో సామాన్యులే కాదు, చదువుకున్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు సైతం పడి లక్షలాది రూపాయలు పోగొట్టుకుంటున్నారు. మ్యాట్రిమోనీ వెబ్‌సైట్లలో అందమైన యువతుల ఫోటోలతో నకిలీ ప్రొఫైల్స్ సృష్టించి, పెళ్లి పేరుతో నమ్మించి నిలువునా ముంచేస్తున్న ముఠాలు గుంటూరులో పంజా విసిరాయి. కేవలం నెల రోజుల వ్యవధిలో ఇద్దరు ఐటీ ఉద్యోగులు ఈ కేటుగాళ్ల చేతిలో చిక్కి సుమారు 11 లక్షల రూపాయలు కోల్పోయారు. నేరగాళ్లు ముందుగా మ్యాట్రిమోనీ సైట్లలో పరిచయమై, ఆ తర్వాత వాట్సాప్ కాల్స్ ద్వారా బాధితులతో సన్నిహితంగా మాట్లాడుతున్నారు. తాము కూడా ఉన్నత ఉద్యోగాల్లో ఉన్నామని, ఆస్తులు ఉన్నాయని నమ్మబలుకుతున్నారు. నమ్మకం కుదిరిన తర్వాత, “మన భవిష్యత్తు కోసం ఈ వెబ్‌సైట్‌లో ఇన్వెస్ట్ చేద్దాం.. మంచి లాభాలు వస్తాయి” అని ఆశ చూపుతున్నారు. వారి మాటలు నమ్మిన బాధితులు వారు పంపిన లింకుల్లో డబ్బులు డిపాజిట్ చేస్తున్నారు. పాతగుంటూరుకు చెందిన ఒక ఇంజనీర్ సుమారు రూ. 7 లక్షలు, అరండల్‌పేటకు చెందిన మరో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ రూ. 4 లక్షలు ఈ విధంగా పోగొట్టుకున్నారు. బాధితులు డబ్బులు జమ చేసిన కొద్దిరోజులకే సదరు యువతుల ఫోన్ నంబర్లు స్విచ్ఛాఫ్ అవ్వడంతో మోసపోయినట్లు గుర్తించి పోలీసులను ఆశ్రయించారు. ఈ సొమ్ము విదేశీ ఖాతాల్లోకి వెళ్లడం వల్ల రికవరీ చేయడం సవాలుగా మారిందని పోలీసులు చెబుతున్నారు. అపరిచిత


# తెలుగు రాష్ట్రాల్లో తమిళ పాలిటిక్స్ హీట్

హైదరాబాద్, మే 7,

విజయ్ విజయం తమిళనాడు పాలిటిక్స్‌లో హిస్టరీని క్రియేట్ చేసింది. కానీ తెలుగు స్టేట్స్‌లో దళపతి విక్టరీ రీసౌండ్ చేస్తోంది. ఏకంగా అధికార కూటమి, ప్రతిపక్ష వైసీపీ మధ్య సోషల్ మీడియా వార్‌కు దారితీసింది. ఇక సినీ స్టార్‌గా కెరీర్ ప్రారంభించి..పాలిటిక్స్‌లోకి వచ్చిన పవన్‌ను..విజయ్ విజయంతో పోలుస్తూ ట్రోల్ చేస్తున్న పరిస్థితి. ఇటు కేసీఆర్‌ను కూడా వదలడం లేదు సోషల్ మీడియా. విజయ్ విజయంపై ఇక్కడెందుకు ఇంత చర్చ? టీవీకే గ్రాండ్ విక్టరీ సెంట్రిక్‌గా ఒకరినొకరు ఎందుకు టార్గెట్ చేసుకుంటున్నట్లు?తెలుగు వార్తలుపార్టీ పెట్టిన రెండేళ్లలోనే విజయం. ఎంజీఆర్, ఎన్టీఆర్ తర్వాత ఆ స్థాయి రికార్డు విక్టరీ. అందుకే విజయ్ విజయం దేశం మొత్తం రీసౌండ్ చేస్తోంది. తెలుగు స్టేట్స్‌లో అయితే పొలిటికల్ హీట్‌ను..సోషల్ మీడియా ఫైట్‌ను మరో స్టేజ్‌కు తీసుకెళ్లింది. విజయ్ సాధించిన గెలుపుతో అందరూ ఆ క్రెడిట్‌లో భాగమయ్యేందుకు గేమ్ షురూ చేశారు. విజయ్ ప్రచారంలో ఓ అభిమాని జగన్‌తో ఆయన కలిసి ఉన్న ఫోటోను ఇస్తే..విజయ్ ఆ ఫోటోను తీసుకుని జనాలకు చూపించారు. ఆ విజువల్స్‌ను పోస్ట్ చేసి వైసీపీ సోషల్ మీడియా క్రెడిట్ కొట్టేసే ప్లాన్ చేస్తోంది. తమ అధినేత ఫోటో పెట్టుకుని విజయ్ గెలిచారన్నట్లుగా ఫ్యాన్ పార్టీ కలరింగ్ ఇస్తే..టీడీపీ స్ట్రాంగ్ కౌంటర్ ఇస్తోంది. జగన్ ఫోటో పెట్టుకుని విజయ్ గెలిస్తే..జగనే అధ్యక్షుడిగా ఉండి వైసీపీని ఎందుకు 11 సీట్లకే పరిమితం చేశారో చెప్పాలని కూటమి నుంచి అటాక్ స్టార్ట్ అయింది. ఇక వైసీపీ మాజీమంత్రి రోజాను కూడా వదిలిపెట్టడం లేదు సోషల్ మీడియా. ఆమె డీఎంకేకు ప్రచారం చేశారని..ఆమె ఎక్కడ అడుగు పెడిగే అక్కడ నాశనమే..ఐరన్ లెగ్ అంటూ ట్రోల్స్ చేస్తున్నారు. ఇక అన్నింటికి మించి పవన్ సెంట్రిక్‌గా సోషల్ మీడియాలో జరుగుతున్న చర్చ అంతా ఇంతా కాదు. విజయం అంటే విజయ్‌ది అని..ఒంటరిగా పోటీ చేసి తన బలంతో ..తానే 234 చోట్ల అభ్యర్థినని చెప్పి గెలిచారని హోరెత్తిస్తున్నారు. విజయ్‌తో పవన్‌ను పోలుస్తూ..ఏపీలో జనసేన పార్టీ పెట్టిన పదేళ్ల తర్వాత పవన్ డిప్యూటీ సీఎం అయ్యారంటూ ఎద్దేవా చేస్తున్నారు ఆయన రాజకీయ ప్రత్యర్థులు. 21 సీట్లు గెలిచే వంద శాతం స్ట్రైక్ రేట్ అని చెప్పుకుంటున్న జనసేనాని..విజయ్ సాధించిన విజయం తర్వాత ఎలా రియాక్ట్ అవుతారో అంటూ పోస్టులు పెడుతున్నారు. ఎంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చిందన్నట్లుగా ఉందని..విజయ్ విజయం..పవన్‌కు హెడెక్‌గా మారిందని వైసీపీ నేత అంబటి రాంబాబు ట్వీట్ చేసి చర్చకు దారితీశారు. సేమ్‌టైమ్ తెలంగాణ మాజీ కేసీఆర్‌ను కూడా కాంగ్రెస్ సోషల్ మీడియా ఓ రేంజ్‌లో ట్రోల్ చేస్తోంది. విజయ్ పార్టీ పెట్టే ముందు గులాబీ బాస్‌ను కలిశారని..ఆ తర్వాత తమిళనాడు ఎన్నికల్లో ఘన విజయం సాధించారని బీఆర్ఎస్ సోషల్ మీడియా పోస్టులు పెడుతుంది. అయితే గులాబీ పార్టీకి అదే స్థాయిలో కాంగ్రెస్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చేస్తోంది. స్టాలిన్ నుంచి మమత వరకు..కేజ్రీవాల్ నుంచి పినరయ్ విజయన్ వరకు..కేసీఆర్‌ను కలిసిన అందరూ..చివరకు జగన్ కూడా..సీఎం పదవిని కోల్పోయారని ట్రోల్స్ చేస్తున్నారు. దొర హ్యాండ్ ఎంత దరిద్రమైందో అంటూ కాంగ్రెస్ సోషల్ మీడియా పెట్టిన పోస్ట్ ఫుల్ వైరల్ అవుతోంది. ఆంధ్రప్రదేశ్ వార్తలుఇలా విజయ్ విజయం చుట్టూ తెలుగు స్టేట్స్‌లో పెద్ద రచ్చే జరుగుతోంది. టీవీకే విక్టరీని తమకు అడ్వాంటేజ్‌గా మలుచుకునేందుకు..ఏపీలో వైసీపీ కార్యకర్తలు, నేతలు టపాసులు కాల్చి, కేకులు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. క్రెడిట్ ఫైట్‌లో భాగంగా..ఎవరికి వారు సెల్ఫ్ ఎలివేషన్‌కు ప్రయారిటీ ఇవ్వడంతో వార్ పీక్స్‌కు చేరింది. దీంతో విజయ్ సెంట్రిక్‌గా ఒకరిని టార్గెట్ చేసుకుంటూ మరొకరు పోటాపోటీ పోస్టులతో హోరెత్తిస్తున్నారు. విజయ్ విజయం చుట్టూ తెలుగు రాష్ట్రాల్లో జరుగుతున్న చర్చ ఇంకెంత దూరం వెళ్తుందో చూడాలి.

# నా మొగుడు నాకే సొంతం...
## యూటర్న్ తీసుకున్న సంగీతా...

చెన్నై, మే 7,



తమిళనాడులో విజయ్ త్వరలో ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయబోతున్నారు. ఆయన పార్టీకి మ్యాజిక్ ఫిగర్ రాకపోయినప్పటికీ.. విజయ్ ఏమాత్రం వెనకడుగు వేయడం లేదు. పైగా ఇప్పటికే తన పార్టీ కీలక నేతల ద్వారా కాంగ్రెస్ అగ్ర నాయకత్వంతో మంతనాలు జరుపుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. దీనిపై డిఎంకె అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నప్పటికీ విజయ్ ఏ మాత్రం వెనకడుగు వేయడం లేదని తమిళ మీడియాలో వార్తలు వస్తున్నాయి.. పార్టీ నాయకులతో చర్చలు జరుపుతున్న విజయ్ ఇప్పటికే మంత్రివర్గం కూర్పు పై ఒక క్లారిటీకి వచ్చినట్టు తెలుస్తోందిరాజకీయంగా విజయ్ దూకుడు కొనసాగించినప్పటికీ.. కుటుంబ జీవితంలో మాత్రం విజయ్ ఇబ్బంది పడుతూనే ఉన్నారు. విజయ్ భార్య సంగీత ఎన్నికలకు ముందు ఆయనతో విడాకులు కావాలని కోర్టు మెట్లు ఎక్కారు. ఆయన ఒక నటి తో సంబంధాలు కొనసాగిస్తున్నారని.. అందువల్లే ఆయన నుంచి తనకు విడాకులు మంజూరు చేయాలని ఆమె ఆ ఫిర్యాదులో కోరారు. సంగీత భారీగా భరణాన్ని కోరిన నేపథ్యంలో.. విజయ్ అంత మొత్తం ఇవ్వలేదని చెప్పినట్టు అప్పట్లో తమిళ్ మీడియాలో వార్తలు వచ్చాయి. ఆ తర్వాత సంగీత కోరిన భరణం మొత్తం ఇస్తానని సంకేతాలు పంపినట్టు కూడా వార్తలు వచ్చాయి.సంగీత, విజయ్ విడాకుల వ్యవహారం కోర్టు మెట్ల దాకా ఎక్కిన నేపథ్యంలో.. ఈ కేసును మే 15 కు చెంగల్పట్టు ఫ్యామిలీ కోర్టు వాయిదా వేసింది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి హోదాలో విజయ్ కోర్టు ఎదుట హాజరవుతారా.. లేదా మినహాయింపు కొడతారా.. అనే విషయాలపై క్లారిటీ రావాల్సి ఉంది. ఈ చర్చ ఎలా సాగుతుండగానే విజయ్, సంగీత కు సంబంధించిన మరో వ్యవహారం ఇప్పుడు ఒకటి వెలుగులోకి వచ్చింది..విజయ్ ముఖ్యమంత్రి అవుతున్న నేపథ్యంలో తమిళనాడు ప్రథమ మహిళ హోదాను వదులుకోవడానికి సంగీత సిద్ధంగా లేరని తెలుస్తోంది. అందువల్లే తాను విజయ్ భార్యగా ఉండేందుకు సిద్ధమని సంకేతాలు పంపినట్టు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది.. త్రిష రెండో భార్యగా ఉన్నప్పటికీ తనకు ఇబ్బంది లేదని.. తను విజయ్ తో ఉంటానని సంగీత చెప్పినట్టు తెలుస్తోంది. అయితే ఇంతవరకు సంగీత ఈ విషయంలో ఎటువంటి అధికారిక ప్రకటన చేయలేదు. కనీసం తన సోషల్ మీడియా ఖాతా ద్వారా కూడా ఈ విషయాన్ని చెప్పలేదు. కొంతమంది గాసిప్ రాయుళ్లు మాత్రం పిచ్చిపిచ్చిగా వార్తలను ప్రసారం చేస్తున్నారు.. వాస్తవానికి విడాకుల కేసు కోర్టు మెట్ల దాకా వచ్చినప్పుడు సంగీత తన నిర్ణయాన్ని ఎలా వెనక్కి తీసుకుంటారని చాలామంది ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే విజయ్ కొడుకు తండ్రితో చాలా రోజులుగా దూరంగా ఉంటున్నాడు. తన పేరులో ఉన్న విజయ్ ని తొలగించుకున్నాడు.. విజయ్ కూతురు దివ్య కూడా తల్లితో ఉంటున్నది. ఆమె విదేశాలలో చదువుతున్నది. తన తండ్రి ఈ స్థాయిలో విజయం సాధించినప్పటికీ జేసన్, దివ్య ఇంతవరకు ఎటువంటి ప్రకటనలు సోషల్ మీడియాలో చేయలేదు. కనీసం తన తండ్రికి శుభాకాంక్షలు చెప్పినట్టు కూడా వార్తలు రాలేదు. విజయ్ భారీ విజయం సాధించిన తర్వాత ఆయన ఇంట్లో సంబరాలు జరిగాయి. అక్కడ దివ్య కనిపించలేదు.. జేసన్ కూడా లేదు. అలాంటప్పుడు విజయ్ తో కలిసి ఉంటానని సంగీత ఎలా అంటారని తమిళ విశ్లేషకులు చెబుతున్నారు.

# మే 17 తర్వాతే సౌత్ కు నైరుతి రుతుపవనాలు

చెన్నై మే 7, (న్యూస్ పల్స్)



తెలుగు రాష్ట్రాల ప్రజలకు ఇటీవలే వాతావరణ శాఖ శుభవార్త చెప్పింది. మే 17న రుతుపవనాలు అండమాన్ నికోబార్ దీవులను తాకుతాయని వెల్లడించింది. దీంతో ఈసారి ముందస్తు వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈ క్రమంలో తాజాగా ఐఎండీ మరో షాకింగ్ విషయం తెలిపింది. తూర్పు, మధ్య పసిఫిక్ ఉపరితల జల ఉష్ణోగ్రతల్లో కొంత సమయం తటస్థ స్థితిలో ఉన్న తర్వాత ఇప్పుడు అవి ఎల్‌నినో సూచక స్థాయి దిశలో కదలడంతో ప్రపంచ వాతావరణ సంస్థలు ఎల్‌నినో ప్రారంభం అయిందని అధికారికంగా ప్రకటించింది. ఈ మార్పులు గత తటస్థ కాలంతో పోలిస్తే సముద్ర వాతావరణంలో శక్తి విడుదల, గాలుల నమూనాల్లో మార్పులకు దారి తీస్తాయి. ఇన్కాయిస్ ప్రక్రియలో ఈ ఏడాది ఏప్రిల్‌లో వరకు సాధారణ పరిస్థితులు కొనసాగాయని, తాజా డేటా ఆధారంగా ఎల్‌నినో దశలోకి మారినట్లు ప్రకటించింది. ప్రస్తుత మే నుంచి 2027 జనవరి వరకు ఈ పరిస్థితులు స్థిరంగా కొనసాగొచ్చని బులిటెన్ విడుదల చేసింది. పసిఫిక్ జల ఉష్ణోగ్రతలను పరిశీలించేందుకు ఇన్కాయిస్ ప్రత్యేక డీప్ లెర్నింగ్ మోడల్ బేయేసియన్ కన్వల్యూషనల్ న్యూరల్ నెట్వర్క్‌ను అభివృద్ధి చేసింది. ఈ మోడల్ గత ఎల్‌నినో, లా నినా నమూనాలతోపాటు ఇప్పటి డేటాను కలిపి భవిష్యత్ పరిస్థితులను విశ్లేషిస్తుంది. ఇది వచ్చే ఎల్‌నినో లేదా లా నినా ప్రక్రియలను సుమారు 24 నెలల ముందుగా అంచనా వేసే సామర్థ్యాన్ని అందిస్తున్నట్లు సంస్థ ప్రకటించింది. ఇది దేశాలు, వ్యవసాయ, నీటి నిర్వహణ, విద్యుత్ విభాగాలకు ప్రణాళిక రూపకల్పనకు కీలక సాధనంగా మారుతుంది. భూమధ్యరేఖ వెంబడి పసిఫిక్‌లో ఎల్‌నినో స్థితి ఏర్పడితే, అది భారత నైరుతి రుతుపవనాల ప్రవేశం, బలం, వర్షపాత పంపిణీ మీద గణనీయ ప్రభావం చూపే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు పలుమార్లు గుర్తించారు. ఈ సందర్భంలో సాధారణ కంటే తక్కువ లేదా అసమంగా వర్షాలు కురుస్తాయి. కొన్ని ప్రాంతాల్లో అనావృష్టి పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉంటుంది. ఇప్పటికే కొన్ని అధ్యయనాలు ఈ ఏడాది భారత్‌లో వర్షపాతం సగటు కంటే తక్కువగా ఉండొచ్చని, రుతుపవన రాక కొంత ఆలస్యమవుతుందని సూచిస్తున్నాయి. ఇది వ్యవసాయం, నీటి లభ్యత, విద్యుత్ ఉత్పత్తి, ఆహార ధరల వంటి అనేక రంగాలపై ప్రతికూల ప్రభావాన్ని చూపే అవకాశం ఉంది. ఎల్‌నినో ప్రభావం పసిఫిక్‌తో పరిమితం కాకుండా, ఉత్తర హిందూ మహాసముద్రంలో కూడా బలమైన, దీర్ఘకాలిక సముద్రపు వేడిగాలుల ఏర్పాటుకు దారి తీస్తోంది. ఈ వాతావరణ ప్రస్థానాలు స్థానిక ఉష్ణోగ్రతల్లో పెరుగుదలతో పాటు పవన వేగం, చక్రవాతాల నమూనాల్లో మార్పులు కలిగిస్తాయి. ఇవి సముద్ర జీవవైవిధ్యం, చేపబట్టు ప్రదేశాలు, ద్వీపు పర్యావరణాలు వంటి అనేక విభాగాలపై ఒత్తిడిని పెంచుతాయి. పర్యావరణ సమతౌల్యం దెబ్బతినడం వల్ల స్థానిక ఆర్థిక వ్యవస్థలు, ఆహార భద్రత, మానవ ఆరోగ్యానికి పొడుగు సమయ ప్రభావాలు కొనసాగే అవకాశం ఉంది.

# కశ్మీరానికి వస్తున్న పండిట్స్...ఘర్ వాపసీ

శ్రీనగర్, మే 7, (

మ్మూ?కశ్మీర్‌లో ధ్వంసమైన హిందూ ఆలయాల పునరుద్ధరణ కాశ్మీరీ పండిట్ల సంస్కృతిక, భావమయమైన పునరుజ్జీవనానికి ప్రతీకగా మారుతోంది. ముస్లిం సోదరులు, ప్రభుత్వ యంత్రాంగం కలిసి చేస్తున్న పునరుద్ధరణ కార్యక్రమం సామాజిక సహజీవనం, సంస్కృతి పునరుద్ధరణ రెండింటికీ కొత్త శకని సూచిస్తోంది. 1989?90 సమయంలో కశ్మీర్‌లో ఉగ్రవాద హింస, సామూహిక భయం కారణంగా కాశ్మీరీ పండిట్లు పెద్ద ఎత్తున వలస వెళ్లారు. ఆ సమయంలో అనేక హిందూ ఆలయాలు మూసేసి, కొన్ని ధ్వంసమై, ఇంకొన్ని శిథిలావస్థకు చేరాయి. ఇప్పుడు ఈ ఆలయాలను పునరుద్ధరించడం కేవలం భవనాల రిపేరు కాకుండా, 35?36 ఏళ్ల విరామానికి తర్వాత హిందూ సాంస్కృతిక హెచ్చుతగ్గలను సరిదిద్దే ప్రయత్నంగా కనిపిస్తోంది. తాజాగా కుప్వాడా జిల్లాలోని చంద్రీగ్రామ్ ఆలయం, బారాముల్లా జిల్లాలోని వినాయక ఆలయం పునరుద్ధరణ జరిగింది. ఈ రెండు ఆలయాలు 1989లో కాశ్మీరీ పండిట్లు వలస వెళ్లిన తర్వాత ధ్వంసమై, ఆ ప్రాంతంలో గంటలు మూగబోయాయి. వేదమంత్రాలు ఆగిపోయాయి. ఇప్పుడు విగ్రహాల పునఃప్రతిష్ఠ, హవనం, పూజలతో 36?37 ఏళ్ల తర్వాత మళ్లీ ఆ గడ్డపై గంటలు మోగడం, వేదమంత్రాలు వినిపించడం గ్రామ సమీకరణను భావపరంగా పునరుజ్జీవింపచేసిందనే భావన కలిగిస్తుందిపునరుద్ధరణ కార్యక్రమాలకు ప్రభుత్వం, లెఫ్టినెంట్ గవర్నర్ యంత్రాంగం మద్దతు ఇస్తున్నారు. ప్రధాన పాత్ర పోషిస్తున్నది కాశ్మీరీ పండిట్లు, స్థానిక ముస్లిం సమాజం. 1989?90 కాలంలో కొంతమంది కాశ్మీరీ పండిట్లను పారిపోనీయడానికి సహకరించిన వ్యక్తులే ఇప్పుడు వారి ఆలయాల పునరుద్ధరణకు సహకరిస్తున్నారు. ఇది విభేదాల నుంచి సహబాధ్యత వైపు మారే ఒక సూచనగా కనిపిస్తోంది. ముస్లిం స్థానికులు ఆలయ భూమి హద్దుల గుర్తింపు, భద్రత, స్థల పరిరక్షణలో చేయూతనిస్తున్నారు. పునరుద్ధరించిన ఆలయాల్లో పూజలు, హవనం, హోమం, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కాశ్మీరీ పండిట్లు పాల్గొనే జాతరలు ప్రాముఖ్యం పొందాయి. కాశ్మీరీ హిందూ పండిట్లు ఏటా జాతరలు నిర్వహించాలని నిర్ణయించడం వారి సంస్కృతిక, ధార్మిక జీవనాన్ని పునరుద్ధరించుకునే పథకం లాగా కనిపిస్తోంది. వేదమంత్రాలు, శంఖం శబ్దాలు తిరిగి వినిపించడం కేవలం ధార్మిక చర్యలకు పరిమితం కాక, కశ్మీర్ లోయలో హిందూ సాంస్కృతిక వారసత్వం మళ్లీ పునరుజ్జీవిస్తోందనే సందేశం కూడా ఇస్తుంది. ప్రస్తుతం 3,729 కణాల ఆలయ భూములను స్వాధీనం చేసుకోవడం ద్వారా ఆలయాల పరిరక్షణ, భవిష్యత్ నిర్వహణ కోసం ప్రభుత్వం చాలా ప్రణాళికాబద్ధంగా పని చేస్తోందనే భావన కలిగిస్తుంది. వేడుకల తర్వాత ఆలయాల పరిరక్షణ బాధ్యత ప్రభుత్వం స్వీకరించడం ద్వారా భద్రత, నిర్వహణ, నిధుల ప్రవాహం క్రమబద్ధం అవుతుంది; ఇది కాశ్మీర్‌లో హిందూ ధర్మం పై ప్రత్యక్ష ప్రభుత్వ మద్దతు ఉందనే సందేశాన్ని పంపుతుంది.

# ఒకే ఫ్యామిలీ నుంచి ముగ్గురు గెలుపు

చెన్నై, మే 7, (

ఈసారి తమిళనాడు ఎన్నికల్లో విజయ్ తర్వాత స్థాయిలో మీడియాను ఆకర్షించిన వ్యక్తి పేరు శాంటియాగో మార్టిన్. ఇతడేమీ మామూలు వ్యక్తి కాదు. అన్ని రాజకీయ పార్టీలకు కావలసిన వాడు. భారీగా డబ్బున్నవాడు. అంతకుమించి పలుకుబడి ఉన్నవాడు.

లాటరీ కింగ్ శాంటియాగో మార్టిన్ కుటుంబం నుంచి ఈసారి ముగ్గురు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. మార్టిన్ సతీమణి లీమారోస్ లాల్ గుడి నియోజకవర్గం నుంచి అన్న డీఎంకే తరఫున పోటీ చేసి గెలిచారు. ఈమె అన్న డీఎంకే పార్టీకి మహిళా విభాగ సంయుక్త కార్యదర్శిగా కొనసాగుతున్నారు. మార్టిన్ అల్లుడు అధవ్ అర్జున టీవీకే కు జనరల్ సెక్రటరీగా కొనసాగుతున్నారు. ఇతడు విక్కీ వక్కం తాళం నుంచి విజయం సాధించారు. మార్టిన్ కుమారుడు చార్లెస్ పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేశారు. ఇక్కడ కామరాజు నగర్ స్థానం నుంచి ఆయన ఎమ్మెల్యేగా గెలిచారు. ఈయన లాచీయ జననాయక కట్చి పార్టీ తరఫున పోటీ చేశారు. మార్టిన్ ఇప్పుడంటే అగర్భ శ్రీమంతుడు. కానీ ఒకప్పుడు ఆయన మయన్మార్లో కూలి. 1988లో మన దేశానికి తిరిగి వచ్చాడు. తమిళనాడు రాష్ట్రంలో లాటరీ వ్యాపారం ప్రారంభించాడు. ఆ తర్వాత దానిని కర్ణాటక, కేరళ రాష్ట్రాలకు విస్తరించాడు. ఆ తర్వాత ఈశాన్య భారతదేశం వెళ్లిపోయాడు. అక్కడ ప్రభుత్వాలతో కలిసి లాటరీ స్కీమ్ లు నిర్వహించాడు. భూటాన్, నేపాల్ ప్రాంతాలలో కూడా ఈ వ్యాపారాలు సాగించాడు. రియల్ ఎస్టేట్, కన్స్ట్రక్షన్, టెక్స్టైల్, హాస్పిటాలిటీ రంగాల్లోకి ప్రవేశించాడు. ఈయన ఆధ్వర్యంలో ఫ్యూచర్ గేమింగ్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ కొనసాగుతోంది. దీనికి వరల్డ్ లాటరీ అసోసియేషన్ లో మెంబర్షిప్ ఉంది. క్యాసినో, ఆన్లైన్ గేమింగ్ వంటి వాటిని ఇది నిర్వహిస్తూ ఉంటుంది. మార్టిన్ లాటరీ స్కీమ్ లతో వ్యాపారాన్ని మొదలుపెట్టాడు. అయితే అందులో మోసాలకు పాల్పడ్డాడు. వేలకోట్ల ఆర్థిక సామ్రాజ్యాన్ని నిర్మించాడు. నీతో కేంద్ర దర్యాప్తు సంస్థలు అతని కార్యాల మీద దాడులు చేశాయి. ఈ సంస్థ నుంచి వచ్చిన ఆదాయంతో మార్టిన్ కోట్లు ఖర్చుపెట్టి ఆయా రాజకీయ పార్టీల బాండ్లు కొనుగోలు చేశారు. 2019, 24 కాలంలో అనేక రాజకీయ పార్టీలకు ఈయన విరాళాలు ఇచ్చాడు.

# కాంగ్రెస్ నిజ స్వరూపం బయటపడింది

డిఎంకే

హైదరాబాద్

కాంగ్రెస్ ఇలా వెన్నుపోటు పొడుస్తుందని అనుకోలేదు. కాంగ్రెస్ వారి నిజస్వరూపాన్ని బయటపెట్టారని డీఎంకే నాయకుడు టీ.ఆర్. బాలు మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ కష్టంలో ఉన్నప్పుడు డీఎంకే దానికి మిత్రపక్షంగా వారికి నిలిచినందుకు ఇవాళ మూల్యం చెల్లించుకున్నాము. సెక్యులర్ ప్రోగ్రెసివ్ అలయన్స్ తో మెజారిటీ సీట్లు గెలుచుకుని, కూటమి కార్యకర్తల కృషితో ఎన్నికల్లో పోటీ చేసి గెలిచి.. సిగ్గులేకుండా ఐదుగురు ఎమ్మెల్యేలతో ప్రతిపక్షంలోకి వెళ్లిపోయారు. బీజేపీ అన్ని రాష్ట్రాల్లో అధికారాన్ని చేజిక్కించుకోవడానికి చేసినట్లు కాంగ్రెస్ తమిళనాడులో కూడా అదే చేసిందని అయన ఆరోపించారు. 2019 ఎన్నికలలో, రాహుల్ గాంధీని ప్రధానమంత్రి అభ్యర్థిగా అధికారికంగా ప్రకటించడానికి కాంగ్రెస్ పార్టీయే సంకోచించినప్పుడు.. మా పార్టీ నాయకుడు, ప్రధాన కార్యదర్శి స్టాలిన్, రాహుల్ గాంధీకి మద్దతుగా నిలిచారని అయన గుర్తు చేసారు. –

# కాంగ్రెస్ నిజ స్వరూపం బయటపడింది డిఎంకే

హైదరాబాద్

కాంగ్రెస్ ఇలా వెన్నుపోటు పొడుస్తుందని అనుకోలేదు. కాంగ్రెస్ వారి నిజస్వరూపాన్ని బయటపెట్టారని డీఎంకే నాయకుడు టీ.ఆర్. బాలు మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ కష్టంలో ఉన్నప్పుడు డీఎంకే దానికి మిత్రపక్షంగా వారికి నిలిచినందుకు ఇవాళ మూల్యం చెల్లించుకున్నాము. సెక్యులర్ ప్రోగ్రెసివ్ అలయన్స్ తో మెజారిటీ సీట్లు గెలుచుకుని, కూటమి కార్యకర్తల కృషితో ఎన్నికల్లో పోటీ చేసి గెలిచి.. సిగ్గులేకుండా ఐదుగురు ఎమ్మెల్యేలతో ప్రతిపక్షంలోకి వెళ్లిపోయారు. బీజేపీ అన్ని రాష్ట్రాల్లో అధికారాన్ని చేజిక్కించుకోవడానికి చేసినట్లు కాంగ్రెస్ తమిళనాడులో కూడా అదే చేసిందని అయన ఆరోపించారు. 2019 ఎన్నికలలో, రాహుల్ గాంధీని ప్రధానమంత్రి అభ్యర్థిగా అధికారికంగా ప్రకటించడానికి కాంగ్రెస్ పార్టీయే సంకోచించినప్పుడు.. మా పార్టీ నాయకుడు, ప్రధాన కార్యదర్శి స్టాలిన్, రాహుల్ గాంధీకి మద్దతుగా నిలిచారని అయన గుర్తు చేసారు. -

# నివేదికలుగానే ఫీజు నియంత్రణ

హైదరాబాద్, మే 7,

మధ్యతరగతి కుటుంబాలు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆశగా ఎదురుచూస్తున్న ఫీజుల నియంత్రణ చట్టం అటకెక్కినట్టుగా కనిపిస్తున్నది. ప్రభుత్వం దీనిపై ఏమాత్రం ఉలుకు పలుకు లేకుండా నిమ్మకునీరెత్తినట్టు కనిపిస్తున్నది. దీంతో ఈ విద్యాసంవత్సరం కూడా తల్లిదండ్రుల జేబులకు చిల్లు తప్పదనిపిస్తున్నది. పలు కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల దోపిడీకి అడ్డుకట్ట వేస్తామన్న ప్రభుత్వ హామీ ఈ ఏడాది కూడా అమలుకు నోచుకునేలా కనిపించడంలేదు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లవుతున్నది. దీన్ని ఇప్పటి వరకు అమలు చేయని పరిస్థితి ఉంది. జూన్ 12 నుంచి కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కూడా కాబోతోంది. ఫీజులను నియంత్రిస్తామన్న ప్రకటన ప్రభుత్వం నుంచి రాకపోవడంతో తల్లిదండ్రులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో ప్రైవేట్ పాఠశాలలు ఇష్టారాజ్యంగా ఫీజులను పెంచకుండా నియంత్రించే చర్యలు ప్రతి ఏటా మాటలకే వరిమితమవుతున్నాయి. విద్యాసంవత్సరం ప్రారంభమవుతోందంటే తల్లిదండ్రుల జేబులు అదురుతున్నాయి. నియంత్రణకు చట్టం తెచ్చేందుకు బిల్లు సిద్ధమై ఏడాదవుతున్నా ఈసారి కూడా అది చట్టరూపం దాల్చలేదు. ఇదే అదునుగా ప్రైవేట్ పాఠశాలలు తమ ఇష్టారాజ్యంగా 20 --30 శాతం వరకు ఫీజులను పెంచేసుకుంటున్నాయి.ప్రైవేట్ పాఠశాలలు 2026-27 విద్యాసంవత్సరానికి ఫీజులు ఖరారు చేసి ఏకంగా అడ్మిషన్లు కూడా చేపడుతున్నారు. ఒకవైపు పుస్తకాలు, యూనిఫామ్స్ మోత.. మరోవైపు ఫీజుల వాత అన్నట్టుగా తల్లిదండ్రుల పరిస్థితి ఉన్నది. చెప్పాలంటే ఇంజినీరింగ్ వార్షి క ట్యూషన్ ఫీజు కంటే కూడా స్కూల్ ఫీజు లు ఎక్కువగా ఉన్న పాఠశాలలూ ఉన్నాయి. ఈ తరహా ఫీజులున్న పాఠశాలలు ఎక్కువగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే ఉన్నాయి.రాష్ట్రంలో ఇంజినీరింగ్ విద్యకు అత్యధిక వార్షిక ట్యూషన్ ఫీజు రూ.1.83 లక్షలు, ఆతర్వాత రూ.1.75 లక్షలు కాగా, కనీస ఫీజు రూ.45 వేలే ఉన్నది. అదే పాఠశాలల విషయానికి వస్తే రూ.5 లక్షలకుపైగా వసూ లు చేసే స్కూళ్లు దాదాపు 10కిపైనే ఉన్నాయి. తమ వద్దే పుస్తకాలు, నోట్ బుక్స్, టై, బెల్టు, షూస్, యూనిఫామ్స్ కొనుగోలు చే యిస్తూ వాటిపైనా బాదుతున్నారు. ఫీజుల నియంత్రణకు సంబంధించిన డ్రాఫ్ట్ ఎప్పుడో సిద్ధమైంది. పాఠశాల విద్యాశాఖ డ్రాఫ్ట్ రూపొందించి గతంలో ప్రభుత్వానికి కూడా సమర్పించింది. తెలంగాణ విద్యాకమిషన్ కూడా తెలంగాణ ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ స్కూల్ రెగ్యులేటరీ అండ్ మానిటరింగ్ కమిషన్ ముసాయిదా బిల్- 2025ను గతేడాది జనవరిలో ప్రభుత్వానికి రిపోర్టును అందించింది. రెండు నెలల క్రితం తెలంగాణ విద్యావిధానం--2026 పేరుతో కమిషన్ నివేదిక కూడా ఇచ్చింది.ఈ నివేదికల ప్రకారం ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లు ప్రతి రెండేండ్లకోసారి 8 శాతం వరకు ఫీజులు పెంచుకోవచ్చని వెసులుబాటు కల్పించాలని ప్రతిపాదించారు. ఒకవేళ 8 శాతం ఫీజు మించితే జిల్లాస్థాయి ఫీజు రెగ్యులేటరీ కమిటీ అనుమతి తీసుకోవాల్సి ఉం టుంది. స్కూళ్లను బట్టి కూడా ఫీజులుండాలనే ప్రతిపాదన ఉన్న ది. క్యాబినెట్ సమావేశంలో దీనిపై చర్చించి అసెంబ్లీ సమావేశాల్లో చట్టం చేస్తారని అంతా అ నుకున్నారు. కానీ అది కార్యరూపం దాల్చలేదు.గతంలో ఎన్నోసార్లు ఇలా ఫీజుల అంశంపై కమిషన్/ కమిటీలు ప్రభుత్వానికి నివేదికలను సమర్పించాయి. ప్రొఫెసర్ తిరుపతిరావు కమిటీ కూడా దీనిపై 2017లో ప్రభు త్వానికి నివేదిక ఇచ్చింది. అందులోనూ ఏటా 10 శాతానికి ఫీజులు మించ కూడదని స్పష్టంచేశారు. కానీ అదీ కూడా అటకెక్కింది. పుష్కర కాలంగా ప్రభుత్వాలు, కమిటీలు నివేదికలకే పరిమితమవుతుంటే.. పాఠశాలలు మాత్రం తమ పని తాము చేసుకుంటామన్నట్టు ఏటా ఫీజులు పెంచుతున్నాయి

=============

# సైబర్ నేరలపై పోలీసుల ఉక్కుపాదం

హైదరాబాద్, మే 7,

పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. భావ ప్రకటన స్వేచ్ఛ పేరుతో ఇతరులను కించపరిచినా, అసభ్యకరంగా పోస్టులు చేసినా కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరిస్తున్నారు. కేవలం గత నాలుగు నెలల్లోనే ఇలాంటి ఉల్లంఘనలకు పాల్పడిన సుమారు 100 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు.హైదరాబాద్‌కు చెందిన ఒక యువకుడు పోలీస్ ఉన్నతాధికారిపై అనుచిత పోస్ట్ చేయడంతో, అతనిపై కేసు నమోదైంది. విషయం తెలుసుకున్న సదరు సంస్థ అతడిని ఉద్యోగం నుంచి తొలగించింది. నల్గొండ జిల్లాకు చెందిన మరో యువకుడు ఓ నటి ఫోటోను మార్ఫింగ్ చేసి అసభ్యకర కామెంట్లతో పోస్ట్ చేయడంతో పోలీసులు అరెస్ట్ చేశారు. సామాజిక మాధ్యమాల్లో వేధింపులకు గురిచేస్తున్న సుమారు 20 మంది పోకిరీలను పోలీసులు అరెస్ట్ చేయగా, మరో 25 మంది జాబితా సిద్ధంగా ఉన్నట్లు సమాచారం.సైబర్ పోలీసులు నిరంతరం సామాజిక మాధ్యమాలపై 'సైబర్ పెట్రోలింగ్' నిర్వహిస్తున్నారు. బాధితులు ఫిర్యాదు చేయకపోయినా, సుమోటోగా కేసులు నమోదు చేస్తూ అనుచిత పోస్టులు చేసే వారి ఖాతాలపై నిఘా ఉంచుతున్నారు. వాట్సాప్ గ్రూపుల్లో వచ్చే మార్ఫింగ్ ఫోటోలు, వీడియోలకు స్పందించి చాలామంది తెలియక ఇరుక్కుంటున్నారని సైబరాబాద్ సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు.కొందరు ఈ అనుచిత పోస్టుల వల్ల తమ ఉపాధిని కోల్పోతున్నారు. వేధింపుల కారణంగా బాధితుల కుటుంబాల్లో తీవ్ర ఆవేదన నెలకొంటోంది. ఒక యువకుడు సోషల్ మీడియాలో చేసిన వేధింపుల వల్ల బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనివల్ల తన కొడుకు భవిష్యత్తు నాశనమైపోతుందని ఆందోళన చెందిన తండ్రి, మనస్తాపంతో ఆత్మహత్యకు ప్రయత్నించాడు.సామాజిక మాధ్యమాల్లో చేసే పోస్టులు ఇతరుల వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించేలా లేదా కించపరిచేలా ఉండకూడదని నగర సైబర్ క్రైమ్ డీసీపీ అరవింద్‌బాబు సూచించారు. ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే వెంటనే సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ లేదా 1930 నంబరుకు ఫిర్యాదు చేయాలని కోరారు.

# టీ కాంగ్రెస్ ఇంచార్జీలకు అదృష్టం

హైదరాబాద్, మే 7,

తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాలు కొందరికి అస్సలు కలిసి రాకుంటే? మరికొందరు మాత్రం ఇక్కడ అడుగు పెడితే నక్కతోక తొక్కినట్టు ఫీలవుతున్నారా? రాష్ట్ర వ్యవహారాలు చూసిన కొందరికి అదృష్టం తేనెపట్టు పట్టినట్టు పడుతోందా? ఇక్కడి వ్యవహారాలు ఎవరికి కలిసి రావడం లేదు? ఎవరెవరికి కలిసి వచ్చాయి..? అసలా లక్కీ భాస్కర్స్ ఎవరు? కాంగ్రెస్ పార్టీలో ఒక రాష్ట్రానికి ఏఐసీసీ ఇన్చార్జ్ పదవితో పాటు.. కార్యదర్శుల నియామకం కూడా ఉంటుంది. ఆ రకంగా స్టేట్‌లో ప్రస్తుతం ఏఐసీసీ నుంచి ఇద్దరు కార్యదర్శులు పనిచేస్తున్నారు. లోక్‌సభ నియోజకవర్గాల వారీగా ఇన్ఛార్జ్‌ల హోదాలో పార్టీ వ్యవహారాలను చక్కబెడుతున్నారు. అయితేతాజాగా ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు వెలువడ్డ క్రమంలో ఓ సరికొత్త చర్చ మొదలైంది. తెలంగాణకి కాంగ్రెస్ వ్యవహారాల ఇన్ఛార్జ్‌లుగా వస్తున్న వాళ్లకు కలసి రావడం లేదుగానీ?.. కార్యదర్శులుగా వచ్చే వాళ్లకి మాత్రం కలిసి వస్తోంది, వాళ్ళకు రాజకీయంగా అవకాశాలు పెరుగుతున్నట్టు విశ్లేషిస్తున్నారు.తెలంగాణ కాంగ్రెస్‌కు ఇన్చార్జ్‌లుగా పనిచేసిన వాళ్లలో కుంతియా నుంచి మొదలుకొని దీపాదాస్ మున్షీ వరకు చూస్తే.. వాళ్ళు ఎవ్వరికీ రాజకీయంగా పెద్దగా కలిసి వచ్చింది లేదు. వివాదాలతో ఠాగూర్‌ను రాష్ట్ర ఇన్చార్జ్‌గా తొలగించారు. ఎన్నికలకు ముందున్న ఠాక్రేను ప్రభుత్వం ఏర్పడగానే. ఇక్కడి నుండి షిఫ్ట్ చేశారు. ఇక దీపాదాస్ మున్షీని కూడా వివాదాలు.. విమర్శలతోనే తప్పించింది అధిష్టానం. ఐతే ఇన్ఛార్జ్‌లకు కలిసి రాకున్నాఎఐసిసి కార్యదర్శులకు మాత్రం తెలంగాణ కలిసి వస్తోంది. ఎన్నికల సమయంలో ఇక్కడ ఎఐసిసి కార్యదర్శిగా పనిచేసిన బోసురాజు ప్రస్తుతం కర్ణాటక క్యాబినెట్లో ఉన్నారు.ఠాక్రే తోపాటుగా బోస్ రాజు తెలంగాణ కాంగ్రెస్ నాయకులను సమన్వయం చేయడంలో కీలకంగా పని చేశారు. ఇక ప్రస్తుతం కేరళ తమిళనాడు ఎన్నికల ఫలితాలు వచ్చిన వేళ ఏఐసీసీ కార్యదర్శుల అవకాశాలు చర్చకు వస్తున్నాయి. ఇక్కడ పనిచేసిన జూఇ విష్ణునాథ్, జూ. విశ్వనాథ్ ఇద్దరూ విజయం సాధించారు. కేరళలోని కుందర నియోజకవర్గం నుండి ఖఅ విష్ణునాథ్ పోటీ చేసి ఎమ్మెల్యే అయ్యారు. కేరళ ప్రభుత్వంలో ఆయనకు మంత్రి పదవి కూడా దక్కే అవకాశం ఉంది. ఇక మరో కార్యదర్శి ఖ. విశ్వనాథన్.. తమిళనాడులోని మెల్లూర్ నియోజకవర్గం నుండి పోటీ చేసి విజయం సాధించారు. డీఎంకేతో కలిసి ఎన్నికల్లో పోటీ చేసినా.. ప్రస్తుతం అక్కడ హంగ్ ఏర్పడ్డ క్రమంలో కాంగ్రెస్ టీవీకేతో చేతులు కలవవచ్చని అంటున్నారు. అదే జరిగితే?. తమిళనాడు ప్రభుత్వంలో విశ్వనాథన్‌కు మంత్రి పదవి దక్కవచ్చన్న అంచనాలున్నాయి. మొత్తానికి తెలంగాణ కాంగ్రెస్‌కు ఇన్ఛార్జ్‌లుగా వచ్చేవాళ్ళకు కలిసి రాకున్నా కార్యదర్శులకు మాత్రం బాగా కలిసొస్తోందన్న టాక్ మొదలైంది. ఇప్పుడు కేరళ?తమిళనాడు లో గెలిచిన ఇద్దరూ కార్యదర్శులు కొనసాగుతారా..?

# తిరుమల తరహాలో కొడంగల్‌లో వెంకటేశ్వర స్వామి ఆలయం

హైదరాబాద్, మే 7,



వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో పేదల తిరుపతిగా ప్రసిద్ధి చెందిన మహాలక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయానికి మహర్దశ పట్టనుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ ఆలయ పునర్నిర్మాణం కోసం రూ.110 కోట్లు మంజూరు చేశారు. తిరుమల తరహాలో కృష్ణశిలలతో, రాజగోపురాలతో 5.63 ఎకరాల విస్తీర్ణంలో ఈ ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దనున్నారు. పుష్కరిణి, కళ్యాణకట్ట, అన్నదాన సత్రం వంటి అత్యాధునిక సదుపాయాలతో 18 నెలల్లో ఈ పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రస్తుతం భక్తుల దర్శనం కోసం బాలాలయం అందుబాటులో ఉంచారు.ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 'పేదల తిరుపతి'గా విరాజిల్లుతున్న కొడంగల్ మహాలక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయం ఇకపై సరికొత్త ఆధ్యాత్మిక శోభను సంతరించుకోనుంది. 56 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ఆలయం ప్రస్తుతం శిథిలావస్థకు చేరడంతో.. దీనిని తిరుమల క్షేత్రాన్ని తలపించేలా పునర్నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ.110 కోట్ల భారీ నిధులను మంజూరు చేస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేశారు.ఈ ప్రతిష్టాత్మక ఆలయ నిర్మాణం కోసం స్థల సమస్య తలెత్తకుండా సమీపంలోని 96 నివాసాలను ఖాళీ చేయించి, వారికి ప్రభుత్వం నష్టపరిహారం అందజేసింది. దీంతో ఇప్పుడు 5.63 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో ఆగమ శాస్త్రం ప్రకారం నిర్మాణాలు జరగనున్నాయి. ఏపీలో సిద్ధమవుతున్న కృష్ణశిలలను ఈ నిర్మాణానికి వినియోగిస్తుండటం విశేషం. పనుల పర్యవేక్షణ బాధ్యతను దేవాదాయ శాఖ అధికారులతో పాటు సీఎం ప్రత్యేక కార్యదర్శి శ్రీనివాసరాజు, కలెక్టర్ దీపక్ తివారికి అప్పగించారు. ఈ మొత్తం పనులను 18 నెలల్లోగా పూర్తి చేయాలనే గడువును ప్రభుత్వం విధించింది.ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా ప్రధాన ఆలయానికి రూ.28.68 కోట్లు వెచ్చిస్తున్నారు. గర్భగుడికి కుడివైపున మహాలక్ష్మి అమ్మవారు, ఎడమవైపున గోదాదేవి, ఎదురుగా గరుడాళ్వారు ఆలయాలను నిర్మిస్తారు. తూర్పు వైపున ఐదంతస్తుల భారీ రాజగోపురం, మిగిలిన మూడు వైపులా మూడంతస్తుల రాజగోపురాలు కొలువుదీరనున్నాయి. ఉపాలయాలైన భూ వరాహ స్వామి, బేడీ ఆంజనేయస్వామి, భీమేశ్వరస్వామి ఆలయాల కోసం మరో రూ.7.17 కోట్లు కేటాయించారు.

ఆలయ వెలుపల భక్తుల సౌకర్యార్థం రూ.20.86 కోట్లతో వివిధ పనులు చేపట్టనున్నారు. వరాహ స్వామి ఆలయం ఎదురుగా శ్రీవారి పుష్కరిణిని, భక్తులు తలనీలాలు సమర్పించేందుకు కళ్యాణకట్టను ఏర్పాటు చేయనున్నారు. వీటితో పాటు పరిపాలనా భవనం, అత్యాధునిక వంటశాల, నిత్యాన్నదాన సత్రం వంటి వసతులు అందుబాటులోకి రానున్నాయి. 40 అడుగుల మాడవీధుల నిర్మాణం భక్తులకు తిరుమల అనుభూతిని కలిగిస్తుంది.హైదరాబాద్‌కు 120 కి.మీ, కర్ణాటకకు కేవలం 22 కి.మీ దూరంలో ఉన్న ఈ ఆలయం జాతీయ రహదారుల కూడలిలో ఉండటం వల్ల భక్తుల తాకిడి మరింత పెరగనుంది. ప్రస్తుతం పనుల నేపథ్యంలో ప్రధాన ఆలయాన్ని మూసివేసి పక్కనే నిర్మించిన బాలాలయంలో స్వామివారి దర్శనం కల్పిస్తున్నారు.

--------------------

# నిధుల సంగతేంటీ...

హైదరాబాద్, మే 7

ఇప్పటికే తెలంగాణ రాష్ట్రంలో ఖజానా పూర్తిగా ఖాళీ అయిపోయింది. రాయడానికి కొంచెం ఇబ్బందిగా ఉన్నప్పటికీ.. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి బదులు తీసుకొస్తే తప్ప బండి నడిచే పరిస్థితి లేదు. పైగా అప్పులను కూడా కాల వ్యవధి అధికంగా పెంచి తీసుకొస్తున్నారు.. ఓపెన్ మార్కెట్లో బాండ్లను కూడా విక్రయిస్తున్నారు.. ఇంత చేసినప్పటికీ ఆర్థికంగా ఒత్తిడి తప్పడం లేదు. రిటైర్డ్ ఉద్యోగులు తమ బకాయిలు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఆ మధ్య కొత్తగూడెం జిల్లా చెందిన ఓ రిటైర్డ్ ఉద్యోగి స్టంట్ వేసుకోవడానికి డబ్బులు లేక చనిపోయాడు. చివరికి తన ఆవేదనను ఒక లేఖ రూపంలో రాసి తనువు చాలించాడు.. ఇలాంటి ఆర్థిక ఇబ్బందికరమైన స్థితి ఉన్న తెలంగాణలో.. ఇప్పుడు రేవంత్ రెడ్డి సరికొత్త పాచిక వేశారు.తెలంగాణ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు ప్రభుత్వం తరఫున 11 కార్పొరేషన్లకు చైర్మన్లు, వైస్ చైర్మన్ ప్రకటిస్తూ సర్క్యులర్ విడుదల చేశారు. ఇందులో 11 కులాలకు కార్పొరేషన్లను ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన ప్రకటించారు..11 కార్పొరేషన్లకు చైర్మన్లు, వైస్ చైర్మన్ లను ప్రభుత్వం ప్రకటించింది. ఈ కార్పొరేషన్లు ఏర్పాటు చేయడం మంచి నిర్ణయం అయినప్పటికీ.. నిధుల కేటాయింపు ఎలా ఉంటుందనేది ఇక్కడ ప్రశ్నార్థకం. గతంలో కెసిఆర్ అనే కార్పొరేషన్లను ఏర్పాటు చేశారు. ఆ కార్పొరేషన్ల పేరుతో రుణాలు తీసుకొచ్చారు. తద్వారా కార్పొరేషన్లు కేవలం అప్పులు తీసుకురావడానికి మాత్రమే పరిమితమయ్యాయి. కనీసం వాటి ద్వారా జరిగిన ప్రగతి దాదాపు శూన్యం.ఇప్పుడు తెలంగాణ ఆర్థిక రంగం తీవ్రమైన ఒత్తిడి ఎదుర్కొంటోంది. ఈ క్రమంలో కార్పొరేషన్లను ఏర్పాటు చేసిన ప్రభుత్వం.. వాటికి నిధులను ఏ విధంగా ఇస్తుందనేది చూడాల్సి ఉంది. రిటైర్డ్ ఉద్యోగులకు ఆర్థిక ప్రయోజనాలను చెల్లిస్తామని ఇటీవల ముఖ్యమంత్రి ప్రకటించారు. ఆర్టీసీ ఉద్యోగులు సమ్మె చేసిన నేపథ్యంలో.. వారి డిమాండ్లను నెరవేర్చుతామని అన్నారు. పెండింగ్ బకాయిలు ఇంకా చాలానే ఉన్నాయి. ఈ ప్రకారం చూసుకుంటే కొత్త కార్పొరేషన్లు తెలంగాణ ఆర్థిక రంగం మీద అదనపు భారం తప్ప.. ఉపయోగం లేని వ్యవహారం.. రాజకీయ నిరుద్యోగులకు పదవులు కల్పించడానికి తప్ప.. ఈ కార్పొరేషన్లు దేనికి పనికిరావునేది రాజకీయ విశ్లేషకులు అంటున్న మాట.

=======================

# ట్రాఫిక్ బ్యూరో....

హైదరాబాద్, మే 7

సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. తన పర్యటనల సమయంలో ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా చూసుకోనున్నారు. ఈ మేరకు ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా చూడాలని డీజీపీని ఆదేశించారు. ప్రజలను గంటల తరబడి రోడ్లపై నిలిపివేయొద్దని డీజీపీ సీవీ ఆనంద్‌కు సీఎం సూచించారు. ఢిల్లీ పర్యటన సందర్భంగా ఎయిర్‌పోర్టు వద్ద ట్రాఫిక్ జామ్ పై ముఖ్యమంత్రి రేవంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాన్వాయ్ కోసం ప్రజల పనులకు ఆటంకం కలిగించొద్దని స్పష్టమైన ఆదేశాలిచ్చారు. ఎదురుగా వచ్చే వాహనాలను కూడా ఆపి ఇబ్బంది పెట్టొద్దని సూచించారు. నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారురాష్ట్రవ్యాప్తంగా పోలీస్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు డీజీపీ ఆనంద్. ట్రాఫిక్ సమస్యలపై క్షేత్రస్థాయి అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం త్వరలో 'ట్రాఫిక్ బ్యూరో' ఏర్పాటు చేస్తున్నట్లు డీజీపీ ప్రకటించారు. కాన్వాయ్ వెళ్లే సమయంలో ట్రాఫిక్ పూర్తిగా ఆపకుండా సింగిల్ లైన్‌లో వాహనాలు పంపే ప్రణాళిక రూపొందిస్తున్నారు. రద్దీ సమయంలో ప్రత్యామ్నాయ మార్గాలు ముందుగానే సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఎయిర్‌పోర్టు పరిసరాల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు.వర్షా కాలం ముందు నీరు నిలిచే ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ట్రాఫిక్ అధికారులు క్షేత్రస్థాయిలో ఉండి తక్షణ నిర్ణయాలు తీసుకోవాలన్నారు. సిబ్బందిలో ఆత్మవిశ్వాసం పెంపొందించాలని చెప్పారు. ఔటర్ రింగ్ రోడ్డుపై అక్రమ పార్కింగ్ నివారణపై దృష్టి పెట్టాలన్నారు. ఐఎస్‌డబ్ల్యూ, సీఎస్‌డబ్ల్యూ విభాగాలతో సమన్వయం చేసుకోవాలని డీజీపీ చెప్పారు. శాంతిభద్రతల విభాగం కూడా ట్రాఫిక్ నియంత్రణలో భాగస్వామ్యం అవ్వాలని ఆదేశించారు డీజీపీ సీవీ ఆనంద్.

# గ్యాస్ బండతో సామాన్యుడి జేబుకు చిల్లు

హైదరాబాద్, మే 7,

నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు సామాన్యుడిని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ముఖ్యంగా వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర భారీగా పెరగడంతో, హోటళ్లు, టీఫిన్ సెంటర్లు పిజి వసతి గృహాల్లో అల్పాహారం నుండి భోజనం వరకు అన్నింటి ధరలు సామాన్యుడికి భారంగా మారుతున్నాయి. ప్రస్తుత ధరల పెరుగుదల వల్ల హోటల్ యజమానులు తమ వ్యాపారాన్ని కొనసాగించడం కష్టతరంగా మారింది. వాణిజ్య సిలిండర్ ధర ఏకంగా రూ. 3,314 కి చేరడంతో, ఇడ్లీ, వడ, దోశ వంటి టిఫిన్లపై రూ. 5 నుండి రూ. 10 వరకు పెంచాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనివల్ల సామాన్యుడి జేబుకు చిల్లు పడుతోందిధరల భారాన్ని తట్టుకోలేక చాలా మంది టిఫిన్ సెంటర్ల యజమానులు గ్యాస్ స్టౌలను పక్కనపెట్టి, మళ్లీ పాతబడిన కట్టెల పొయ్యిలను వినియోగిస్తున్నారు. అమీర్‌పేట, దిల్సుఖ్‌నగర్, ఎస్ఆర్ నగర్, కూకట్‌పల్లి ప్రాంతాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా కనిపిస్తోంది. ఇది కేవలం హోటళ్లకే పరిమితం కాలేదు,

# ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరుకావాలి: చొప్పరి జయశ్రీ

కరీంనగర్ ప్రతినిధి,

కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ మాట్లాడుతూ మే 10.న సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్స్ లో జరుగుతున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు రావాలని, వచ్చి జయప్రదం చేయగలరని కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రపంచ వేదికపై భారతదేశ గౌరవాన్ని మరింత ముందుకు తీసుకెళుతున్నటువంటి నాయకులు మన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ. ప్రజల ఆకాంక్షలకు ప్రతీకగా ముందుకు వెళుతున్నటువంటి పార్టీ భారతీయ జనతా పార్టీ అని ఆమె అన్నారు. మే 10 న.సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ లో జరుగుతున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో ప్రజలందరూ విచ్చేసి జయప్రదం చేయగలరని చొప్పరి జయశ్రీ ప్రజలను కోరారు.

# మే 9న బద్వేల్ లో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం..

బద్వేలు

బద్వేలు లోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మే 9వ తేదీ ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు బద్వేలు సుమిత్రానగర్ కు చెందిన ఉపాధ్యాయుడు వీరదాసరి జేకబ్ సెల్వరాజ్ తెలియజేశారు. నెల్లూరు పట్టణం బృందావనం కు చెందిన సుశీల నేత్రాలయ వారిచే 9వ తేదీ శనివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన ప్రముఖ నేత్ర వైద్య నిపుణులు డాక్టర్.వి.సుధాకర్ రాజు, డాక్టర్.వి.జవహర్ సత్య బాబు, డాక్టర్.మేఘన లు పాల్గొని ప్రజలకు ఉచిత కంటి వైద్య సంబంధిత పరీక్షలు నిర్వహిస్తారన్నారు. గ్లాకోమా, శుక్లం, రెటీనా తదితర కంటి వ్యాధులకు పరీక్షలు చేసి తగిన వైద్య సలహాలు అందిస్తారన్నారు. అలాగే ఆరోగ్యశ్రీ, క్యాస్ లెస్ (ఈహెచ్ఎస్) ద్వారా నెల్లూరులోని సుశీల నేత్రాలయ ఆసుపత్రి నందు ఉచితంగా ఆపరేషన్లు కూడా నిర్వహిస్తారన్నారు. ఆపరేషన్ అవసరమైన వారిని క్యాంపు రోజునే ఆసుపత్రికి తీసుకువెళ్లే ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలు కూడా పంపిణీ చేస్తారన్నారు. ఈ కంటి పరీక్షలకు హాజరయ్యేవారు ఆధార్ కార్డు, ఆరోగ్యశ్రీ మరియు ఈహెచ్ఎస్ కార్డులను తీసుకొని రావాలన్నారు. బద్వేల్ లో జరిగే ఈ అవకాశాన్ని ప్రజలు, ఉద్యోగ, ఉపాధ్యాయులు పెన్షనర్లు వినియోగించుకోవాలని ఆయన కోరారు. ==

# గిరిజన గర్భిణీ స్త్రీలకు ఉచిత వైద్య శిబిరము

ఆత్మకూరు , మే 7:

ఆత్మకూరు సామాజిక వైద్య కేంద్రంలో గురువారము గిరిజన గర్భిణీ స్త్రీల ప్రత్యేక వైద్య శిబిరాన్ని డాక్టర్ రాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ శిబిరానికి పరిసర గిరిజన గూడేముల నుంచి పలువురు గర్భిణీ స్త్రీలు హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రాయుడు మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు గర్భధారణ సమయంలో క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం ఎంతో అవసరమని తెలిపారు. తల్లి మరియు శిశువు ఆరోగ్యంగా ఉండేందుకు సమతుల్య ఆహారం తీసుకోవడం, ఐరన్ మరియు కాల్షియం మాత్రలను వైద్యుల సూచనల మేరకు వినియోగించడం అవసరమన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను గిరిజన మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గర్భధారణ సమయంలో ఏవైనా ఆరోగ్య సమస్యలు ఉంటే వెంటనే సమీప ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని తెలిపారు. ఈ శిబిరంలో వైద్య సిబ్బంది గర్భిణీ స్త్రీలకు రక్తపోటు, హీమోగ్లోబిన్ తదితర పరీక్షలు నిర్వహించి అవసరమైన సూచనలు అందించారు. ఈ కార్యక్రమములో హెడ్ నర్స్ చెంచులక్ష్మి స్టాఫ్ నర్స్ గీత కుమారి ఎస్ ఎస్ కె మేనేజర్ ఇస్మాయిల్ జబివుల్ల ఆర్ డి టి స్వచ్ఛంద సేవ సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

==============================



# 10న మెగా మెడికల్ క్యాంప్

## ఉచితంగా వైద్య పరీక్షలు, ఉచితంగా మందుల అందజేత

-హాజరుకాబోతున్న దాదాపు 25మంది స్పెషలిస్ట్ వైద్యులు
-అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు
-రాజమండ్రి పార్లమెంట్ నియోజకవర్గ ప్రజల కోసం ఈ శిబిరం
-ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎంపీ భరత్ విజ్ఞప్తి

రాజమహేంద్రవరం, మే 7:

ఈనెల 10వ తేదీ ఆదివారం రోజున స్థానిక కృష్ణ నగర కొత్తరోడ్డులోని వివి గార్డెన్స్‌లో మెగా మెడికల్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి రాజమండ్రి మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ తెలిపారు. ఇందుకు సంబందించిన పోస్టర్ ని ఆయన ఆవిష్కరించారు. కాంటినెంటల్ హాస్పిటల్స్ , నుంచి అన్ని డిపార్ట్‌మెంట్స్‌కి సంబంధించి వైద్యులు అలాగే వాసన్ ఐ కేర్ హాస్పిటల్స్ కి సంబంధించిన డాక్టర్లు అలాగే అలాగే జిఎస్ఎల్ మెడికల్ కాలేజ్ వైద్య నిపుణులు కూడా రాబోతున్నారని ఆయన తెలిపారు. మొత్తంమీద దాదాపు 25మంది స్పెషలిస్ట్ డాక్టర్లు ఈ శిబిరంలో ఉచితంగా వైద్య సేవలు అందిస్తారని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని రాజమండ్రి ప్రజలే కాకుండా గోదావరి జిల్లా ప్రజలందరూ కూడా ఉపయోగించుకోవాలని కోరారు.

సూపర్ స్పెషలిస్ట్ డాక్టర్లు ఈ శిబిరానికి హాజరవుతున్నందున వైద్య పరీక్షలు చేయడంతో పాటు ఉచితంగా మందులు కూడా ఇవ్వబోతున్నామని మాజీ ఎంపీ భరత్ తెలిపారు. క్యాన్సర్, హార్ట్ ,కిడ్నీస్ , ఊపిరితిత్తులు, కీళ్ల నొప్పులు, న్యూరో, డెంటల్, గైనకాలజి తదితర విభాగాలకు సంబంధించిన నిపుణులు వస్తున్నందున ఈ అవకాశాన్ని ప్రజలందరూ వినియోగించుకుంటారని ఆశిస్తున్నట్లు భరత్ తెలిపారు. కంటి పరీక్షల తర్వాత అవసరమైన వారికి కంటి ఆపరేషన్లు కూడా చేయబోతున్నామని ఆయన తెలిపారు. పేదలకు ఉచితంగా ఆపరేషన్లు చేయించే ఆలోచన ఉందన్నారు. ఆరోగ్యశ్రీ పని చేయట్లేదని , మరోపక్క హాస్పిటల్స్‌లో డబ్బులు విపరీతంగా దోచే కార్యక్రమం చేస్తున్నారని పలువురు చెబుతున్నారని, ఇవన్నీ కూడా గమనించి, ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేస్తున్నట్లు భరత్ తెలిపారు. అందుకే రాజమండ్రి పార్లమెంట్ పరిధిలోని ప్రజలంతా విచ్చేసి ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మీడియా వాళ్ళు కూడా కుటుంబ సమేతంగా వచ్చి ఉచిత వైద్య శిబిరాన్ని ఉపయోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉభయ తెలుగు రాష్ట్రాల బీసీ జెఎసి చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, డా గూడూరి శ్రీనివాసరావు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వాసంశెట్టి గంగాధరరావు, పోలు విజయలక్ష్మి, మజ్జి అప్పారావు, దాసి వెంకటరావు, వైయస్సార్సీపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# భద్రతా నియమాలు కచ్చితంగా పాటించాలి

రాయచోటి, , మే 7:

స్కూల్ బస్సులు తప్పనిసరిగా భద్రత నియమాలు పాటించాలని రాయచోటి అజయ్ కుమార్ హెచ్చరించారు గురువారం అన్నమయ్య జిల్లాలోని రాయచోటి సుండుపల్లి మార్గాలలో తిరుగుతున్న పాఠశాలల బస్సులను వాటి కండిషన్లను పరిశీలించారు ఈ సందర్భంగా ఎం వి ఐ మాట్లాడుతూ60 ఏళ్లలోపు వయసుతోపాటు ఐదు సంవత్సరాలు అనుభవంతో కూడిన హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన వారే స్కూల్ బస్సులు డ్రైవింగ్ చేయాలి..విద్యార్థులు సురక్షితంగా ప్రయాణించడానికి మోటార్ అధికారులు అన్ని రకాల చర్యలు చేపడుతున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ట్రాన్స్పోర్ట్ కమిషనర్, అన్నమయ్య జిల్లా రవాణా శాఖ అధికారి ఆదేశాల మేరకు సుండుపల్లి మండలంలో స్కూల్ బస్సులు తనిఖీలు వాటి కావలసిన భద్రత నియమాలపై అవగాహన కల్పించారు పలు భద్రతా నియమాలు వాహన చోదకులకు పాఠశాలల యాజమాన్యాలకు మీడియా ద్వారా ఎం వి ఐ అజయ్ కుమార్ వెల్లడించారు. ఈ ఏడాది స్కూల్లో ప్రారంభమయ్యే లోపల స్కూల్ బస్సులు అన్ని రకాల భద్రత నియమాలు పాటించాలని ప్రవేట్ స్కూల్ కాలేజ్ యాజమాన్యాలకు సూచించారు రాయచోటి ఎం.వి.ఐ అజయ్ కుమార్. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ట్రాన్స్పోర్ట్ కమిషనర్, అన్నమయ్య జిల్లా రవాణా శాఖ అధికారి ఆదేశాల మేరకు సుండుపల్లి మండలంలోని పలు పాఠశాల కాలేజ్ బస్సుల భద్రత నియమాలను పరిశీలించినట్లు అజయ్ మీడియా ద్వారా తెలియజేశారు. ఈ సందర్భంగా మోటారు వాహనాల చట్టాలను ప్రతి పాఠశాల యాజమాన్యాలు పాటించాలని వారికి సూచించారు. 32 రకాల భద్రత నియమాల గురించి వారికి అవగాహన కల్పించినట్లు ఆయన పేర్కొన్నారు. సుండుపల్లి మండలంలో సుమారు 22 పైగా కాలేజ్, స్కూల్ బస్సులు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఈ ఏడాది స్కూల్స్,కాలేజీలు ప్రారంభమయ్యె లోపల బస్సులకు అన్ని రకాల భద్రత నియమాలు ఉండేటట్లు చూసుకోవాలని తెలియజేసామన్నారు. భద్రత నియమాలు పాటించని స్కూల్ యాజమాన్యాలపై కఠినమైన చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరచడం జరుగుతుందన్నారు. ఇటీవల కాలంలో స్కూల్ బస్సులు అనేక ప్రమాదాలకు గురవుతున్న పరిస్థితులు మనం చూస్తూనే ఉన్నామన్నారు. అటువంటి సమస్యలు లేకుండా విద్యార్థులు సురక్షితంగా ప్రయాణించేందుకు ట్రాన్స్పోర్ట్ అధికారులు కఠినమైనటువంటి చర్యలు అమలు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. స్కూల్ యాజమాన్యాలు డ్రైవర్ తో పాటు అటెండర్ కూడా తప్పకుండా నియమించుకోవాలన్నారు. అన్ని రకాల రికార్డులు తప్పనిసరిగా బస్సులో పెట్టుకొని ఎక్కడైనా పోలీసు రవాణా శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించినప్పుడు వారికి చూపించాల్సిన బాధ్యత ఉందన్నారు.

# ఆపరేషన్ సిందూర్' భారత శౌర్యానికి నిదర్శనం

## ఉగ్రవాదానికి ఆశ్రయం ఇచ్చే శక్తులకు ఇది గట్టి హెచ్చరిక

## బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు

హైదరాబాద్ మే7:

'ఆపరేషన్ సిందూర్' భారత శౌర్యానికి నిదర్శనమని, ఉగ్రవాదానికి ఆశ్రయం ఇచ్చే శక్తులకు ఇది గట్టి హెచ్చరిక అని బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు అన్నారు. పాకిస్థాన్ మరియు పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేస్తూ భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సింధూర్' విజయవంతంగా ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా, నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా సంబురాలు నిర్వహించారు. బిజెపి రిటైర్డ్ ఆర్మీ సెల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ముఖ్య అతిథిగా పాల్గొని, తొలుత ఉగ్రవాదుల చేతిలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరులకు ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన కేక్ కట్ చేసి కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలుపుతూ, పహల్గామ్ దాడికి ప్రతీకారంగా లష్కర్, జైష్ వంటి ఉగ్రవాద శిబిరాలపై భారత సైన్యం విరుచుకుపడి ఉగ్రవాదులను మట్టుబెట్టడం భారత శౌర్యానికి నిదర్శనమని కొనియాడారు. ఈ విజయం దేశ భద్రత పట్ల నరేంద్ర మోదీ ప్రభుత్వ కఠిన వైఖరిని చాటిచెబుతోందని ఆయన పేర్కొన్నారు.

# అన్ లోడింగ్ త్వరితగతిన పూర్తి చేయాలి

## అదనపు కలెక్టర్ గడ్డం నగేష్

### ఇల్లంతకుంట మండలంలోని కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లులో తనిఖీ

రాజన్న సిరిసిల్ల

కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చే దాన్యాన్ని రైస్ మిల్లర్లు వెంట వెంటనే అన్ లోడింగ్ చేయించాలని కలెక్టర్ అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. మండలంలోని పెద్దలింగాపూర్, అనంతారంలోని కొనుగోలు కేంద్రాల్లో అదనపు కలెక్టర్ గురువారం పరిశీలించారు. ధాన్యం రాశులు, కొనుగోలు పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు× హమాలీల సంఖ్యను పెంచాలిరైస్ మిల్లర్లు తమ మిల్లులో హమాలీల సంఖ్యను పెంచి కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చే దాన్యం లారీలను అన్ లోడింగ్ చేయించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఇల్లంతకుంట మండలం చింతలకుంటపల్లి లోని లక్ష్మి సాయి రైస్ మిల్లు, తాళ్ళపల్లి లోని రాజ రాజేశ్వర రైస్ ఇండస్ట్రీస్ లో అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అన్ లోడింగ్, హమాలీల సంఖ్య పెంపు తదితర అంశాలపై మిల్లర్లకు పలు సూచనలు చేశారు అదనపు కలెక్టర్ వెంట మండల తహసీల్దార్ రాచకుంట్ల సురేష్ , ఇల్లంతకుంట సర్పంచ్ మామిడి రాజు , ఏపీఎం కుమారస్వామి తో పాటు తదితరులు పాల్గొన్నారు




# సూర్యప్రభ వాహనంపై తేజోవంతంగా శ్రీ వేదనారాయణ స్వామి

తిరుపతి, 2026 మే 07

నాగలాపురం శ్రీ వేదనారాయణ స్వామి వారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడవ రోజైన గురువారం ఉదయం స్వామివారు సూర్యప్రభ వాహనంపై భక్తులకు దివ్య దర్శనం ఇచ్చారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన వాహనసేవ ఆలయ నాలుగు మాడ వీధుల్లో అత్యంత వైభవంగా సాగింది.

# ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

## -వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్



వరంగల్ బాధితులు ఇచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. వార్షిక తనిఖీల్లో భాగంగా వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్ గురువారం వెస్ట్ జోన్ పరిధిలోని చిల్పూర్ పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేశారు. ఈ ఉదయం చిల్పూర్ పోలీస్ స్టేషన్ కు పోలీస్ అధికారులు పోలీస్ కమిషనర్ కు మొక్కలను అందజేసి స్వాగతం పలికారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించిన అనంతరం పోలీస్ కమిషనర్ స్టేషన్ రిసెప్షన్, ఐటీ సిబ్బంది, ఇతర పోలీస్ సిబ్బంది పనితీరును సీపీ సిబ్బందిని పని తీరును అడిగి తెలుసుకోవడంతో పాటు స్టేషన్ నిర్వహణకు సంబంధించిన రికార్డులతో పాటు, రౌడీ షీటర్లు, అనుమానితుల రికార్డులు, ప్రస్తుతం పెండింగ్ కేసుల రికార్డ్ లకు సీపీ తనిఖీ చేశారు. ఈ సందర్బంగా పోలీస్ కమిషనర్ స్టేషన్ సిబ్బంది సమస్యలను అడిగి తెలుకున్నారు. చివరగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రతి కానిస్టేబుల్ గ్రామాలను సందర్శించి శాంతి భద్రతలకు సంబంధించిన సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు, ప్రతి గ్రామస్తుడు తప్పని సరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించే విధంగా ట్రాఫిక్ రూల్స్ పై అవగహనా కల్పించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకై ముందస్తు చర్యలు తీసుకోవాలని,అక్రమ ఇసుక రవాణా, పాఠశాలల పరిసరాల్లో పొగాకు ఉత్పత్తుల విక్రయాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలని పోలీస్ కమిషనర్ అధికారులు, సిబ్బందికి తెలిపారు. ఈ తనిఖీల్లో వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్, ఏసీపీ భీం శర్మ, సిఐ శ్రీనివాస్ రెడ్డి, ఎస్.ఐ నవీన్ కుమార్ వున్నారు.

# జిల్లా అభివృద్ధిలో కలెక్టర్ అభిలాష అభినవ్ ముద్ర.

## జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు సన్మానం.



నిర్మల్ జిల్లా ప్రతినిధి, మే 07 (భారత శక్తి) కలెక్టర్‌గా విశేష సేవలందించి బదిలీపై వెళ్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్‌కు కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఆత్మీయ వీడ్కోలు సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా పలువురు అధికారులు మాట్లాడుతూ, కలెక్టర్ అభిలాష అభినవ్ నిర్మల్ జిల్లాలో బాధ్యతలు చేపట్టిన నాటి నుండి పరిపాలనలో తనదైన ముద్ర వేశారని కొనియాడారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఆమె చూపిన చొరవ, ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరవేసేందుకు తీసుకున్న చర్యలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. విపత్తుల సమయంలో సమర్థవంతమైన చర్యలు తీసుకోవడం, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడం, శాఖల మధ్య సమన్వయం సాధించడం ద్వారా జిల్లాను రాష్ట్ర స్థాయిలో ముందంజలో నిలిపారని అధికారులు గుర్తు చేసుకున్నారు.

సన్మాన గ్రహీత కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, భావోద్వేగానికి లోనయ్యారు. నిర్మల్ జిల్లాలో పనిచేయడం తనకు ఒక మధురమైన అనుభవమని తెలిపారు.

జిల్లా అభివృద్ధిలో ప్రతి అధికారి, సిబ్బంది అందించిన సహకారం మరువలేనిదని పేర్కొన్నారు. "టీమ్‌వర్క్‌తోనే మనం లక్ష్యాలను సాధించగలిగాం. నిర్మల్ ప్రజల ఆదరాభిమానాలు ఎప్పటికీ గుర్తుంటాయి. పాలనలో పారదర్శకతకు ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు చేరువయ్యే ప్రయత్నంలో నాకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు," అని తెలిపారు. అనంతరం అధికారులు ఆమెకు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, సబ్ కలెక్టర్ సంకేత్ కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, సిపిఓ జీవరత్నం, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

# సోలార్ విద్యుత్ ఏర్పాటు వలన ఎన్నో లాభాలు: ఏడిఈ ఉమా మహేశ్వరరావు


మణుగూరు, మే 07 (భారతశక్తి): సోలార్ విద్యుత్ ఏర్పాటు వలన ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని మణుగూరు ఏడిఈ ఉమా మహేశ్వరరావు పేర్కొన్నారు. మండల పరిధిలోని గట్టుమల్లారం గ్రామంలో గల రైతు వేదికలో ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రణాళికలో భాగంగా గురువారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు వారోత్సవాలు నిర్వహించారు. ఈ వారోత్సవాల్లో భాగంగా ముందుగా తెలంగాణ రాష్ట్ర గీతాన్ని అలపించారు. అనంతరం విద్యుత్ శాఖ ఏడీఈ మాట్లాడుతూ.. పీఎం కుసుమ్ పథకం గురించి వివరిస్తూ సోలార్ విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవడానికి రైతులకు ప్రభుత్వం రాయితీని అందిస్తుందన్నారు. వ్యవసాయ క్షేత్రాల్లో సౌర విద్యుత్తు వల్ల కలిగే లాభాలను వివరించారు. గృహ విద్యుత్ వినియోగదారులకు ఇంటిపై సోలార్ రూఫ్ టాప్ 3 కనెక్షన్ల గురించి వివరించారు. ఎటువంటి విద్యుత్ సమస్యలైన టోల్ ఫ్రీ నెం.1912 కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. యాంత్రీకరణలో భాగంగా అవసరమైన యంత్రపరికరాల కోసం దరఖాస్తు చేసుకోవాలని రైతులకు సూచించారు. విద్యుత్ ప్రమాదాల పట్ల అవగాహన కలిగి ఉండాలని తెలియజేశారు. ఈ



కార్యక్రమంలో గట్టుమల్లారం, కట్టుమల్లారం, లంకమల్లారం గ్రామపంచాయితీల సర్పంచులు, ఉపసర్పంచులు, జి. సర్వేశ్వరావు ఎస్ఎల్ఐ, మధుసూదనరావు, శంకర్, అశోక్ కుమార్ ఎల్ఐలు, లైన్ మ్యాన్లు, ఏఎల్ఎమ్ లు, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# వరదల సమయంలో సమర్థవంతమైన స్పందనకు అన్ని శాఖల సమన్వయం అవసరం:జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ జిల్లా ప్రతినిధి, మే 07(భారత శక్తి) రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని వరదల నివారణ, విపత్తు నిర్వహణ చర్యలపై రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీస్ అధికారులు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో రాష్ట్ర స్థాయి సమన్వయ సమావేశాన్ని నిర్వహించింది. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, ఎస్పీ జానకి షర్మిలతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ఈ సందర్భంగా జిల్లాలో వర్షాకాలానికి ముందస్తుగా చేపట్టాల్సిన చర్యలు, వరదల సమయంలో తక్షణ స్పందన, ప్రజల రక్షణ, సహాయక చర్యలు, అత్యవసర సేవల సమన్వయంపై విస్తృతంగా సమీక్షించారు. జిల్లాలోని లోతట్టు ప్రాంతాలు, వరద ముప్పు ఉన్న గ్రామాలు, చెరువులు, వాగులు, కాలువలు, రహదారుల పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

వర్షాకాల సన్నద్ధతలో భాగంగా నిర్మల్ జిల్లాలో జిల్లా స్థాయి ఫ్లడ్ మాక్ ఎక్సర్‌సైజ్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ మాక్ ఎక్సర్‌సైజ్ ద్వారా వరదల సమయంలో తీసుకోవాల్సిన అత్యవసర చర్యలను ప్రాయోగికంగా అమలు చేసి శాఖల మధ్య సమన్వయాన్ని పరీక్షించనున్నట్లు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతీరాజ్, ఇరిగేషన్, మున్సిపల్ పరిపాలన, విద్యుత్, గ్రామీణ నీటి సరఫరా శాఖలతో పాటు ఇతర అత్యవసర సేవల విభాగాలు పాల్గొంటాయని తెలిపారు. ప్రజల తరలింపు ప్రక్రియ, సహాయక శిబిరాల ఏర్పాటు, రక్షణ చర్యలు, కమ్యూనికేషన్ వ్యవస్థలు, అత్యవసర పరిస్థితుల్లో స్పందన విధానాలను సమగ్రంగా పరిశీలించనున్నట్లు వెల్లడించారు.

అలాగే విపత్తుల సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, అవసరమైన యంత్రాంగం, సిబ్బంది, పరికరాలను సిద్ధంగా ఉంచాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వరద ముప్పు ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ప్రజలకు ముందస్తు హెచ్చరికలు అందించాలన్నారు.

వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు బి వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, సబ్ కలెక్టర్ సంకేత్ కుమార్, ఆర్ డి ఓ రత్న కళ్యాణి, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సరస్వతి అంత్య పుష్కరాల ఏర్పాట్లను త్వరిత గతిని పూర్తి చేయాలి:

## దేవాదాయ శాఖ ప్రిన్సిపాల్, సెక్రెటరీ శైలజ రామయ్యర్

భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, మే 07 (భారత శక్తి ) సరస్వతీ పుష్కరాలు ఏర్పాట్ల పనులను తొందరగా పూర్తిచేయాలని భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు తలెత్తకుండా చూడాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్ అధికారులను ఆదేశించారు.



గురువారం కాళేశ్వరం వద్ద జరుగుతున్న అంత్య పుష్కరాల ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సరస్వతి ఘాట్‌ను సందర్శించి, ఘాట్‌లో వేస్తున్న పార్కింగ్ టైల్స్ పనులు, సరస్వతి విగ్రహం వద్ద ఏర్పాటు చేసే పగోడాలు, చలువ పందిళ్ల ఏర్పాట్లపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

అనంతరం ఘాట్ పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న పార్కింగ్ స్థలాలు, శాశ్వత ప్రాతిపదికన నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులు, మద్దులపల్లి, పూసుకుపల్లి, బలిజాపూర్ మరియు గోదావరి వంతెన వద్ద ఏర్పాటు చేస్తున్న పార్కింగ్ ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం మ్యూజియం పనులను పరిశీలించి, ఈ నెల 18వ తేదీ నాటికి విగ్రహాల ప్రతిష్టాపన వాస్తు ప్రకారం పూర్తి చేయాలని సూచించారు.

తదుపరి ఈఓ కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ఈనెల 21 నుండి జూన్ 1 వరకు నిర్వహించే సరస్వతి అంత్య పుష్కరాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారని, గత పుష్కరాల అనుభవాలను దృష్టిలో ఉంచుకొని అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

గతంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. ప్రైవేట్ వాహనాలు మరియు ఆర్టీసీ బస్సులకు వేర్వేరు మార్గాలను ఏర్పాటు చేస్తూ, సుమారు 260 ఎకరాలలో 24 ప్రాంతాల్లో పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పార్కింగ్ ప్రాంతాల్లో త్రాగునీరు, విద్యుత్, వైద్య సదుపాయాలు కల్పించడంతో పాటు, ట్రాఫిక్ అధికంగా ఉండే ప్రాంతాల్లో ప్రతి అర కిలోమీటరుకు ఒక చలివేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

సరస్వతి ఘాట్ వద్ద పెద్దఎత్తున తాత్కాలిక సదుపాయాలు కల్పిస్తున్నామని, పగోడాలు, షాపింగ్ స్టాల్స్, ప్లే జోన్‌లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. జిల్లా చిన్న పరిశ్రమల ఉత్పత్తులను ప్రోత్సహించే విధంగా సుమారు 50 షాపులను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

పిండప్రదాన కార్యక్రమాల కోసం గోదావరి తీరం వద్ద ప్రత్యేక చలువ పందిళ్లు ఏర్పాటు చేసి, అక్కడే పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పిండప్రదానం ప్రాంతంలో 20 పడకలతో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.

ఈ నెల 21వ తేదీ ఉదయం 5:43 గంటలకు కంచి స్వామివారు త్రివేణి సంగమంలో పుష్కర స్నానం ఆచరించనున్నారని, అదేరోజు రాష్ట్ర గవర్నర్ కూడా పుణ్యస్నానం ఆచరించనున్నారని తెలిపారు. గతంలో ఆది పుష్కరాల్లో స్నానం చేయని భక్తులు అంత్య పుష్కరాలకు పెద్దఎత్తున తరలివస్తారని ఆమె పేర్కొన్నారు.

అనంతరం కాళేశ్వర ముక్తేశ్వర స్వామిని దర్శించుకున్న ప్రిన్సిపల్ సెక్రెటరీ, ఆలయంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని క్యూ లైన్ల నిర్వహణపై దేవాదాయ శాఖ అధికారులతో సమీక్షించారు.

ఈ కార్యక్రమంలో ధార్మిక సలహాదారు గోవింద హరి, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, డీఎఫ్‌వో నవీన్ రెడ్డి, ఈఓ మహేష్ మరియు పలు శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో వేగంగా సాగుతున్న డిజిటల్ జనగణన ప్రక్రియ:జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ జిల్లా ప్రతినిధి, మే 07(భారత శక్తి)జిల్లాలో డిజిటల్ జనగణన-2027 ప్రక్రియ పకడ్బందీగా సాగుతోందని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా వెల్లడించారు. గురువారం హైదరాబాద్ నుండి డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ భారతి హోలికేరి జనగణన - 2027 విధివిధానాలు, సంబంధిత అంశాలపై జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులకు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టరేట్ విసి హాల్ నుండి ఆయన జిల్లా అధికారులతో కలిసి పాల్గొన్నారు.





ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లా నివేదికను వివరిస్తూ, జిల్లాలో ఇప్పటివరకు 93.844 శాతం స్వయం గణన పూర్తయిందని,ఇప్పటి వరకు 12897 విజయవంతంగా ముగిశాయని వివరించారు. జనగణన విధుల్లో పాల్గొనే సిబ్బంది శిక్షణపై ప్రత్యేక దృష్టి సారించి, జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన 44 శిక్షణా బ్యాచ్‌లు వంద శాతం లక్ష్యాన్ని చేరుకున్నాయని వివరించారు. క్షేత్రస్థాయి నిర్వహణకు కీలకమైన 1551 హౌస్ లిస్టింగ్ బ్లాక్ డీమార్కేషన్ ప్రక్రియను ఆన్‌లైన్ పోర్టల్‌లలో వంద శాతం పూర్తి చేసినట్లు తెలిపారు. ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు అవసరమైన కిట్ల పంపిణీ వేగంగా జరుగుతోందనీ తెలిపారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, సి పి ఓ జీవరత్నం, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్న జగిత్యాల డీఎస్పీ పురుషోత్తం రెడ్డి

జగిత్యాల, మే 7 (భారత శక్తి ప్రతినిధి):

ధర్మపురిలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామిని ఇటీవల జగిత్యాల డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన పురుషోత్తం రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆలయ అధికారులు డీఎస్పీకి దేవాలయ సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. అనంతరం అర్చకులు, వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అల్వాల్ శ్రీనివాస్ స్వామివారి చిత్రపటం మరియు ప్రసాదాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, ధర్మపురి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రామ్ నర్సింహారెడ్డి పాల్గొన్నారు.




# అక్రమ ఇసుక తరలింపుపై సంయుక్త తనిఖీలు - – నాలుగు ట్రాక్టర్లు స్వాధీనం.

నిర్మల్ జిల్లా ప్రతినిధి, మే 07(భారత శక్తి) భైంసా పట్టణంలోని ఆర్టీవో చెక్ పోస్ట్ వద్ద అక్రమ ఇసుక తరలింపు జరుగుతున్నదనే విశ్వసనీయ సమాచారంపై పోలీసులు, రెవెన్యూ సిబ్బంది సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు.

తనిఖీల సమయంలో సరైన అనుమతి పత్రాలు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లు గుర్తించబడినాయి. వాహనదారులను విచారించగా అవసరమైన పత్రాలను సమర్పించలేకపోయారు.

దీంతో సంబంధిత నాలుగు ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని సీజ్ చేయడం జరిగింది. వాహనదారులపై కేసులు నమోదు చేసి తదుపరి దర్యాప్తు కొనసాగుతున్నట్లు భైంసా టౌన్ ఎస్‌హెచ్‌వో టి. సాయి కుమార్ తెలిపారు.



# రైతు భవిష్యత్తుకు కొత్త దిశ -- మెగా రైతు మేళా

## -రైతు సంక్షేమం నుండి ఆదాయ పెరుగుదల దిశగా ప్రభుత్వం అడుగు

-రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఉమ్మడి వరంగల్ బ్యూరో(భారత శక్తి)మే7:

రైతు భవిష్యత్తుకు కొత్త దిశ -- మెగా రైతు మేళా అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.

ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రాష్ట్రస్థాయి మెగా రైతు మేళా ఈ నెల 5వ తేదీ నుండి 7వ తేదీ వరకు హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నిర్వహించబడుతోంది.

మూడు రోజుల రాష్ట్రస్థాయి మెగా రైతు మేళా చివరి రోజున గురువారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ముఖ్య అతిథులుగా హాజరై వివిధ స్టాళ్లను సందర్శించారు.

వారి వెంట వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, కె ఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ రావు, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేంద్ర మోహన్, రాష్ట్ర హార్టికల్చర్ డైరెక్టర్ యాస్మిన్ బాషా, హనుమకొండ మరియు వరంగల్ జిల్లా కలెక్టర్లు చాహాత్ బాజ్ పాయి, డాక్టర్ సత్య శారద,కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, సంబంధిత శాఖల జిల్లా ఆఅధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నిర్వహించిన సదస్సులో లిరాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూలి రైతు ఉత్సవాల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా మెగా రైతు మేళాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.తెలంగాణ వ్యవసాయానికి కొత్త దిశ చూపిన రైతు మేళా అని అన్నారు. మారుతున్న వ్యవసాయ విధానాలకు అనుగుణంగా యాంత్రీకరణ, పురుగుమందులు, ఎరువులు, విత్తనాలు, మార్కెటింగ్ తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రతి జిల్లాలో జిల్లా కలెక్టర్లు, అధికారులు సమన్వయంతో ఈ మేళాలను విజయవంతంగా నిర్వహిస్తున్నారని తెలిపారు.

రైతులు పంటల సాగులో మెలకువలు తెలుసుకుని అధిక దిగుబడి సాధించాలని సూచించారు. మహిళా రైతులు లావణ్య రెడ్డి, భావన రెడ్డి వంటి ఆదర్శ రైతుల వ్యవసాయ విధానాల నుంచి స్ఫూర్తి పొందాలని తెలిపారు. భూసారం క్షీణిస్తే ఎంత మందులు వాడినా ప్రయోజనం ఉండదని, భూమిని కాపాడుకోవడం అత్యంత అవసరమని అన్నారు. రసాయన ఎరువుల అధిక వినియోగంతో ఆరోగ్య సమస్యలు పెరిగే ప్రమాదం ఉందని, పూర్వీకుల సహజ వ్యవసాయ పద్ధతులను తిరిగి ఆచరించాల్సిన అవసరం ఉందని సూచించారు.

రాష్ట్రం వ్యవసాయ రంగంలో అగ్రగామిగా నిలుస్తోందని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రెండున్నర సంవత్సరాల్లోనే 25 లక్షల మంది రైతులకు సుమారు



21 వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేయడం జరిగిందన్నారు. ఒకే రోజు రైతుబంధు నిధుల విడుదల, యూరియా సరఫరా వంటి చర్యలు రైతు సంక్షేమంపై ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని తెలిపారు.

దేశంలోనే మొక్కజొన్న కొనుగోలు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని, వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లు వేగవంతం చేస్తున్నామని చెప్పారు. రైతులు అప్పుల భారంలో పడకుండా ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తోందని తెలిపారు. రుణమాఫీలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. రైతుల ప్రయోజనాలే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

సిద్దిపేటలో ఆయిల్ పామ్ మిల్లును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వాతావరణ ప్రభావం తక్కువగా ఉండే, అధిక లాభాలు ఇచ్చే ఆయిల్ పామ్ పంటను రైతులు విస్తృతంగా సాగు చేయాలని సూచించారు. పంట మార్పిడి ద్వారా రైతులు స్థిరమైన ఆదాయం పొందాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు.

రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖలి మాట్లాడుతూ రైతులు తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకునే విధంగా స్ఫూర్తిదాయక ప్రసంగాలు విన్నామని తెలిపారు. వివిధ పంటలను సాగు చేస్తున్న అనుభవజ్ఞులైన రైతులు తమ అనుభవాలను పంచుకోవడం ఎంతో ప్రేరణనిచ్చిందన్నారు.

ప్రస్తుతం ఆహార పదార్థాలు, పానీయాలలో కల్తీ పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో సహజ, సేంద్రియ వ్యవసాయానికి మారాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రైతుల సంక్షేమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనేక విధాలుగా తోడ్పాటు అందిస్తున్నారని తెలిపారు. ప్రజా పాలనలో రైతు సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని అన్నారు.

రైతులు ఒకే పంటపై ఆధారపడకుండా అంతర పంటల సాగు చేయాలని సూచించారు. సేంద్రియ వ్యవసాయం వైపు దృష్టి సారించి ఆరోగ్యకరమైన పంటలను ఉత్పత్తి చేయాలని కోరారు. ఆయిల్ పామ్ పంట లాభసాటిగా ఉన్నందున రైతులు దీని సాగును విస్తృతంగా చేపట్టాలని మంత్రి సూచించారు.

వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. రైతులకు చెందాల్సిన అన్ని సంక్షేమ పథకాలను ప్రభుత్వం పూర్తి స్థాయిలో అందిస్తున్నదని తెలిపారు.

ప్రాంతాలవారీగా జరుగుతున్న మార్పులను గమనించి పంటల మార్పిడి ద్వారా వ్యవసాయాన్ని సాగు చేయాలని రైతులకు సూచించారు. దేశంలో ఎక్కడలేని విధంగా రైతు సంబంధాలు మన రాష్ట్రంలో బలంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణాన్ని పెంచాలని రైతులకు సూచిస్తూ, రైతు సంక్షేమానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు.

స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిలి మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం మరింత చేరువగా కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. పంటల మార్పిడి ద్వారా రైతులకు లాభాలు పెరుగుతాయని, రైతు మేళాల ద్వారా అవగాహన కలుగుతుందని పేర్కొన్నారు. రెండున్నర ఏళ్లలో పంటల సాగు విస్తీర్ణం, దిగుబడులు పెరిగాయని, రైతు సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలవుతున్నాయని తెలిపారు.

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావులి మాట్లాడుతూ రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా, పంట కొనుగోళ్లు, రుణమాఫీ వంటి పథకాల ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు.

వర్ధన్నపేట ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజు మాట్లాడుతూ రైతు సంక్షేమ పథకాలు, విద్యుత్ సరఫరా, సన్న బియ్యానికి బోనస్ వంటి కార్యక్రమాలు రైతులకు ప్రయోజనకరంగా ఉన్నాయని తెలిపారు.

రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ మాట్లాడుతూ రుణమాఫీ, పంట విస్తీర్ణం పెరుగుదల, ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంపై వివరించారు.

ఆలేరు రైతు గోపిరెడ్డి గోపాల్ రెడ్డిలి మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగుతో స్థిరమైన ఆదాయం లభిస్తోందని తెలిపారు.

మహిళా రైతు లావణ్య రెడ్డిలి ప్రకృతి వ్యవసాయం, అంతర పంటల సాగు ద్వారా లాభాలు సాధిస్తున్నామని తెలిపారు. మహిళా రైతు భాగ్యలక్ష్మి మిర్చి పంట సాగు, విలువ ఆధారిత ఉత్పత్తుల విక్రయాల గురించి వివరించారు.

పామాయిల్ పంట సాగు చేస్తూ అధిక దిగుబడి సాధిస్తూ లాభాలు అర్జిస్తున్న పలువురు రైతులకు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి కొండా సురేఖ ఎంపీ ఎమ్మెల్యేల చేతుల మీదుగా చెక్కులను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఆదర్శ రైతులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఘనంగా సన్మానించారు.

ఈ సమావేశంలో శాస్త్రవేత్తలు, అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

స్టాల్స్ ను సందర్శించిన మంత్రులు

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి మెగా రైతు మేళా సందర్భంగా ఆర్ట్స్ కళాశాల వేదిక ప్రాంగణంలో వివిధ ప్రభుత్వ శాఖలు, వివిధ సంస్థలు ఏర్పాటుచేసిన స్టాళ్లను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర పర్యావరణ అటవీ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యేలు సందర్శించారు. వ్యవసాయ వ్యవసాయ అనుబంధ రంగాలకు సంబంధించిన స్టాల్స్ను మంత్రులు ఎంపీ ఎమ్మెల్యేలు సందర్శించగా వాటి వివరాలను సంబంధిత ప్రతినిధులు వివరించారు.

పంటల సాగుకు ఉపయోగం.. రైతులకు ఎంతో ప్రయోజనం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ మంత్రిత్వ శాఖల ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించిన మెగా రైతు మేళాలో రైతులకు ఎంతో ఉపయోగకరమైన స్టాల్స్ ను ఏర్పాటు చేయగా రైతులు వాటిని సందర్శించి పూర్వపరాలు తెలుసుకున్నారు. వ్యవసాయ యంత్ర పరికరాలు, సాగులో ఉపయోగపడే వస్తువుల ప్రదర్శన రైతులను ఎంతో ఆకట్టుకుంది. మూడు రోజులపాటు ప్రతిరోజు ఉదయం 10 నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు , మధ్యాహ్నం భోజనం అనంతరం రెండు నుంచి ఐదు గంటల వరకు రెండు సెషన్లుగా మెగా రైతు మేళాను అధికారులు నిర్వహించారు. సమావేశానికి హాజరైన రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, పంటల సాగు విధానంలో అనుసరించాల్సిన పద్ధతులు, కలిగే ప్రయోజనాలు వ్యవసాయ విశ్వవిద్యాలయాలకు చెందిన ప్రొఫెసర్లు, అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, లాభసాటి వ్యవసాయ పద్ధతులను అనుసరిస్తున్న పలువురు రైతులతో తెలియజేశారు. ప్రతిరోజు సుమారుగా 5000 మంది రైతులు ఈ మెగా రైతు మేళాకు హాజరై నూతన వ్యవసాయ విధానాలు, పద్ధతులను తెలుసుకున్నారు.

అంతకుముందు మంత్రులకు ఘనంగా స్వాగతం పలికిన కలెక్టర్లు అధికారులు

ఆర్ట్స్ కళాశాల మైదానంలో ని మెగా రైతు మేళా కు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర పర్యావరణ అటవీ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు మెగా రైతు మేళా ప్రాంగణానికి చేరుకోగా రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సురేంద్రమోహన్, రాష్ట్ర ఉద్యాన శాఖ డైరెక్టర్ షేక్ యాస్మిన్ బాషా, హనుమకొండ వరంగల్ జిల్లాల కలెక్టర్లు చాహత్ బాజ్ పాయి, డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్లు ఎన్. రవి, సంధ్యారాణి, అధికారులు పుష్పగుచ్చాలు, మొక్కలు అందించి ఘనంగా స్వాగతం పలికారు. రైతు మేళా ప్రాంగణానికి చేరుకున్న మంత్రులు స్టాల్స్ ను పరిశీలించారు.

## ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్రస్థాయి మెగా రైతు మేళా

ఉమ్మడి వరంగల్ బ్యూరో(భారత శక్తి)మే7

ఈ నెల 5వ తేదీ నుండి 7వ తేదీ వరకు హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల లో నిర్వహించబడుతోంది.

గురువారం ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ముఖ్య అతిథులుగా హాజరై వివిధ స్టాళ్లను సందర్శించారు.

వారి వెంట వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, కె ఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ రావు, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేంద్ర మోహన్, రాష్ట్ర హార్టికల్చర్ డైరెక్టర్ యాస్మిన్ బాషా, హనుమకొండ, వరంగల్ జిల్లా కలెక్టర్లు చాహాత్ బాజ్ పాయి, డాక్టర్ సత్య శారద,కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ



చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, సంబంధిత శాఖల జిల్లా ఆఅధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సదస్సులో అతిథులు రైతుల పంటల వైవిధ్యీకరణ, ప్రత్యామ్నాయ పంటల సాగు, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, రైతు సంక్షేమ పథకాలు తదితర అంశాలపై ప్రసంగించారు.

## బన్సపల్లి గ్రాజూ పాలకవర్గం తిరిగి బాధ్యతల స్వీకారం: చైర్మన్ రమణారెడ్డి.

నిర్మల్ జిల్లా ప్రతినిధి, మే 07 (భారత్ శక్తి):

దిలావర్‌పూర్ మండలంలోని బన్సపల్లి గ్రాజూ దిలావర్‌పూర్ కార్యాలయంలో గురువారం పాలకవర్గ సభ్యులు తమ పదవీ బాధ్యతలను స్వీకరించారు. చైర్మన్ రమణారెడ్డి, వైస్ ఛైర్మన్‌తో పాటు డైరెక్టర్లు బాధ్యతలు చేపట్టారు.

కోర్టు ఆదేశాల మేరకు కొత్త పాలకవర్గం ఏర్పడే వరకు పాత పాలకవర్గాలే కొనసాగాలని ప్రభుత్వం ఇటీవల ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పాలకవర్గ సభ్యులు తిరిగి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ రమణారెడ్డి మాట్లాడుతూ, రైతుల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తామని తెలిపారు. గ్రాజూ ద్వారా రైతులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు.



## ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి : పౌర సరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఐపీఎస్

జగిత్యాల, మే 7 (భారత శక్తి ప్రతినిధి):

రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఐపీఎస్ గురువారం జగిత్యాల జిల్లాలో పర్యటించారు.

2025-26 యాసంగి (రబీ) సీజన్‌కు సంబంధించి జిల్లాలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లులను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు.

జిల్లాలోని పూడూరు గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన కమిషనర్ రైతులతో నేరుగా మాట్లాడి, ధాన్యం సేకరణలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తూకాల్లో ఎలాంటి తేడాలు లేకుండా చూడాలని, రైతులకు కనీస మద్దతు ధర అందేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుని ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయడంతో పాటు రైతులకు అవసరమైన అవగాహన కల్పించాలని సూచించారు.

ధాన్యం సేకరణలో జాప్యం లేకుండా మిల్ ట్యాగింగ్ ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించేలా రవాణా సౌకర్యాలను పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు.

అనంతరం జిల్లాలోని నూకపెల్లి గుణ గంగన్ రైస్ మిల్లును సందర్శించి, అక్కడి ధాన్యం నిల్వ సామర్థ్యం, మిల్లింగ్ ప్రక్రియను



పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా కస్టమ్ మిల్లింగ్ రైస్ అప్పగించాలని మిల్లర్లకు సూచించారు.


జిల్లా యంత్రాంగం, పౌర సరఫరాల శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. ముఖ్యంగా తేమ శాతం విషయంలో రైతులకు సరైన అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఈ పర్యటనలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్. లత, పౌర సరఫరాల శాఖ జిల్లా అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కొడవటంచ భూముల వేలం పాటలు.

రేగొండ మే 07 (భారత శక్తి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం లోని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ కొడవటంచే లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో స్వామివారికి సంబంధించిన భూముల వేలం పాటలు శుక్రవారం రోజున ఉదయం 11 గంటలకు సర్వే నంబర్ 312లో గల రెండు ఎకరాల 35 గంటలకు సంబంధించిన 2026 27 గాను సదరు దేవస్థాన కార్యాలయం నందు భూమి కవులు వేలంపాటలు నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో పాల్గొని వారు శుక్రవారం ఉదయం 11 గంటలకు వేలం పాటు వేలంపాటలో పాడి భూమిని ఒక సంవత్సరం పాటు కౌంట్ చేసుకోవడం కోసం ప్రయత్నించగలరు. ఈ కార్యక్రమం శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ కోటంచ ఈవో మహేష్ ఆలయ చైర్మన్ ఎన్ సంపత్ రావు ఆధ్వర్యంలో నిర్వహించబడతాయని నిర్వాహకులు తెలిపారు.

సినిమా

## సల్మాన్ మూవీలో విలన్‌గా
# అక్షయ్ ఖన్నా ?



**టాకీస్:** బాలీవుడ్ సూపర్ స్టార్ సల్మాన్ ఖాన్‌తో వంశీ పైడిపల్లి సినిమా తీయనున్న విషయం తెలిసిందే. ఎస్‌వి సి63' అనే టైటిల్‌తో ప్రచారంలో ఉంది. భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రానున్న ఈ సినిమాకు సంబంధించిన ఓ వార్త ప్రస్తుతం ఇండస్ట్రీలో చక్కర్లు కొడుతోంది. ఈ కండల వీరుడితో ఢీ కొట్టేందుకు విలన్ పాత్ర కోసం ఇద్దరి పేర్లు వినిపిస్తున్నాయి. మలయాళ నటుడు ఫహాద్ ఫాజిల్, బాలీవుడ్ సీనియర్ నటుడు అక్షయ్ ఖన్నా ఈ రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. సల్మాన్ ఖాన్ స్క్రీన్ ప్రెజెన్స్‌కు ఏమాత్రం తగ్గకుండా నటనలో ఆయనకు గట్టి పోటీ ఇచ్చే విలన్ ఉండాలని చిత్ర బృందం భావిస్తోందట. అందుకే ఈ ఇద్దరిలో ఒకరిని ఫైనల్ చేసే దిశగా చర్చలు జరుగుతున్నాయి. ప్రముఖ నిర్మాత దిల్ రాజు అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని 2027 ఈద్ కానుకగా ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయడానికి సన్నద్ధమవుతున్నారు. ఇందులో సల్మాన్‌కు జోడీగా అగ్ర కథనాయిక నయనతార నటిస్తుండగా.. సీనియర్ నటుడు అరవింద్ స్వామి ఒక కీలక పాత్రలో కనిపించనున్నారు. ప్రస్తుతం ముంబయిలో దీని షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. నయనతార కూడా ఈ తాజా షెడ్యూల్‌లో పాల్గొన్నారు. సల్మాన్ ఖాన్ మాస్ ఇమేజ్‌కు వంశీ పైడిపల్లి స్టైలిష్ టేకింగ్ తోడైతే ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టించడం ఖాయమని అభిమానులు భావిస్తున్నారు.



# ఎల్లమ్మ మూవీలో హీరోయిన్‌గా మృణాల్ ఠాకూర్

**టాకీస్:** 'బలగం' వంటి హృదయాన్ని తాకే ఫ్యామిలీ ఎమోషనల్ చిత్రంతో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన దర్శకుడు వేణు యెల్దండి తన రెండో సినిమాతో మరోసారి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతు న్నారు. 'ఎల్లమ్మ' అనే ప్రత్యేకమైన టైటిల్‌తో రూపొందుతున్న ఈ చిత్రం ప్రస్తుతం టాలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా హీరోయిన్ ఎంపికపై సాగుతున్న ఉత్కంఠకు ఇప్పుడు తెరపడుతున్నట్లు సమాచారం.తెలంగాణ గ్రామీణ నేపథ్యంతో రూపొందుతున్న ఈ సినిమాలో నటనకు అత్యంత ప్రాధాన్యం ఉన్న పాత్ర కోసం దర్శకుడు చాలా జాగ్రత్తగా హీరోయిన్‌ను ఎంపిక చేయాలని భావించారు. ప్రారంభంలో ఈ పాత్ర కోసం సాయి పల్లవిను సంప్రదించినట్లు వార్తలు వచ్చాయి. అయితే డేట్స్ సమస్యల కారణంగా ఆమె ఈ ప్రాజెక్ట్ నుండి తప్పకున్నట్లు తెలుస్తోంది. ఆ తరువాత కీర్తి సురేష్ పేరు బలంగా వినిపించింది. ఒక దశలో ఆమె ఎంపిక దాదాపు ఖాయమని కూడా ప్రచారం జరిగింది. వీరితో పాటు శృతి హాసన్, భాగ్యశ్రీ బోర్సే, కన్నడ నటి రుక్మిణి వసంత్ పేర్లు కూడా పరిశీలనలోకి వచ్చాయి. అయితే తాజా సమాచారం ప్రకారం 'సీతా రామం' ఫేమ్ మృణాల్ ఠాకూర్ ఈ పాత్రకు దాదాపు ఫైనల్ అయినట్లు ఫిల్మ్ నగర్ వర్గాలు చెబుతున్నాయి. భావోద్వేగ సన్నివేశాల్లో తన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకునే మృణాల్ ఈ సినిమాకు పెద్ద ప్లస్ అవుతుందని చిత్రబృందం భావిస్తోంది. ఇక ఈ చిత్రంలో మరో ఆసక్తికర అంశం ఏమిటంటే, ఫేమస్ సంగీత దర్శకుడు దేవి శ్రీ ప్రసాద్ ఈ సినిమాతో హీరోగా పరిచయం అవుతున్నారు. 'పార్శి' అనే శక్తివంతమైన పాత్రలో ఆయన కనిపించనున్నారు. ఇటీవల విడుదలైన గ్లింప్స్‌లో ఆయన లుక్‌కు మంచి స్పందన వచ్చింది. అంతేకాదు, ఈ చిత్రానికి సంగీతాన్ని కూడా ఆయనే అందిస్తున్నారు. 'ఎల్లమ్మ' సినిమా తెలంగాణ సంప్రదాయాలు, జానపద కళలు, ఆధ్యాత్మిక అంశాలతో ముడిపడిన కథగా రూపొందుతోంది. గ్లింప్స్‌లో చూపించిన వేప ఆకులు, పసుపు, కుంకుమ, గజ్జెల శబ్దాలు సినిమాపై ఆసక్తిని మరింత పెంచాయి. ఈ చిత్రాన్ని దిల్ రాజు, శిరీష్‌లు శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్నారు. హీరోయిన్ ఎంపికపై అధికారిక ప్రకటన వెలువడిన వెంటనే షూటింగ్ పూర్తి స్థాయిలో ప్రారంభం కానుంది. తెలుగుతో పాటు ఇతర దక్షిణాది భాషల్లోనూ పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమాను విడుదల చేయాలని నిర్మాతలు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

## నితిన్ కొత్త సినిమా పూజా
# కార్యక్రమంతో ప్రారంభం



**టాకీస్:** యంగ్ హీరో నితిన్ కథానాయకుడిగా సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ మరియు ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై రూపొందుతున్న తాజా చిత్రం నేడు అత్యంత వైభవంగా ప్రారంభమైంది. పూజా కార్యక్రమాలతో లాంఛనంగా మొదలైన ఈ చిత్ర ప్రారంభోత్సవానికి చిత్ర యూనిట్ సభ్యులు హాజరై సందడి చేశారు. ఈ సినిమా ద్వారా సోము నర్రి దర్శకుడిగా వెండితెరకు పరిచయమవుతుండగా, 'అశోకవనంలో అర్జున కళ్యాణం' ఫేమ్ రితికా నాయక్ నితిన్ సరసన కథానాయికగా నటిస్తోంది. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ భారీ ప్రాజెక్ట్‌కు సురేష్ బొబ్బిలి సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ నెలాఖరు వరకు ఇతర పనులు పూర్తి చేసుకుని, మే రెండో వారం నుంచి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్‌ను జరుపుకోనుంది. వరుస విజయాలతో జోరు మీదున్న సితార సంస్థ ఈ సినిమాతో నితిన్‌కు ఒక భారీ కమర్షియల్ సక్సెస్‌ను అందించేందుకు సిద్ధమైంది. త్వరలోనే ఈ చిత్ర టైటిల్ మరియు పూర్తి నటీనటుల వివరాలను మేకర్స్ అధికారికంగా ప్రకటించనున్నారు.

## 600 కోట్ల భారీ బడ్జెట్‌తో
# రజనీ, కమల్ మూవీ

**టాకీస్:** దక్షిణాదిలో మాత్రమే కాకుండా మొత్తం భారతీయ సినీ పరిశ్రమలో ఇప్పుడు చర్చనీయాంశంగా మారిన భారీ ప్రాజెక్ట్ ఏదైనా ఉందంటే అది సూపర్ స్టార్ రజనీకాంత్, విశ్వనటుడు కమల్ హాసన్ కలిసి నటించబోతున్న మల్టీస్టారర్ సినిమా. ఈ చిత్రాన్ని ప్రతిభావంతుడు నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వం వహించనున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ సినిమాపై భారీ స్థాయిలో అంచనాలు నెలకొనగా, తాజాగా వినిపిస్తున్న వార్తలు మరింత ఆసక్తిని పెంచుతున్నాయి. సినీ వర్గాల్లో ప్రచారం ప్రకారం ఈ సినిమాకు సుమారు రూ.600 కోట్ల భారీ బ్జడెట్ కేటాయించినట్టు సమాచారం. ఇది నిజమైతే భారతీయ సినిమా



చరిత్రలోనే అత్యంత ఖరీదైన చిత్రాలలో ఒకటిగా నిలిచే అవకాశముంది. ఈ భారీ వ్యయంలో ఎక్కువ భాగం ప్రధాన నటులు మరియు సాంకేతిక బృందం పారితోషికాలకే వెళ్తున్నట్టు తెలుస్తోంది.ముఖ్యంగా రజినీకాంత్, కమల్ హాసన్ లాంటి దిగ్గజ నటులు ఒకే సినిమాలో నటించడం వల్ల వారి పారితోషికాలు కూడా అత్యంత భారీగా ఉన్నాయని సమాచారం. దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ కూడా తన విజయాల నేపథ్యంలో మంచి మొత్తాన్ని అందుకుంటున్నట్టు తెలుస్తోంది. ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నది ప్రముఖ సంగీత దర్శకుడు అనిరుధ రవిచందర్ కాగా, ఆయన సంగీతం ఈ సినిమాకు మరో ప్రధాన బలం కానుంది. ఈ భారీ ప్రాజెక్ట్‌ను కమల్ హాసన్‌కు చెందిన నిర్మాణ సంస్థ రాజ్ కమల్ ఫిలింస్ ఇంటర్నేషనల్ నిర్మిస్తోంది. అత్యున్నత నిర్మాణ విలువలతో ఈ చిత్రం రూపొందనుందని సమాచారం. ప్రస్తుతం ముందస్తు పనులు వేగంగా కొనసాగుతుండగా, త్వరలోనే ఈ సినిమా చిత్రీకరణ పూర్తి స్థాయిలో ప్రారంభం కానుంది. ఇంత భారీ స్థాయిలో రూపొందుతున్న ఈ మల్టీస్టారర్‌ను దర్శకుడు నెల్సన్ ఎలా రూపొందిస్తాడో అన్నది ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. మొత్తానికి రజినీకాంత్ , కమల్ హాసన్ కలయిక, నెల్సన్ దర్శకత్వం, అనిరుధ్ సంగీతం కలిసివచ్చి ఈ సినిమాను భారతీయ సినీ రంగంలో ఒక కొత్త మైలురాయిగా నిలబెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## లెనిన్ మూవీలో భాగ్యశ్రీ
# లుక్ విడుదల



**టాకీస్:** 'లెనిన్'లో అఖిల్‌తో కలిసి సందడి చేయడానికి సిద్ధమవుతున్నారు నటి భాగ్యశ్రీ బోర్సే. అఖిల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ సినిమాకు మురళీకిశోర్ అబ్బూరు దర్శకత్వం వహిస్తున్నారు. భాగ్యశ్రీ పుట్టినరోజు సందర్భంగా టీమ్ ఓ స్పెషల్ పోస్టర్‌తో ఆమెకు శుభాకాంక్షలు తెలిపింది. ఈ సినిమాలో ఆమె భారతి అనే పాత్రలో అలరించనున్నారు. తాజాగా పంచుకున్న పోస్టర్‌లో ఆమె పౌరాణిక లుక్‌లో రాచరికపు దుస్తులు, భారీ ఆభరణాలు ధరించి కనిపించారు. తీక్షణమైన చూపులతో ఉన్న ఈ పోస్టర్ చూస్తుంటే ఆమె పాత్ర చాలా శక్తిమంతంగా ఉండనున్నట్లు తెలుస్తోంది. ఇటీవల ఈ సినిమా వాయిదా పడనుందంటూ వార్తలు రాగా నాగార్జున తన పోస్ట్‌తో వాటిని ఖండించారు. అనుకున్న తేదీ ప్రకారం జూన్ 26న ఈ సినిమా విడుదల కానున్నట్లు స్పష్టం చేశారు. ఇందులో కొత్త అఖిల్‌ను చూస్తారని హామీ ఇచ్చారు. తాను ఫస్ట్ కట్ చూశానని అది చూశాకే నమ్మకంతో చెబుతున్నానన్నారు. చిత్తూరు నేపథ్యంలో సాగే కథ ఇది. బలమైన భావోద్వేగాలు, ఆసక్తిని రేకెత్తించే కథనంతో ప్రేక్షకులకు మంచి అనుభూతిని పంచేలా 'లెనిన్' చిత్రం రూపుదిద్దుకొంటోంది.



ఒకప్పుడు చందమామను చూపిస్తూ.. గోరుముద్దలు తినిపించేది అమ్మ! పిల్లాడు ఆరోగ్యంగా పెరిగేవాడు. ఇప్పుడు.. సెల్‌ఫోన్ చేతికిచ్చి, ముద్దలు తినిపిస్తుంది. నాన్నేమో.. ట్యాబ్ చూపిస్తూ లాల పోస్తున్నాడు. ఇలాంటి పరిస్థితుల్లో ఎదుగుతున్న చిన్నారులను.. పసితనంలోనే అనేక రుగ్మతలు చుట్టుముడుతున్నాయి. పెరుగుతున్న సాంకేతికత కొన్నిరకాల వ్యాధులకు కారణం అవుతున్నది. అందులో ఒకటి ఆటిజం. సెల్‌ఫోన్లు, ట్యాబ్‌ల వాడకం పెరిగేకొద్దీ ఆటిజం సమస్య హెచ్చుతున్నది.

# ఎండల్లో తప్పు చేయకండి!

**ఎండాకాలం వచ్చిందంటే చర్మానికీ, శరీరానికీ అవసరాలు మారతాయి. దానికి తగ్గట్టు కొన్ని విషయాల్లో మనమూ మారతాం. అక్కడే తప్పు చేసే అవకాశం ఉంది. ఇవి అవసరాలు కాదు, అనర్థాలు అంటున్నారు చర్మ, ఆరోగ్య నిపుణులు.**

### ఇంట్లో అక్కర్లేదు

సన్‌స్క్రీన్ బయటికెళ్లేప్పుడు మాత్రమే రాసుకోవాలి. ఇంట్లో ఉన్నా, కారులో వెళ్తున్నా అక్కర్లేదు అనుకోవడం అపోహ మాత్రమే. మనం ఎక్కడ ఉన్నా మన చుట్టూ ఉండే వెలుతురులో చర్మానికి హాని చేసే అతినీల లోహిత కిరణాలు ఉంటాయి. కాబట్టి తప్పకుండా ఈ సమయంలో సన్‌స్క్రీన్ వాడాలి.

### కడుగుతూనే ఉండాలి


ఎండాకాలం వచ్చిందంటే అదేదో యాడ్‌లో 'కడుగు బాబు కడుగు' అన్నట్టు మొహాన్ని మాటి మాటికీ నీళ్లతో కడుగుతుంటారు. ఇది ఎండవేళ చర్మానికి హాయిని కలిగించి, తేమగా ఉంచుతుందని అనుకుంటారు. కానీ ఇది నిజం కాదు. ఇలా మాటిమాటికీ నీటితో చర్మాన్ని కడగడం వల్ల 'ట్రాన్స్ ఎపిడెర్మల్ వాటర్ లాస్ (టీఈడబ్ల్యూఎల్)' అని పిలిచే ప్రత్యేక పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో చర్మం తేమను కోల్పోయి పొడిబారుతుంది.

### అదైతే చాలు

వేసవిలో ఏ వీధి మూలన చూసినా మజ్జిగ, పుదీనా రసం కుండలు, జీరా నీళ్లు, నిమ్మరసాలు దొరుకుతుంటాయి. ఎండవేళ చలువ చేస్తాయన్న ఉద్దేశంతో వాటిని స్వేచ్ఛగా తాగుతుంటారు. కానీ, ఇలా బయట దొరికేవి తాగేప్పుడు అక్కడ ఎంత పరిశుభ్రత పాటిస్తున్నారు, ఎలాంటి నీళ్లు వాడుతున్నారులాంటివి గమనించాలి. లేకపోతే పొట్టకు లేనిపోని తంటా తెచ్చినట్టే.

### అన్నీ తాగొచ్చు

ఎండవేళ శరీరంలో నీటి స్థాయుల్ని నిలిపి ఉంచేందుకు ద్రవాలు ఎక్కువగా తీసుకోవాలి. కాబట్టి మంచీ చెడులతో సంబంధం లేకుండా ఏమైనా తాగొచ్చు అనుకోవడం పొరపాటు. కేవలం మజ్జిగ, కొబ్బరినీళ్ల లాంటి సంప్రదాయ ఆరోగ్యకర పానీయాలకే ప్రాధాన్యం ఇవ్వాలి. మిల్క్‌షేక్‌లు, శీతల పానీయాల్లాంటి హై క్యాలరీ డ్రింకులను ఏ కాలంలో అయినా పక్కన పెట్టేయాల్సిందే.



# ఆటిజం.. అరువు తెచ్చుకుంటున్నం!

**మన దేశంలో ప్రతి 80మంది చిన్నారుల్లో ఒకరికి ఆటిజం సమస్య ఉండవచ్చనేది ఒక అంచనా. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకుని ఆటిజంపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏటా ఏప్రిల్ 2న 'వరల్డ్ ఆటిజం అవేర్‌నెస్ డే' నిర్వహిస్తున్నది. అసలు ఈ ఆటిజం అంటే ఏంటి, అది ఎందుకు వస్తుంది, రావడానికి గల కారణాలేంటి? దాని లక్షణాలు, ఆటిజం వల్ల పిల్లల్లో ఎలాంటి అనారోగ్యం ఏర్పడుతుంది? ఈ సమస్యను ఎలా గుర్తించాలి, నిర్ధారణ పద్ధతులు, చికిత్సా విధానం తదితర అంశాలను నేటి ఊపిరిలో తెలుసుకుందాం.**

**ఆటిజం** అనేది బయటికి కనిపించే ఒక రకమైన మానసిక వ్యాధి లక్షణం. చాలా ఆటిజం కేసుల్లో మాటలు మొదట్లో వస్తాయి. కానీ రెండేండ్లు వచ్చేసరికి మాటలు ఆగిపోతాయి. దీనినే 'రిగ్రెషన్' అంటారు. చాలామంది పిల్లల్లో మొదటి రెండేండ్లలోపే ఇది జరుగుతుంది. ఆటిజం సమస్య ఉన్న చిన్నారుల్లో నాలుగైదు ప్రధాన లక్షణాలు కనిపిస్తాయి.

1. భావ వ్యక్తీకరణ లేకపోవడం. అది భాష పరంగా గానీ, హావభావాలు వ్యక్తపరచడంలో గానీ సమస్య ఉంటుంది. అంటే వాళ్లు సరిగ్గా మాట్లాడలేరు.
2. ఇతరుల భావాలను గ్రహించలేరు. అంతేకాదు వారి భావోద్వేగాలను వ్యక్తపర్చలేరు.
3. సామాజిక బాంధవ్యాలు తెలియదు. అంటే ఇతరులతో కలిసి ఆడుకోవడం, కలివిడిగా ఉండటానికి ఇష్టపడరు. ఒంటరిగా ఉండాలని కోరుకుంటారు.
4. చేసిన పనినే మళ్లీ మళ్లీ చేస్తుంటారు.
5. ఈ చిన్నారుల్లో మానసిక పరిణతి తక్కువగా ఉంటుంది.

ఈ లక్షణాలన్నీ ఆటిజం పిల్లల్లో ప్రాథమికంగా కనిపిస్తుంటాయి. ఈ సమస్యలతో సతమతమవుతున్న వారిని ఆటిజం బాధితులుగా పరిగణిస్తారు.



### కారణాలు

- ఆటిజం సమస్యకు ఒక ప్రత్యేకమైన కారణమని ఏదీ లేదు. సాధారణంగా 9 నెలల నుంచి 18 నెలలు వచ్చే వరకు పిల్లలు భావాలను వ్యక్తీకరించడంతో పాటు, గ్రహించడం, భాష నేర్చుకోవడం చేయగలుగుతారు. ఈ వయసులో చిన్నారులకు ఫోన్‌లు, టీవీ, ట్యాబ్ లాంటివి అలవాటు కావడం వల్ల భావ వ్యక్తీకరణ, భాష నేర్చుకోవడం దెబ్బతింటుంది. స్క్రీన్ టైమ్‌కి అలవాటు పడితే ఈ సమస్యలు వస్తాయి. అమెరికన్ పీడియాట్రిక్ సొసైటీ ప్రకారం మొదటి 3 సంవత్సరాల వరకు పిల్లలను ఫోన్, టీవీకి దూరంగా ఉంచడం మంచిది. వాటికి అలవాటుపడితే ఆటిజం వచ్చే ప్రమాదం ఉందని సదరు సొసైటీ హెచ్చరించింది.
- బహుళ భాషలను నేర్చుకోవాల్సి రావడమూ పిల్లల్లో ఆటిజం సమస్యకు కారణం కావొచ్చు. చిన్నారులకు మాటలు వచ్చే క్రమంలో.. తల్లిదండ్రులు వేర్వేరు భాషల్లో మాట్లాడటం వల్ల, పిల్లలకు ఏ భాషను స్వీకరించాలో అర్థం కాదు. వాళ్లు అయోమయానికి గురై భాషపై పట్టుచిక్కకపోవడం వల్ల ఆటిజానికి గురయ్యే అవకాశాలు ఉంటాయి.
- యాంటీ బయోటిక్స్ లాంటి ఔషధాలు ఎక్కువగా వాడటం కూడా ఆటిజానికి దారితీయొచ్చు.
- ఐవీఎఫ్ ద్వారా జన్మించిన పిల్లల్లో కూడా ఆటిజం రిస్క్ కనిపిస్తున్నది.
- 18 నెలల వయసులో పిల్లలకు ఇచ్చే ఎంఎంఆర్ టీకా వల్ల కూడా ఆటిజం వస్తుందనేది ప్రజల్లో ఉన్న ఒక అపోహ మాత్రమే. దానికి సంబంధించి ఇప్పటి వరకు ఎలాంటి ఆధారాలు లేవు.

గతంలో ఉమ్మడి కుటుంబాలు ఉండేవి. పిల్లల పెంపకంలో పెద్దల పాత్ర అధికంగా ఉండేది. అమ్మమ్మ, నానమ్మ, తాతయ్య, మేనమామ, అత్తయ్య, చిన్నాన్న, పిన్ని... ఇలా ఎవరో ఒకరు పిల్లలతో సమయం గడిపేవారు. అప్పట్లో సెల్‌ఫోన్‌లు, ట్యాబ్‌ల ఊసే లేదు. మనుషుల మధ్య కమ్యూనికేషన్ ఎక్కువగా ఉండేది. నిరంతరం వారి మధ్య ఉండటం వల్ల పిల్లల్లో భాషా వికాసం బాగా ఉండేది. హావభావాల వ్యక్తీకరణతో పాటు మానసిక పురోగతిలోనూ వయసుకు తగ్గ పరిణతి కనిపించేది. కానీ, ఇప్పుడు ఉమ్మడి కుటుంబాల ఉనికి గణనీయంగా తగ్గిపోయింది. నూటికి 90 శాతం న్యూక్లియర్ ఫ్యామిలీలే ఉంటున్నాయి. దీనికితోడు తల్లిదండ్రులు ఇద్దరూ ఉద్యోగాలు చేయడం వల్ల పిల్లలు అధిక సమయం ఒంటరిగా గడపాల్సి వస్తున్నది. మనుషులతో కన్నా డిజిటల్ కమ్యూనికేషన్ ఎక్కువైంది. ఏడాది వయసున్న పిల్లలు కూడా సెల్‌ఫోన్, ట్యాబ్‌తో ఆడుకోవడం కనిపిస్తున్నది. ఇలాంటి పరిస్థితులు సైతం ఆటిజానికి దారితీసే అవకాశాలు లేకపోలేదు.

### లక్షణాలు

- పిల్లలు తల్లిదండ్రుల కండ్లలోకి కూడా నేరుగా చూడలేకపోవడం
- పేరుపెట్టి పిలిచినా వెంటనే స్పందించకపోవడం
- ఇతర పిల్లలతో కలిసి ఆడుకోకపోవడం
- ఒంటరిగా ఉండేందుకే ఇష్టపడటం
- ఒకే రకమైన బొమ్మతో మాత్రమే ఆడుకోవడం, మరో బొమ్మ ఇస్తే తీసుకోకపోవడం
- కొందరు పిల్లల్లోనైతే స్పర్శ, వాసన, చూపు, వినికిడి వంటి జ్ఞానేంద్రియ వ్యవస్థ అసంబద్ధంగా ఉంటుంది.

ఈ లక్షణాలన్నీ మొదటి మూడు సంవత్సరాల్లోపు కనిపిస్తాయి.

### రోగ నిర్ధారణ పద్ధతులు

**ప్రత్యేక** లక్షణాలు కనిపించిన వెంటనే సంబంధిత వైద్యులను సంప్రదించాలి. ఆటిజాన్ని నిర్ధారించేందుకు ఇప్పటి వరకు ప్రపంచ వ్యాప్తంగా ఎలాంటి వైద్య పరిజ్ఞానం గానీ, రోగ నిర్ధారణ పద్ధతులు గానీ అందుబాటులో లేవు. కేవలం అనుభవజ్ఞులైన సైకాలజిస్టులు, సైకియాట్రిస్టులు మాత్రమే సమస్యను కొన్ని రకాల పరీక్షల ద్వారా నిర్ధారించగలరు.

### చికిత్సా పద్ధతులు

ఆటిజానికి సంబంధించిన లక్షణాలను ఎంత త్వరగా గుర్తించి, సరైన థెరపీలను అందించగలిగితే అంత మంచిది. 6 నెలల్లోనే 50 శాతం సమస్యను నివారించవచ్చు. కనీసం 3 సంవత్సరాల్లోపు సమస్యను గుర్తించి చికిత్స అందిస్తేనే ఫలితం ఉంటుంది. ఈ 3 సంవత్సరాల గోల్డెన్ టైమ్ దాటిపోతే ఎలాంటి చికిత్సలు అందించినా ఫలితం ఆశించిన మేరకు ఉండకపోవచ్చు. ఆటిజం బాధిత చిన్నారులకు ప్రధానంగా మూడు రకాల థెరపీలతో చికిత్స అందిస్తారు. అందులో 1.ఆక్యుపేషనల్ థెరపీ 2. బిహేవియర్ థెరపీ 3. స్పీచ్ థెరపీ



**1.ఆక్యుపేషనల్ థెరపీ:**
పిల్లల్లో ప్రారంభ దశలో జ్ఞానేంద్రియాలు అసంబద్ధంగా ఉన్నట్లు గుర్తిస్తే, ఆక్యుపేషనల్ థెరపీ అందించవచ్చు. దీని వల్ల ఐదు జ్ఞానేంద్రియాలు నియంత్రణలోకి వచ్చి, సమస్య దాదాపుగా పరిష్కారమవుతుంది.

**2.బిహేవియర్ థెరపీ:**
బిహేవియర్ థెరపీతో పిల్లల అసాధారణ ప్రవర్తనకు సంబంధించిన సమస్యలు పరిష్కరించవచ్చు.

**3. స్పీచ్ థెరపీ:**
ఆటిజం పిల్లల విషయంలో స్పీచ్ థెరపీ చాలా ముఖ్యమైంది. మొదటి రెండు థెరపీలు... అంటే ఆక్యుపేషనల్ థెరపీ, బిహేవియర్ థెరపీల తర్వాతే స్పీచ్ థెరపీ ఇవ్వాల్సి ఉంటుంది. అప్పుడే ఇది ప్రభావవంతంగా పనిచేస్తుంది.

### సలహాలు

- ప్రారంభ దశలోనే గుర్తించి నిపుణులైన వైద్యులను సంప్రదించాలి.
- మూడేండ్లలోపు పిల్లలను బ్లూ లైట్‌కు దూరంగా ఉంచాలి. అంటే సెల్‌ఫోన్స్, ట్యాబ్స్, టీవీలు వంటి ఎలక్ట్రానిక్ పరికరాలు ఇవ్వకూడదు.
- పిల్లలకు ఎలక్ట్రానిక్ పరికరాలు ఇచ్చి, ఒంటరిగా వదిలేయకుండా వారితో తల్లిదండ్రులు లేదా ఇతర కుటుంబ సభ్యులు గడపడం ఉత్తమం.






# నిద్రలోనూ సుఖం లేదు!

**శారీరక** శ్రమకు, మానసిక ఆందోళనకు చక్కని ఔషధం నిద్ర. ఆరు గంటలు ఆదమరచి నిద్దరోతే.. సమస్యలన్నీ పరారైన అనుభూతి కలుగుతుంది. కానీ, సుఖమెరుగని నిద్ర.. అతివలకు అంతగా అందడం లేదని సర్వేల సారాంశం. స్లీప్ ఫౌండేషన్ ఇచ్చిన నివేదిక.. పురుషుల కన్నా స్త్రీలు నిద్రలేమితో ఎక్కువగా బాధపడుతున్నారని తేల్చింది. ఉద్యోగం, ఇల్లు, పిల్లలు, ఇతర బాధ్యతలతో మల్టీ టాస్కింగ్ చేస్తున్న మహిళలు సరైన నిద్ర లేక సతమతమవుతున్నారని నివేదిక సారాంశం. ఇందుకు కారణాలూ లేకపోలేదు. రుతుక్రమంలో ఈస్ట్రోజెన్, ప్రొజెస్టిరాన్లలో హెచ్చుతగ్గులు నిద్రకు భంగం కలిగిస్తాయి. ముఖ్యంగా రుతుస్రావం ముందు, మెనోపాజ్ సమయంలో వేడి ఆవిర్లు, రాత్రి చెమటలు నిద్రను భంగపరుస్తున్నాయని పరిశోధకులు తేల్చారు. అంతే కాదు గర్భిణిగా ఉన్నప్పుడు హార్మోన్లలో చోటుచేసుకునే మార్పుల కారణంగా శారీరక అసౌకర్యం ఏర్పడుతుంది. ఇది నిద్ర నాణ్యతపై గణనీయంగా ప్రభావం చూపుతుందట. ఈ నిద్రలేమి హృదయ సంబంధ వ్యాధులు, మానసిక రుగ్మతలకు దారి తీస్తుందని ఆరోగ్యరంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు. సుఖనిద్రకు తగ్గ ఏర్పాట్లు చేసుకోవడం అవసరమని సూచిస్తున్నారు.

# స్నానం తర్వాత బ్రషింగా?



**ఒక్కోసారి** హడావుడిగా, ఏదో ఆలోచనలో ఉండి బ్రష్ చేసుకోలేదనే విషయం మరిచిపోయి స్నానం చేసేస్తుంటాం. తర్వాత గుర్తొచ్చి అప్పుడు బ్రష్ చేసుకుంటాం. ఇది ఎప్పుడో పొరపాటున ఒకసారి జరిగితే పర్వాలేదు. కానీ, అదే అలవాటుగా మారితే మాత్రం చర్మానికి నష్టమేనని హెచ్చరిస్తున్నారు ఆరోగ్య నిపుణులు. మనం పళ్లు తోముకున్నప్పుడు బ్యాక్టీరియా నోటి నుంచి చర్మం మీదకు చేరే ఆస్కారం ఎక్కువగా ఉంటుంది. అందువల్ల నోటి చుట్టూ, గడ్డం చుట్టూ ఇరిటేషన్ వచ్చే అవకాశం ఉంటుంది. తర్వాత అది నెమ్మదిగా మొటిమలకు కారణమవుతుంది. బ్రష్ చేసే సమయంలో చర్మం మీదికి బదిలీ అయిన బ్యాక్టీరియా వల్ల చర్మం మీద పగుళ్లు కూడా ఏర్పడవచ్చని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అందుకే స్నానానికి ముందే బ్రష్ చేసుకోవడం సురక్షితం. ఒకవేళ స్నానం తర్వాత బ్రష్ చేయాల్సి వస్తే ముఖాన్ని మరోసారి సబ్బుతో లేదా ఫేస్‌వాష్‌తో శుభ్రం చేసుకోవాలని సూచిస్తున్నారు.

# ముందే తినేయాలి!

**రోజూ వీలైనంత త్వరగా భోజనంచేస్తే గుండె రక్తనాళాల వ్యాధుల ముప్పు తగ్గుతుందట. నేచర్ కమ్యూనికేషన్స్ జర్నల్‌లో ప్రచురితమైన ఈ అధ్యయనం కోసం పరిశోధకులు 1,03,389 మంది నుంచి ఆహార విధానాలు, గుండె రక్తనాళాల జబ్బులకు సంబంధించిన సమాచారం సేకరించారు. వీరిలో 79 శాతం మంది మహిళలే. పరిశోధనలో పాల్గొన్నవాళ్ల సగటు వయసు 42 ఏండ్లు..**

**వయసు,** లింగం, కుటుంబ పరిస్థితి మొదలైన సామాజిక పరిస్థితులు, ఆహారంలో పోషకాల నాణ్యత, జీవనశైలి, నిద్రా చక్రాన్ని పరిశోధకులు పరిగణనలోకి తీసుకున్నారు. పొద్దున్నే టిఫిన్ చేయకుండా భోజనం చేసేవారిలో ఒక్కో గంట ఆలస్యానికి గుండె రక్తనాళాల వ్యాధుల తీవ్రత 6 శాతం పెరుగుతుందని పరిశోధకులు కనుక్కొన్నారు. అంటే పొద్దునే 9 గంటలకు తినే వ్యక్తికి 8 గంటలకే తిన్న వ్యక్తితో పోలిస్తే గుండె రక్తనాళాల జబ్బుల ముప్పు 6 శాతం ఎక్కువగా ఉంటుందన్న మాట. 9 తర్వాత ఒక్కో గంట గడుస్తుంటే ఈ ముప్పు 28 శాతం ఎక్కువగా ఉంటుందని అధ్యయనం వెల్లడించింది. అయితే, ముందురోజు రాత్రి చివరి భోజనానికి, తర్వాతి రోజు ఉదయం భోజనానికి మధ్య విరామం ఎక్కువగా ఉంటే గుండె రక్తనాళాల వ్యాధుల ముప్పు తక్కువట. అలా ఈ పరిశోధన రోజూ పొద్దున, సాయంత్రం భోజనాలు వీలైనంత త్వరగా ముగించేయాలని వెల్లడిస్తున్నది. గ్లోబల్ బర్డన్ ఆఫ్ డిసీజెస్ అధ్యయనం ప్రకారం ప్రపంచ ప్రజల్లో మరణాలకు కారణమయ్యే వ్యాధుల్లో గుండె రక్తనాళాల సమస్యలే ముందువరుసలో ఉన్నాయి.



2019లో గుండె సమస్యలతో 18.6 మిలియన్ల మంది మరణించారు. వీటిలో 7.9 శాతం మరణాలకు ఆహారపు అలవాట్లే ప్రధాన కారణంగా నిలిచాయి. అంటే... ''ఈ తరహా వ్యాధుల పుట్టుక, అభివృద్ధిలో ఆహారం కీలకపాత్ర పోషిస్తున్నదని తెలుస్తుంది. పశ్చిమ దేశాల సమాజాల ఆధునిక జీవనశైలి రాత్రి భోజనం మరీ ఆలస్యంగా చేయడం, పొద్దునే టిఫిన్ తీసుకోకపోవడం మొదలైన ఆహారపు అలవాట్లకు దారితీసింది. అయితే, ఉదయం, రాత్రి భోజనాలు వీలైనంత తొందరగా ముగించుకునే అలవాట్లను స్వీకరిస్తే గుండె రక్తనాళాల వ్యాధుల ముప్పు తగ్గించుకోవచ్చు'' అని పరిశోధకులు పేర్కొన్నారు.

# గ్లైఫోసేట్.. గర్భిణులకు ముప్పు



**గ్లైఫోసేట్‌ను** పంటల్లో కలుపు నివారణకు వాడతారు. ఇది పంటలకు హాని కలిగించకుండానే కలుపును నిర్మూలిస్తుంది. కాబట్టి, రైతులు దీన్ని విస్తృతంగా వాడుతున్నారు. ఏండ్ల తరబడి జరిగిన అధ్యయనాల ద్వారా గ్లైఫోసేట్ మనుషుల్లో క్యాన్సర్‌కు కారణం కావచ్చని భావిస్తున్నారు. ఆహారం రూపంలో అంతగా హాని కలిగించనప్పటికీ గ్లైఫోసేట్ ఆధారిత రసాయనాలు మనుషులను వివిధ రకాలుగా ప్రభావితం చేస్తాయి. చర్మం మండుతుంది. శ్వాసిస్తే ముక్కు రంధ్రాల్లో ఇబ్బందిగా ఉంటుంది. కొన్నిసార్లయితే తీవ్రతను బట్టి కాలేయం, కిడ్నీల పనితీరును దెబ్బతీస్తుంది. మరణం కూడా సంభవించవచ్చు. అంతేకాదు... గ్లైఫోసేట్ గర్భిణుల మీద మరింత దుష్ప్రభావం చూపుతుంది. గర్భధారణ సమయం ఏ కొంచెం తగ్గినా కూడా పుట్టబోయే శిశువు జీవితంపై ప్రతికూల ప్రభావాలకు దారితీస్తుంది. పైగా బిడ్డ పుట్టకముందే శాశ్వత నష్టం కూడా జరగవచ్చు. బిడ్డ పుట్టిన తర్వాత కూడా శరీర పెరుగుదలకు సంబంధించిన సమస్యలు తలెత్తుతాయి. గర్భిణులపై గ్లైఫోసేట్ ప్రభావం గురించి అమెరికాకు చెందిన 'ది ఎన్విరాన్‌మెంటల్ హెల్త్ యూనిట్' జరిపిన సర్వేలో ఈ వివరాలు తెలిశాయి.

అధ్యయనం కోసం పరిశోధకులు 18– 40 సంవత్సరాల మధ్య వయసున్న 77 మంది మహిళల్ని ఎంచుకున్నారు. వీరిని 2015 జూన్ నుంచి 2016 జూన్ వరకు పరీక్షించారు. వీరి మూత్రం నమూనాల్లో దాదాపు 93 శాతం మందిలో గ్లైఫోసేట్ అవశేషాలు చెప్పుకోదగ్గ స్థాయిలో ఉన్నట్టు గుర్తించారు. పట్టణ మహిళలతో పోలిస్తే గ్రామీణుల్లో ఈ సమస్య ఎక్కువగా ఉన్నట్టు ఈ అధ్యయనంలో తేలింది. మొదట్లో దీనికి కారణం నీళ్లు కావచ్చని అనుకున్నారు. కానీ కలుపు నివారణకు గ్లైఫోసేట్ వాడటం వల్ల ఆయా పంటలను ఆహారంగా తీసుకోవడంతో ఈ దుస్థితి దాపురించిందని ఇప్పుడు అనుమానిస్తున్నారు. ఇది చిన్న అధ్యయనమే అయినప్పటికీ ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉండాలనేది పరిశోధకుల హెచ్చరిక. మరో విషయం... గర్భిణులు తమ తొలి మూడు నెలల కాలంలో ఈ కలుపు నివారిణికి దూరంగా ఉండాలంటున్నారు పరిశోధకులు. లేదంటే తల్లిపాల ద్వారా కలుపుమందు అవశేషాలు పిల్లలకు చేరుకుంటాయి. కాబట్టి, రైతులు కూడా గ్లైఫోసేట్‌కు ప్రత్యామ్నాయాలను వాడాలి. గర్భిణులు తొమ్మిది నెలలపాటు ఈ కలుపుమందు ప్రభావం అసలే పడకుండా జాగ్రత్త వహించాలని పరిశోధకులు సూచిస్తున్నారు.

# కృష్ణమ్మ పరవళ్ల కోసం కదలిరండి!

* నేడు చౌదర్‌గూడలో 'పాలమూరు-రంగారెడ్డి' సాధన సభ
* ప్రాజెక్టు పనుల పరిశీలనలో తెలంగాణ రక్షణ సేన నేతలు
* దక్షిణ తెలంగాణకు సంజీవని ఈ ఎత్తిపోతల పథకం
* రైతులు, యువత భారీగా తరలిరావాలని పిలుపు

హైదరాబాద్, మే 7 (భారత శక్తి ) : దక్షిణ తెలంగాణ బీడు భూములకు జీవం పోసి, ఈ ప్రాంత రూపురేఖలను మార్చగల ఏకైక సంజీవని 'పాలమూరురంగారెడ్డి' ఎత్తిపోతల పథకమని తెలంగాణ రక్షణ సేన నాయకులు పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలన్న సంకల్పంతో గురువారం మండల కేంద్రంలో నిర్వహించ తలపెట్టిన "సాధన సభ" ఏర్పాట్లను పార్టీ ముఖ్య నేతలు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు సభా స్థలి వద్ద మీడియాతో మాట్లాడారు.

* ఎండిన భూములకు సాగునీరే ప్రాణాధారం

ఎండిన బీడు భూములను సస్యశ్యామలం చేసి, రైతాంగం బతుకుల్లో వెలుగులు నింపేందుకు సాగునీరే ప్రధాన మార్గమని నేతలు స్పష్టం చేశారు. మన పొలాలకు దక్కాల్సిన నీటి వాటా కోసం, భవిష్యత్తు తరాల బాగు కోసం ప్రజలంతా ఏకమై ఈ సభలో గొంతు కలపాలని కోరారు. ముఖ్యంగా యువత ఈ ఉద్యమానికి వెన్నెముకగా నిలవాలని, ప్రాజెక్టు పూర్తయితేనే వ్యవసాయంతో పాటు పారిశ్రామికంగానూ ఈ ప్రాంతం అభివృద్ధి చెంది ఉపాధి అవకాశాలు పెరుగుతాయని వివరించారు.

**మహిళల తాగునీటి కష్టాలకు విముక్తి**

ప్రాజెక్టు సాకారమైతేనే గ్రామాల్లో తాగునీటి గోస తీరుతుందని, ఇళ్లలో సిరిసంపదలు



వెల్లివిరుస్తాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. "మన నీటి హక్కు.. మన భవిష్యత్తు.. మన బాధ్యత" అనే నినాదంతో సాగుతున్న ఈ పోరాటంలో మహిళలు, మేధావులు, ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

**ముమ్మరంగా ఏర్పాట్లు**

సభను మహా విజయం చేసేందుకు అన్ని వర్గాల ప్రజలు కదలిరావాలని కోరారు. సభా స్థలిని పరిశీలించిన వారిలో తెలంగాణ రక్షణ సేన రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగా రెడ్డి, రాష్ట్ర మైనారిటీ విభాగం అధ్యక్షుడు మహమ్మద్ ముస్తఫా, నారాయణపేట అధ్యక్షుడు గవినోళ్ళ శ్రీనివాస్, షాద్‌నగర్ నియోజకవర్గ ఇంచార్జ్ చీమల రమేష్ ఉన్నారు. వీరితో పాటు సమన్వయకర్తలు చిలుక ప్రవీణ్, శీలం వీరేందర్, చామర్తి శీతారామ్, నాయకులు శ్యామ్, శ్రవణ్ గౌడ్, శివరామకృష్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## అవినాష్ గౌడ్ నిశిత వధూవలను ఆశీర్వదించిన చిగురింత, నరసింహ రెడ్డి

బడంగ్పేట్, మే 7 (భారత శక్తి): అలియాబాద్‌లోని రెడ్డి జన సంఘం హాల్‌లో గురువారం జరిగిన అవినాష్ గౌడ్, నిశితల వివాహ వేడుక కన్నుల పండువగా జరిగింది. ఈ శుభకార్యానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

**హాజరైన ప్రముఖులు**

వివాహ వేడుకకు విచ్చేసిన వారిలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగిరింత నరసింహారెడ్డి, మాజీ కార్పొరేటర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి ముఖ్యులు. వీరితో పాటు కాంగ్రెస్ నాయకులు టేకుల శశిధర్ రెడ్డి, కృష్ణంరాజు గౌడ్, సుధాకర్ రెడ్డి తదితరులు కళ్యాణ మండపానికి చేరుకుని కొత్త దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

**వేడుకలో సందడి**

ప్రముఖ రాజకీయ నాయకుల రాకతో వివాహ వేడుకలో సందడి నెలకొంది. వధూవరుల కుటుంబ సభ్యులతో ముచ్చటించిన నాయకులు, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ కార్యకర్తలు, ఇరు కుటుంబాల బంధుమిత్రులు పాల్గొన్నారు.

## సోమయ్యపై అసత్య ప్రచారాలు తగవు

* జర్నలిస్టు వర్గాల ఆగ్రహం
* టీడబ్ల్యూజేఎఫ్ విభజనపై విమర్శలు

హైదరాబాద్, మే 07: భారత శక్తి తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు మామిడి సోమయ్యపై బసవపున్నయ్య చేస్తున్న ఆరోపణలను జర్నలిస్టు వర్గాలు తీవ్రంగా ఖండించాయి. సోమయ్యపై వ్యక్తిగత ద్వేషంతోనే అసత్య ప్రచారాలకు ఒడిగడుతున్నారని పలువురు పాత్రికేయులు మండిపడ్డారు. స్వార్థ ప్రయోజనాల కోసం వేలాది మంది జర్నలిస్టులను అయోమయానికి గురి చేయడం సరికాదని హితవు పలికారు.

**సంఘం విచ్ఛిన్నానికి కారకులెవరు?**

రాష్ట్రంలో జర్నలిస్టుల ఐక్యతకు మారుపేరుగా ఉన్న టీడబ్ల్యూజేఎఫ్ రెండు వర్గాలుగా చీలిపోవడానికి గల అసలు కారణాలు రాష్ట్ర పాత్రికేయ సమాజానికి తెలుసని జర్నలిస్టులు గుర్తు చేస్తున్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా సాగాల్సిన సంఘంలో "నేనే నడిపిస్తున్నా" అనే ధోరణితో వ్యవహరించడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని విమర్శించారు. ఒకే వర్గానికి పెద్దపీట వేస్తూ, ఇతరులను విస్మరించడాన్ని ప్రశ్నించినందుకే వ్యవస్థాపకులను అవమానించడం, బహిష్కరణల పేరుతో డ్రామాలు ఆడటం నైతికంగా, చట్టపరంగా చెల్లదని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఈ వ్యవహారం కోర్టు పరిధిలో ఉన్నప్పటికీ, సోషల్ మీడియా వేదికగా దూషణలకు దిగడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు.

**మూడు దశాబ్దాల పోరాటం**

గత మూడు దశాబ్దాలుగా చిన్న పత్రికలు, కేబుల్ ఛానళ్లు, డిజిటల్ మీడియా జర్నలిస్టుల హక్కుల కోసం మామిడి సోమయ్య నిరంతర పోరాటం చేస్తున్నారని జర్నలిస్టులు పేర్కొన్నారు.

* అక్రిడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు, ఇళ్ల స్థలాల కోసం అనేక ధర్నాలు నిర్వహించారు.
* సమాచార భవన్ వద్ద నిరసనలు, ప్రభుత్వ అధికారులతో చర్చలతో పాటు హైకోర్టులో న్యాయపోరాటం చేసిన చరిత్ర ఆయనకుంది.
* పెద్ద పత్రికల వారికే పరిమితమవుతున్న రాయితీలను గ్రామీణ విలేకరులకు, చిన్న మీడియా సంస్థలకు దక్కేలా చేయడంలో సోమయ్య కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు.

**ఆత్మపరిశీలన చేసుకోవాలి**

పదేళ్ల పాటు మీడియా అక్రిడిటేషన్ కమిటీ



సభ్యుడిగా, ప్రధాన కార్యదర్శిగా పదవులు అనుభవించిన బసవపున్నయ్య.. చిన్న జర్నలిస్టుల సమస్యలపై ఎన్నిసార్లు గళమెత్తారని జర్నలిస్టులు ప్రశ్నించారు. పదవుల కోసం, రాజకీయ లబ్ధి కోసం సోమయ్య ఎన్నడూ పాకులాడలేదని, జర్నలిస్టుల హక్కులే ధ్యేయంగా పనిచేస్తున్నందుకే వేలాది మంది ఆయన వెంటే ఉన్నారని పేర్కొన్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కంటే జర్నలిస్టుల సంక్షేమమే ముఖ్యమని భావించే నాయకత్వాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని జర్నలిస్టు ప్రతినిధులు ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.

## హైకోర్టు కేసుతో మీకేం సంబంధం

* ఆ కేసు టీడబ్ల్యూజేఎఫ్ కు సంబంధం
* టీడబ్ల్యూజేఎఫ్ తో బసవపున్నయ్య,రాంచందర్ లకు సంబంధం లేదు

హైదరాబాద్, మే 07 (భారతశక్తి) : రాష్ట్ర, జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీలపై తాను హైకోర్టులో వేసిన కేసు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) యూనియన్ కే సంబంధం ఉందని, యూనియన్ నుంచి తనను ఎవరూ బహిష్కరించలేదనీ, టీడబ్ల్యూజేఎఫ్ వ్యవస్థాపక, రాష్ట్ర అధ్యక్షుడిగా తాను కోర్టులో కేసు వేయడం జరిగిందని ఆ సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య స్పష్టం చేశారు. ఈ కేసుతో తమకు సంబంధం లేదంటున్న పిల్లి రాంచందర్, బసవపున్నయ్య అనే వ్యక్తులు తమ టీడబ్ల్యూజేఎఫ్ సంఘానికే సంబంధం లేరని, వారు తమ సంఘం నాయకులు కదని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ యూనియన్ కు అక్రెడిటేషన్ కమిటీ ల్లో ప్రాతినిధ్యం ఇవ్వకపోవడం వల్ల కమిటీల్లో తమ వాయిస్ లేక చాలా మంది జర్నలిస్టులకు అన్యాయం జరుగుతుందనే ఉద్దేశంతో తాను ప్రభుత్వం పై కేసు వేశానే తప్ప, జర్నలిస్టులకు అన్యాయం చేయడం కోసం కాదని అన్నారు. తమ యూనియన్ నుంచి తొలగించబడిన వ్యక్తులు స్వప్రయోజనాలు, వారి పత్రిక ప్రయోజనాలు పొందడం కోసం ప్రభుత్వంతో కుమ్మక్కై నాపై గోబెల్ ప్రచారం చేస్తున్నారని మామిడి సోమయ్య ఖండించారు. తాను ఒక జర్నలిస్టు యూనియన్ స్థాపించి గత 20 ఏళ్ళుగా జర్నలిస్టుల సమస్యలపై పోరాడుతున్న నాపై కొందరు కుట్రపన్ని యూనియన్ లో లేకుండా చేయాలనుకున్నారని, కానీ నావైపు ఉన్న మెజారిటీ జర్నలిస్టులు వాళ్ళ ఆటలు సాగనీయలేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మీడియా అక్రెడిటేషన్ల జీవో 252 ప్రకారం రాష్ట్ర, జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీలలో తమ టీడబ్ల్యూజేఎఫ్ సభ్యులకు ప్రాతినిధ్యం కల్పించాలని, లేదంటే కమిటీ నిర్ణయాలు అమలు కాకుండా చూడాలని కోరుతూ తాను హైకోర్టు ఆశ్రయించడం జరిగిందని తెలిపారు. తనను టీడబ్ల్యూజేఎఫ్ యూనియన్ నుంచి బహిష్కరించినట్లు చట్టవిరుద్ధమైన ప్రకటన చేసిన బసవపున్నయ్య, పిల్లి రాంచందర్ లపై కోర్టులో కేసు వేయడం జరిగిందని, అదేవిధంగా కార్మిక శాఖలో ఫిర్యాదు కూడా చేశామని పేర్కొన్నారు. అబద్ధపు ప్రచారాలతో అసలు సమస్యను పక్కదారి పట్టిస్తున్నారని, తమ నేతృత్వంలోని టీడబ్ల్యూజేఎఫ్ కు కార్మిక శాఖ గుర్తింపు ఇచ్చిందన్న విషయం అవాస్తవమని అన్నారు.తాను కోర్టులో వేసిన కేసు పెండింగ్ లో ఉండగా కార్మిక శాఖ గుర్తింపు ఎలా ఇస్తుందని ఆయన ప్రశ్నించారు. తప్పుడు ప్రచారంతో ఇటు జర్నలిస్టులను, అటు ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. అబద్ధపు మాయ మాటలతో అటు ప్రభుత్వాన్ని, ఇటు అధికారులను మచ్చిక చేసుకొని తమ సంఘం ద్వారా లబ్ది పొందేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. టీడబ్ల్యూజేఎఫ్ పైన గానీ, సంఘం వ్యవస్థాపకుల పైన గానీ మరోసారి తప్పుడు ప్రచారం చేసినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని మామిడి సోమయ్య హెచ్చరించారు.



## ఐఅండ్ పీఆర్ కమీషనర్ కు టీడబ్ల్యూజేఎఫ్ మీడియా డైరీ

హైదరాబాద్, మే 07 (భారత శక్తి) : తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు మామిడి సోమయ్య గురువారం రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ స్పెషల్ కమీషనర్ ముకుందరెడ్డిని కలిసి ఫెడరేషన్ మీడియా డైరీని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన పలు జర్నలిస్టుల సమస్యపై కమీషనర్ తో చర్చించారు. ప్రధానంగా కొత్త అక్రెడిటేషన్ కార్డుల పంపిణీ విషయం అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం లో ఫెడరేషన్ రాష్ట్ర కోకన్వీనర్ తన్నీరు శ్రీనివాస్, సీనియర్ నాయకుడు పద్మనాభ రావు తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ నియంత్రణ ప్రభుత్వం ప్రాధాన్యత అంశం : డీజీపీ సీవీ ఆనంద్

హైదరాబాద్, మే 7 ( భారత శక్తి) : డ్రగ్స్ నియంత్రణను ప్రభుత్వం ప్రాధాన్యత అంశంగా తీసుకుందని డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. ''డ్రగ్స్ మహమ్మారి వల్ల ఎన్నో కుటుంబాలు బాధపడుతున్నాయి. డ్రగ్స్ నివారణకు ఈగల్ ఫోర్స్ చాలా కృషి చేస్తోంది. మన ఈగల్ ఫోర్స్ ఇతర రాష్ట్రాలు, దేశాల్లో కూడా ఆపరేషన్స్ నిర్వహించింది. డ్రగ్స్ సరఫరాకు చెందిన ఎన్నో లింకులను ఛేదించింది. సిబ్బంది కొరత ఉన్నప్పటికీ నార్కోటిక్స్ విభాగం మంచి పనితీరు కనబరిచింది. డ్రగ్స్ కట్టడిలో జిల్లాల పోలీసు యంత్రాంగం కూడా దృష్టి సారించాలి. కాలేజీ యాజమాన్యాల బాధ్యత కూడా పెరగాలి'' అని డీజీపీ తెలిపారు.




## పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి

: జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్

* యూసుఫ్గూడ సర్కిల్లో పారిశుధ్య పనుల పరిశీలన.. కార్మికులతో కలిసి అల్పాహారం

హైదరాబాద్, మే 7 ( భారత శక్తి) : నగర పరిశుభ్రత కోసం ఎండను సైతం లెక్కచేయక శ్రమిస్తున్న పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ కొనియాడారు. గురువారం యూసుఫ్గూడ సర్కిల్లో పర్యటించిన ఆయన, క్షేత్రస్థాయిలో కొనసాగుతున్న పారిశుధ్య పనులను స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్మికులతో ముఖాముఖి మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

* అభినందనీయం.. జైప్రకాష్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సేవలు

తీవ్రమైన ఎండల నేపథ్యంలో పారిశుధ్య కార్మికుల





పట్ల జైప్రకాష్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ చూపుతున్న చొరవను కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు. కార్మికులకు ఉదారంగా అల్పాహారం ఏర్పాటు చేయడం వారి సామాజిక బాధ్యతకు నిదర్శనమని పేర్కొన్నారు. అనంతరం అసోసియేషన్ సభ్యులు, కార్మికులతో కలిసి ఆయన అల్పాహారం తీసుకున్నారు.

* స్వచ్ఛ భారత్ మిషన్లో భాగస్వాములు కావాలి

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. స్వచ్ఛ భారత్ మిషన్ (SBM) కింద చేపట్టే జనాభా గణన స్వీయ గణన ప్రక్రియలో నగరవాసులు ఉత్సాహంగా పాల్గొనాలని కోరారు.

* అభిప్రాయ సేకరణ: నివాసితులు తమ విలువైన అభిప్రాయాలను నమోదు చేయాలని సూచించారు.
* SIR పూర్తి: సోషల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ రిపోర్ట్ (SIR) ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులను అభ్యర్థించారు.

**సామాజిక బాధ్యతతోనే స్వచ్ఛ నగరం**

పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన హైదరాబాద్ నిర్మాణంలో సామాజిక భాగస్వామ్యం కీలకమని కమిషనర్ స్పష్టం చేశారు. కార్మికుల సంక్షేమం పట్ల ప్రతి ఒక్కరూ సానుకూల దృక్పథంతో ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఎ. సురేష్, ఎస్బీఎం డీవైఈఈ వి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు సభ కాదు, అది ఫ్రస్ట్రేషన్ సభ: కేటీఆర్‌కు పొంగులేటి కౌంటర్

హైదరాబాద్, మే 7 (భారత శక్తి) : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వరంగల్ సభలో చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. భవిష్యత్తులో కూడా తమకు అధికారం దక్కదనే భయం, ఫ్రస్ట్రేషన్ వల్లే కేటీఆర్ ప్రజలు అసహ్యించుకునేలా మాట్లాడుతున్నారని ఆయన మండిపడ్డారు. బుధవారం విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటనలో బీఆర్ఎస్ రాజకీయాలపై మంత్రి పొంగులేటి ఘాటుగా స్పందించారు. పదేళ్ల పాటు అధికారంలో ఉండి రైతుల సంక్షేమాన్ని గాలికొదిలేసిన బీఆర్ఎస్ నేతలు.. ఇప్పుడు కేవలం పొలిటికల్ మైలేజ్ కోసం మాటల దాడులకు దిగడం వారి నిస్సహాయతకు నిదర్శనమని విమర్శించారు.

**బీజేపీతో కుమ్మక్కు.. పొలిటికల్ డ్రామా**

వరంగల్‌లో బీఆర్ఎస్ నిర్వహించిన సభను 'రైతు సంగ్రామ సదస్సు' అనడం పూర్తిగా అబద్ధమని మంత్రి కొట్టిపారేశారు. అది అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ నేతల 'ఆక్రోశ సభ' మాత్రమేనని కౌంటర్ ఇచ్చారు. ఆ మీటింగ్‌కు రైతులు రాలేదని, కేవలం పార్టీ కార్యకర్తలు మాత్రమే హాజరయ్యారని ఎద్దేవా చేశారు. "కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీతో బీఆర్ఎస్ కుమ్మక్కైంది. ఆ పార్టీపై ఈగ వాలనివ్వకుండా కాపాడుతూ.. ప్రతి దానికి రాష్ట్ర ప్రభుత్వాన్ని బ్లేమ్ చేస్తున్నారు. కేంద్రాన్ని ప్రశ్నించాల్సిన చోట రాష్ట్రాన్ని టార్గెట్ చేయడం ప్రజలను తప్పుదారి పట్టించడమే" అని పొంగులేటి దుయ్యబట్టారు.

**పదేళ్లలో రైతులను దగా చేశారు**

పదేళ్ల కేసీఆర్ పాలనలో రైతులకు జరిగిన అన్యాయాలను ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. పంటల బీమాను ఎత్తివేసి, వరదలు, అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు ఒక్క పైసా కూడా పరిహారం ఇవ్వని చరిత్ర బీఆర్ఎస్‌ది అని విమర్శించారు. ధరణి పోర్టల్ పేరుతో లక్షలాది మంది రైతులను భూముల విషయంలో ఇబ్బందులకు గురి చేశారని, రుణమాఫీ పేరుతో రైతులను అప్పుల ఊబిలోకి నెట్టారని మండిపడ్డారు. రైతుల ప్రాణాలతో చెలగాటమాడిన వారే ఇప్పుడు రైతు మిత్రులమని చెప్పుకోవడం పట్ల ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

**కాంగ్రెస్ సర్కార్.. రైతుల పక్షపాతి**

సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమంలో రికార్డులు సృష్టిస్తోందని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. "పంట నష్టపరిహారం కింద ఎకరాకు రూ.10 వేల చొప్పున సాయం అందిస్తున్నాం. రైతుల కోసం మా ప్రభుత్వం నెలకు సగటున రూ. 5,500 కోట్లు ఖర్చు చేస్తోంది (గత బీఆర్ఎస్ ప్రభుత్వం నెలకు కేవలం రూ. 2,533 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది). కేవలం రెండేళ్లలోనే రైతుల కోసం రూ. 1 లక్షా 5 వేల కోట్లకు పైగా ఖర్చు చేశాం" అని లెక్కలతో సహా వివరించారు. రాహుల్ గాంధీ ఇచ్చిన వరంగల్ రైతు డిక్లరేషన్‌లోని హామీలనే కాకుండా, అందులో లేని ఎన్నో పథకాలను కూడా అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. రైతు పేరుతో రాజకీయాలు చేసే రోజులు పోయాయని, రైతుల సంక్షేమంలో తెలంగాణ నేడు దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.

## ముగియని ఆపరేషన్..
# త్రివిధ దళాల స్పష్టీకరణ

హైదరాబాద్, మే 7 (భారత శక్తి) : ఉగ్రస్థావరాలపై భారత్ ఆపరేషన్ ఇంకా ముగియలేదని, ఆపరేషన్ సిందూర్ ఆరంభం మాత్రమేనని భారత త్రివిధ దళాలు పేర్కొన్నాయి. పాకిస్థాన్‌లో ఏ ఉగ్రస్థావరం సురక్షితం కాదని గత సంవత్సరం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ ద్వారా స్పష్టమైన సందేశం ఇచ్చామని తెలిపాయి. దేశ ప్రజలను, సార్వభౌమత్వాన్ని భారత్ కాపాడుకోగలదని స్పష్టం చేశాయి. ఆపరేషన్ సిందూర్‌కు ఏడాది పూర్తయిన సందర్భంగా జైపూర్‌లో త్రివిధ దళాల ముఖ్య అధికారులు మీడియాతో మాట్లాడారు. ఉగ్రవాదంపై భారత్ పోరు కొనసాగిస్తుందని లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్ వెల్లడించారు. వివిధ విభాగాలతో కలిసి తక్కువ సమయంలో, కచ్చితత్వంతో ఆపరేషన్ సిందూర్ విజయవంతంగా అమలు చేసినట్లు తెలిపారు. వైమానిక వ్యవహారాల డైరెక్టర్ జనరల్ ఎయిర్ మార్షల్ ఏకే భారతి మాట్లాడుతూ, ఆపరేషన్ సిందూర్ ద్వారా మన వాయుసేన సామర్థ్యాలను ప్రపంచానికి మరోసారి చాటామని అన్నారు. పాకిస్థాన్‌కు చెందిన 13 విమానాలను కూల్చివేశామని, 11 ఎయిర్ ఫీల్డ్ లను ధ్వంసం చేశామని వెల్లడించారు.

# విద్యుత్ ఆర్టిజన్ల పోరాటానికి ఫలితం.. చర్చలకు భట్టి గ్రీన్ సిగ్నల్!

హైదరాబాద్, మే 7 (భారత శక్తి) : తెలంగాణలోని విద్యుత్ ఆర్టిజన్ల సమస్యల పరిష్కారం దిశగా సానుకూల అడుగులు పడుతున్నాయి. తమ డిమాండ్ల సాధన కోసం ఇటీవల సమ్మె చేపట్టి విరమించిన తెలంగాణ విద్యుత్ ఆర్టిసన్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు.. బుధవారం ప్రజా భవన్‌లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కను కలిశారు. సమ్మె విరమణ తర్వాత జరుగుతున్న పరిణామాలను, పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను వారు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

**కోదండరాం, దయాకర్ ఆధ్వర్యంలో**

తెలంగాణ ఉద్యమ నేత, శాసన మండలి సభ్యులు ప్రొఫెసర్ కోదండరాం, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్‌ల ఆధ్వర్యంలో ఈ కీలక సమావేశం జరిగింది. జేఏసీ నాయకులు లేవనెత్తిన అంశాలను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సావధానంగా విన్నారు. ఆర్టిజన్ల సమస్యల పట్ల ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది.

**సీఎండీలకు కీలక ఆదేశాలు**

ఈ సమావేశం అనంతరం జేఏసీ నాయకులకు మంత్రి స్పష్టమైన హామీ ఇచ్చారు. ఆర్టిజన్ల సమస్యల పరిష్కారం కోసం రేపు లేదా ఎల్లుండి ట్రాన్స్‌కో (Transco), జెన్‌కో (Genco), TGSPDCL, TGNPDCL సీఎండీ (CMD) లతో అధికారిక చర్చలు జరపాలని ఆయన నిర్ణయించారు. ఈ మేరకు వెంటనే చర్చలు ప్రారంభించాలని సంబంధిత అధికారులకు, మేనేజింగ్ డైరెక్టర్లకు డిప్యూటీ సీఎం ఆదేశాలు జారీ చేశారు.

# గవర్నర్పై కాంగ్రెస్ గుస్సా .. రేపు తమిళనాడు బంద్!

చెన్నై, మే 7 (భారత శక్తి) : తమిళనాడు రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో అతి పెద్ద పార్టీగా అవతరించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీని ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించడంలో జాప్యం జరుగుతోందని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆందోళనకు పిలుపునిచ్చింది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, గవర్నర్ రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని నిరసిస్తూ రేపు (మే 8వ తేదీన) చెన్నైలో భారీ ధర్నా నిర్వహించనున్నట్లు ప్రకటించింది. తమిళనాడు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌పీసీసీ) అధ్యక్షుడు కె. సెల్వపెరుంతగై నాయకత్వంలో ఈ నిరసన కార్యక్రమం జరగనుంది. శుక్రవారం ఉదయం 11 గంటలకు చెన్నైలోని అన్నాసాలై, తారాపూర్ టవర్ సమీపంలో ఈ ధర్నా చేపట్టనున్నట్లు పార్టీ మీడియా విభాగం ఇన్‌చార్జి ఎ. గోపన్న ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రం చేతిలో గవర్నర్ కీలుబొమ్మగా మారి, ప్రజా తీర్పును అగౌరవపరుస్తున్నారని కాంగ్రెస్ ఆరోపించింది. ఈ నిరసన కార్యక్రమంలో పార్టీ మాజీ అధ్యక్షులు, మాజీ కేంద్ర మంత్రులు, ఏఐసీసీ కార్యదర్శులు, ప్రస్తుత, మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలతో పాటు పార్టీకి చెందిన అన్ని స్థాయిల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొంటారని కాంగ్రెస్ పార్టీ పేర్కొంది.

# రిజిస్ట్రేషన్లకు 'విలువల' సెగ!

హైదరాబాద్, మే 7 (భారత శక్తి) : తెలంగాణలో స్థిరాస్తి కొనుగోలుదారులపై త్వరలో భారీ భారం పడనుంది. రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ, వ్యవసాయేతర భూముల మార్కెట్ విలువలను (రిజిస్ట్రేషన్ విలువ) గణనీయంగా పెంచేందుకు ప్రభుత్వం కసరత్తు పూర్తి చేసింది. ఈ పెంపుదల కనిష్ఠంగా 20 శాతం నుంచి గరిష్ఠంగా 100 శాతం వరకు, కొన్ని కీలక ప్రాంతాల్లో అంతకంటే ఎక్కువగా కూడా ఉండే అవకాశం కనిపిస్తోంది. ప్రభుత్వ అధికారిక విలువలకు, వాస్తవ మార్కెట్ ధరలకు మధ్య ఉన్న భారీ వ్యత్యాసాన్ని తగ్గించి, తద్వారా రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వ ఆదాయాన్ని పెంచుకోవడమే ఈ నిర్ణయం వెనుక ప్రధాన లక్ష్యం. గత నాలుగేళ్లుగా రాష్ట్రంలో భూముల మార్కెట్ విలువలను సవరించలేదు. ఈ నేపథ్యంలో, 202526 ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయేతర ఆస్తుల రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.19,000 కోట్ల ఆదాయాన్ని లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వం, విలువల సవరణ ద్వారానే ఇది సాధ్యమని భావిస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో ఈ ఆదాయం రూ.15,200 కోట్లుగా ఉంది. మొదట హైదరాబాద్ నగర పరిధిలోనే ఈ పెంపును పరిమితం చేయాలని భావించినప్పటికీ, తాజాగా రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ, వ్యవసాయేతర భూములన్నింటికీ వర్తింపజేయాలని నిర్ణయించారు.

**పశ్చిమ హైదరాబాద్‌లో భారీగా పెంపు!**

ముఖ్యంగా రియల్ ఎస్టేట్ లావాదేవీలు అధికంగా ఉండే పశ్చిమ హైదరాబాద్‌లోని ప్రాంతాల్లో విలువల పెంపు భారీగా ఉండనుంది. కోకాపేట, గండిపేట, మోకిల, గచ్చిబౌలి, గోపన్‌పల్లి, నానక్‌రామ్‌గూడ, రాజేంద్రనగర్, బుద్వేల్ వంటి ప్రాంతాల్లో ఈ పెరుగుదల 100% దాటినా ఆశ్చర్యపోనక్కర్లేదు. ఉదాహరణకు, కోకాపేటలో ప్రభుత్వం వేలంలో ఎకరం భూమిని రూ.100 కోట్లకు పైగా ధరకు విక్రయించింది. ఇక్కడ డెవలపర్లు ఫ్లాట్లను చదరపు అడుగుకు రూ.12,000 వరకు అమ్ముతుంటే, ప్రభుత్వ రిజిస్ట్రేషన్ విలువ మాత్రం కేవలం రూ.3,000 గానే ఉంది. ఈ అంతరాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. అదేవిధంగా, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, కోకాపేట ప్రాంతాల్లో ఓపెన్ ప్లాట్ల మార్కెట్ ధర చదరపు గజానికి రూ.1 లక్ష నుంచి రూ.2 లక్షల వరకు పలుకుతుండగా, ప్రభుత్వ విలువ రెసిడెన్షియల్ ప్లాట్లకు కేవలం రూ.13,500, కమర్షియల్‌కు రూ.23,800 గానే ఉంది. బాచుపల్లిలో మార్కెట్ ధర చదరపు గజానికి రూ.70,000రూ.80,000 ఉండగా, ప్రభుత్వ విలువ రూ.12,600 మాత్రమే. గచ్చిబౌలి, మాదాపూర్‌లలో చదరపు అడుగుకు ప్రభుత్వ విలువ రూ.3,000రూ.4,500 ఉండగా, మార్కెట్ ధరలు దీనికి చాలా రెట్లు ఎక్కువగా ఉన్నాయి.

**రాష్ట్రవ్యాప్తంగా ప్రభావం**

హైదరాబాద్‌లోని తూర్పు ప్రాంతాలైన విజయవాడ హైవే వెంబడి చౌటుప్పల్ వరకు, వరంగల్ హైవే వెంబడి యాదగిరిగుట్ట వరకు సుమారు 20 శాతం పెరుగుదల ఉండవచ్చని అంచనా. ఇక వ్యవసాయ భూముల విషయంలోనూ భారీ వ్యత్యాసం ఉంది. హెచ్ఎండీఏ పరిధిలోని మారుమూల గ్రామాల్లో కూడా ఎకరం భూమి మార్కెట్ ధర రూ.2030 లక్షలు పలుకుతుంటే, ప్రభుత్వ విలువ మాత్రం కేవలం రూ.5 లక్షలుగానే నమోదై ఉంది. ఈ వ్యత్యాసాలన్నింటినీ సవరించనున్నారు. ఈ విలువల పెంపు నేరుగా కొనుగోలుదారులపై ప్రభావం చూపుతుంది. పట్టణ ప్రాంతాల్లో 6%, గ్రామీణ ప్రాంతాల్లో 7.5 శాతంగా ఉన్న స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెరిగిన విలువల ఆధారంగా లెక్కిస్తారు. దీంతో ఆస్తి రిజిస్ట్రేషన్ ఖర్చు గణనీయంగా పెరగనుంది. దీనిపై ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన త్వరలోనే

# హైడ్రా భారీ విజయం.. ₹85 వేల కోట్ల భూములు సేఫ్

హైదరాబాద్, మే 7 (భారత శక్తి) : నగరంలో కబ్జాల నుంచి సుమారు రూ.85 వేల కోట్ల విలువైన భూములను కాపాడామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడించారు. ప్రస్తుతం హైడ్రా పరిధిలో రూ.10 లక్షల కోట్ల విలువ చేసే భూములు కబ్జాకు గురైనట్లు తమకు సమాచారం ఉందని ఆయన తెలిపారు. ఆయన ఈరోజు మిర్యాలగూడలో పర్యటించి, వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, హైడ్రాను తెలంగాణవ్యాప్తంగా విస్తరిస్తామని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని వెల్లడించారు. హైదరాబాద్‌లో హైడ్రా కార్యకలాపాలకు ప్రజలంతా ఆకర్షితులయ్యారని, అందుకే రాష్ట్రవ్యాప్తంగా హైడ్రా కావాలని ప్రజల నుంచి వినతులు వెల్లువెత్తుతున్నాయని అన్నారు. కబ్జాలపై హైడ్రాకు వేలాదిగా ఫిర్యాదులు వస్తున్నాయని ఆయన తెలిపారు. ఆయా సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా తాము చర్యలు చేపడుతున్నామని అన్నారు. అందుకే నాలుగు వారాల పాటు ప్రజావాణిని నిలిపివేసినట్లు తెలిపారు. ఇప్పుడున్న దరఖాస్తుల పరిష్కారం కోసమే ప్రజావాణిని రద్దు చేశామని స్పష్టం చేశారు. హైడ్రాకు వ్యతిరేకంగా కొంతమంది కోర్టులను ఆశ్రయిస్తున్నట్లు చెప్పారు.

# ఏపీలో త్వరలో స్థానిక ఎన్నికలు.. సీఎం కీలక ఆదేశం

అమరావతి, మే 7 (భారత శక్తి) : రాష్ట్రంలో త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. అమరావతిలో జరిగిన కలెక్టర్ల సదస్సులో 'స్వర్ణాంధ్ర విజన్ 10 సూత్రాలు' అనే అంశంపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్లకు పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర అభివృద్ధిలో లాజిస్టిక్స్ వ్యయం తగ్గించడం అత్యంత కీలకమని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. రాష్ట్రానికి రూ.లక్ష కోట్లకు పైగా విలువైన 64 జాతీయ రహదారులు, రూ.64 వేల కోట్ల విలువైన 624 రైల్వే ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. మరో రూ.2 లక్షల కోట్ల ప్రాజెక్టులు డీపీఆర్ దశలో ఉన్నాయని వెల్లడించారు. ఎల్‌నినో ప్రభావంతో ఈసారి వర్షాలు తక్కువగా పడే అవకాశం ఉందని, దీనికి అనుగుణంగా కలెక్టర్లు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని చంద్రబాబు సూచించారు. వర్షాధార, మెట్ట, ఉద్యాన పంటలకు తగినట్లుగా నీటి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. అదేవిధంగా, స్వచ్ఛ రథాల ద్వారా వ్యర్థాల సేకరణ, రహదారుల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

# రేవంత్ రెడ్డికి కనీస కనికరం లేదు: హరీశ్ రావు ఆగ్రహం

హైదరాబాద్, మే 7 (భారత శక్తి) : వడ్ల కుప్పల వద్ద రైతుల గుండెల ఆగిపోతున్నా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కనీస కనికరం లేదని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో ఇలాంటి పరిస్థితిని తెలంగాణలో ఎప్పుడూ చూడలేదని అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని హరీశ్ రావు సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నెల రోజులుగా వడ్లను కొనుగోలు చేయడం లేదని విమర్శించారు. తరుగు పేరుతో రైతులను దోచుకుంటున్నారని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని మండిపడ్డారు. వడ్ల కుప్పల వద్దనే రైతుల గుండెలు ఆగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా జరుగుతున్నాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారని, కానీ వాస్తవాలు ఇందుకు విరుద్ధంగా ఉన్నాయని మండిపడ్డారు. నేను వారిలా ఏసీ గదిలో కూర్చుని మాట్లాడటం లేదని విమర్శించారు. రైతుల మధ్య నిల్చుని, వారి గోడు విని మాట్లాడుతున్నానని అన్నారు. కల్లాలలో రైతులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. తేమ పరీక్షకు పదిరోజులు, గోనె సంచులకు వారం రోజులు, కాంటా (తూకం) పెట్టడానికి మరో వారం రోజులు పడుతుందని ఆరోపించారు. మిల్లులకు వెళ్లిన తర్వాత కూడా లారీకి నాలుగైదు బస్తాల వరకు కటింగ్ పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షాలతో రైతులు తీవ్ర ఆందోళనతో ఉన్నారని హరీశ్ రావు అన్నారు.

# విజయ్‌కు అవకాశం ఇవ్వండి: గవర్నర్‌కు వినతి

చెన్నై, మే 7 (భారత శక్తి) : అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలుచుకున్న టీవీకే పార్టీకి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అవకాశం ఇవ్వాలని, ఆ పార్టీ అధ్యక్షుడు విజయ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడానికి ఆహ్వానించాలని సీపీఐ, వీసీకే పార్టీలు గవర్నర్‌కు విజ్ఞప్తి చేశాయి. అసెంబ్లీలో తన మెజారిటీని నిరూపించుకోవడానికి ఆయనకు అవకాశం ఇవ్వాలని అన్నారు. తమిళనాడులో ప్రభుత్వం ఏర్పాటుపై గవర్నర్ నిర్ణయంలో జాప్యం జరుగుతోంది. ఈ క్రమంలో వివిధ పార్టీలు స్పందించాయి. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి విజయ్‌కి అవకాశమివ్వాలని గవర్నర్‌ను కోరిన వీసీకే, ప్రభుత్వానికి సహకరించే అవకాశంపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు. ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి టీవీకేకు తొలుత అవకాశమివ్వాలని డీఎంకే కూడా స్పష్టం చేసింది. గవర్నర్ రాజ్యాంగ పరిధిలోనే వ్యవహరించాలని సీపీఐ డిమాండ్ చేసింది. ప్రజలు ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ ఇవ్వలేదని, కానీ 108 స్థానాలు గెలుచుకున్న టీవీకేకు మొదట అవకాశమివ్వాలని పేర్కొంది. విజయ్ ఇప్పటికే రెండుసార్లు గవర్నర్‌ను కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి ఆహ్వానం పలకాలని కోరిన విషయాన్ని గుర్తుచేసింది. విజయ్ ప్రమాణ స్వీకారం చేయకముందే మెజారిటీ నిరూపించుకోవాలని గవర్నర్ ఒత్తిడి చేయడం సరికాదని అభిప్రాయపడింది. దీనిని సీపీఐ వ్యతిరేకిస్తోందని పేర్కొంది. అత్యధిక స్థానాలు గెలిచిన విజయ్‌కి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశమివ్వాలని, ఆ తర్వాత సభలో మెజారిటీ నిరూపించుకోవడానికి ఆయనకు అవకాశమివ్వాలని కోరింది. తమిళనాడులో ఏకైక అతిపెద్ద పార్టీగా టీవీకేను ప్రజలు ఎన్నుకున్నారని, అందువల్ల విజయ్‌కి మొదట అవకాశం ఇవ్వాలని వీసీకే అధ్యక్షుడు తిరుమావళవన్ అన్నారు. కానీ గవర్నర్ ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం గందరగోళానికి తావిస్తోంది అన్నారు.

# మోదీ సభను విజయవంతం చేయండి: సామ రంగారెడ్డి

* **కాలనీల్లో ముమ్మరంగా ఆహ్వాన పత్రికల పంపిణీ**
* **పరేడ్ గ్రౌండ్స్ సభకు తరలిరావాలని పిలుపు**

ఎల్బీనగర్, మే 07 (భారత శక్తి) : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హైదరాబాద్ పర్యటనను పురస్కరించుకుని ఈ నెల 10న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న 'జనాగ్రహ సభ'ను విజయవంతం చేయాలని బీజేపీ ఎల్బీనగర్ నియోజకవర్గ ఇంచార్జ్, మేడ్చల్ రూరల్ జిల్లా ప్రభారీ సామ రంగారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం నియోజకవర్గంలోని పలు డివిజన్లలో ఆయన విస్తృతంగా పర్యటించి, కాలనీ వాసులకు స్వయంగా ఆహ్వాన పత్రికలను అందజేశారు.

**వాకర్స్ అసోసియేషన్లతో భేటీ**

బీఎన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని వివేకానంద పార్కులో మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సామ రంగారెడ్డి పాల్గొన్నారు. పార్కుకు వచ్చిన వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో మాట్లాడి, సభకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. దేశాభివృద్ధిలో మోదీ చేపట్టిన పథకాలను వివరిస్తూ, భారీ సంఖ్యలో ప్రజలు సభకు తరలిరావాలని కోరారు.

**నాగోల్‌లో ముమ్మర ప్రచారం**

అనంతరం నాగోల్ డివిజన్ రాక్ టౌన్ కాలనీ పార్కులో మాజీ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సామ రంగారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కాలనీ వాసులకు ఆహ్వాన పత్రికలు అందజేస్తూ.. మే 10వ తేదీ సాయంత్రం 4 గంటలకు పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే జనాగ్రహ సభకు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు.

**సమరశంఖం పూరిద్దాం..**

ఈ సందర్భంగా సామ రంగారెడ్డి మాట్లాడుతూ..



కేంద్ర ప్రభుత్వ ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఈ సభ ఒక వేదికగా నిలుస్తుందన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గడపకూ ఈ ఆహ్వానం అందేలా కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు మరియు కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మానవీయ, సాంఘిక శాస్త్రాల ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్న గీతం




పటాన్‌చెరు, మే 7 (భారత శక్తి) : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులోని స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (జీఎస్ హెచ్ఎస్) 202627 విద్యా సంవత్సరానికి గాను మానవీయ, సాంఘిక శాస్త్రాలలో యూజీ, పీజీ, పీహెచ్.డీ. కోర్సులలో ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఈ విషయాన్ని ఆ స్కూల్ ఇన్ ఛార్జి డైరెక్టర్ డాక్టర్ శామ్యూల్ థరు గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు. జాతీయ లేదా రాష్ట్ర స్థాయి ప్రవేశ పరీక్షలలో పొందిన చెల్లుబాటు అయ్యే స్కోర్ల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామని, అలాగే గీతం ప్రవేశ పరీక్ష (గాట్ 2026) ద్వారా కూడా అర్హత సాధించవచ్చని ఆయన తెలియజేశారు. మూడో దశ ప్రవేశ పరీక్ష ఈనెల 17న జరుగుతుందని, ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులను మే 14వ తేదీలోగా అధికారిక పోర్టల్ ద్వారా ఆన్ లైన్లో సమర్పించవచ్చన్నారు. యూజీ స్థాయిలో సైకాలజీ, ఎకనామిక్స్, ఇంగ్లీషు, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, జర్నలిజం అండ్ మీడియా స్టడీస్, సోషియాలజీ, సినిమాటిక్ ఆర్ట్స్ అండ్ డిజైన్లు ప్రధాన అంశం (మేజర్)గా బీ.ఏ. కోర్సును అందజేస్తున్నామని తెలిపారు. వీటిలో చేరిన విద్యార్థులకు వారు ఎంచుకున్న విభాగాలలో బలమైన పునాదిని అందించడంతో పాటు, వారి విశ్లేషణాత్మక, సృజనాత్మక, భావ ప్రకటనా నైపుణ్యాలను మెరుగుపరిచేలా ఆయా కోర్సులను రూపొందించామని తెలిపారు. లిబరల్ ఎడ్యుకేషన్ లో భాగంగా, విద్యార్థుల ఆసక్తి, ఆశయాల ఆధారంగా 600కు పైగా సబ్జెక్టుల కలయికలను ఎంచుకోవచ్చన్నారు. పీజీ స్థాయిలో అప్లైడ్ సైకాలజీ, ఎకనామిక్స్, ఇంగ్లీషులలో ఎం.ఏ. కోర్సులను అందిస్తున్నామని తెలిపారు. ఇవి ఉన్నతమైన సైద్ధాంతిక పరిజ్ఞానం, పరిశోధనా సామర్థ్యాలు, ఆచరణాత్మక అనువర్తనాలపై దృష్టి పెడతాయన్నారు. ఇక డాక్టోరల్ కోర్సులలో అప్లైడ్ సైకాలజీ, ఎకనామిక్స్, ఇంగ్లీషు, పొలిటికల్ సైన్స్, సోషియాలజీలలో పీహెచ్.డీ. కోర్సులు ఉన్నాయని ఆయన తెలియజేశారు. ఈ రంగాలలో ఉన్నతనాణ్యత గల పరిశోధన, విద్యా నైపుణ్యాన్ని పెంపొందించడమే వీటి లక్ష్యమన్నారు. విద్యతో పాటు క్రీడలు, ఇతరత్రా కార్యకలాపాలు, సామాజిక పరస్పర చర్యలతో అనుసంధానించడం ద్వారా సంపూర్ణ విద్యకు జీఎస్ హెచ్ఎస్ ప్రాధాన్యత ఇస్తోందని డాక్టర్ శామ్యూల్ వివరించారు. అత్యాధునిక బోధనా ప్రయోగశాలలు, విస్తృతమైన ఇంటర్న్‌షిప్ అనుభవం, పరిశోధనపై దృష్టి సారించే అధ్యాపక బృందం సమగ్రమైన బోధనను అందించడంలో సహాయపడుతుందని తెలిపారు. విద్యాపరమైన విజయాలకు అతీతంగా విద్యార్థులను తీర్చిదిద్ది, విజ్ఞానవంతమైన దృక్పథాలు, విమర్శనాత్మక ఆలోచనల ద్వారా సమాజానికి అర్థవంతంగా దోహదపడేలా వారికి సాధికారత కల్పించడానికి గీతం కట్టుబడి ఉందన్నారు. గీతంలోని దాదాపు 33 శాతం మంది విద్యార్థులు ప్రతిభ ఆధారిత ఉపకార వేతనాలు పొందుతున్నారని, వీటిలో బోధనా రుసుము, భోజనం, వసతి ఖర్చులతో సహా పూర్తి మినహాయింపులున్నాయని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 14వ తేదీలోగా ఆన్ లైన్లో దరఖాస్తు చేసుకుని, మే 17న జరిగే ప్రవేశ పరీక్ష, వ్యక్తిగత ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. ఇతరత్రా సమాచారం కోసం www.gitam.edu ను సందర్శించాలని, లేదా 888 4984 000 ను సంప్రదించాలని సూచించారు.






## ఈ నెల 11న సరూర్ నగర్ స్టేడియంలో మెగా జాబ్ మేళా

*** 162 ప్రముఖ కంపెనీలు పాల్గొనే అవకాశం**

ఎల్బీనగర్, మే 07 (భారత శక్తి): యువజన సేవలు, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఈనెల 11న సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు సరూర్నగర్ మండల తహసీల్దార్ పి. వేణుగోపాల్, సరూర్ నగర్ జిహెచ్ఎంసి సర్కిల్ 12 డిప్యూటీ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్ ఇరువురు కలిసి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో 162 ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఐటీ హెల్త్, ఇండస్ట్రియల్, ఫార్మా, రిటైల్, బ్యాంకింగ్, ఫైనాన్స్, మార్కెటింగ్, సేవారంగం తదితర అనేక విభాగాలకు చెందిన సంస్థలు పాల్గొంటాయని చెప్పారు. https://satg.telangana.gov.in/prajapalana/ వెబ్ లింక్ లో తమ వివరాలు నమోదు చేసుకోవాలని ఇరువురు నిరుద్యోగులకు సూచించారు.

# అభివృద్ధి పనుల్లో పరిశ్రమల భాగస్వామ్యం మరింత పెరగాలి

*** పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

*** గుమ్మడిదల మున్సిపల్ కార్యాలయం అదనపు అంతస్తులు, పశువుల ఆసుపత్రి అదనపు గదుల నిర్మాణ పనులకు శంకుస్థాపన..**






గుమ్మడిదల, మే 7 (భారత శక్తి) : గ్రామాలు, పట్టణాల అభివృద్ధిలో పరిశ్రమల భాగస్వామ్యం మరింత పెరగాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందని పటాన్‌చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. గురువారం గుమ్మడిదల మున్సిపల్ కార్యాలయంలో హెట్రో పరిశ్రమ సౌజన్యంతో 80 లక్షల రూపాయల నిధులతో చేపట్టనున్న అదనపు అంతస్తులు, పశువుల ఆసుపత్రిలో న్యూ ల్యాండ్ పరిశ్రమ సహకారంతో 33 లక్షల రూపాయలు నిర్మించి తలపెట్టిన అదనపు గదుల నిర్మాణ పనులకు గురువారం ఉదయం ఎమ్మెల్యే జిఎంఆర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పరిపాలన సౌలభ్యం కోసం.. ప్రజలకు మెరుగైన పరిపాలన అందించాలన్న లక్ష్యంతో గుమ్మడిదల మున్సిపల్ కార్యాలయం అదనపు అంతస్తుల నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని వస్తామని తెలిపారు. అభివృద్ధి పనులకు నిధులు కేటాయించిన పరిశ్రమల యాజమాన్యాలకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, వైస్ చైర్మన్ సంధ్య గోవర్ధన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ దశరథ్, తహసిల్దార్ పరమేశం, ఎంపీడీవో ఉమాదేవి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సీనియర్ నాయకులు గోవర్ధన్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, విజయ భాస్కర్ రెడ్డి, హుస్సేన్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ రాష్ట్ర కల్లు గీత కార్పొరేషన్ చైర్మన్ గా పదవీ బాధ్యతలు స్వీకరిస్తున్న మోట్కూరి చంద్రశేఖర్ గౌడ్ కి శుభాకాంక్షలు తెలిపి శంకర భగవాన్ విగ్రహం జ్ఞాపికగా ఇవ్వడం అయినది. ఈ ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ముద్దగౌని రామ్మోహన్ గౌడ్, కందికంటి శ్రీధర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఎల్బీనగర్, మే 07 (భారత శక్తి):

# సాకి చెరువులో గుర్రపు డెక్క తొలగింపు పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే జిఎంఆర్..





పటాన్‌చెరు, మే 7 (భారత శక్తి) : చెరువుల సంరక్షణ కోసం శరవేగంగా గుర్రపుడెక్క తొలగింపు పనులను చేపడుతున్నట్లు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని సాకి చెరువులో 70 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న గుర్రపు డెక్క తొలగింపు పనులను గురువారం ఉదయం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమయ్యే లోపు పనులు పూర్తి కావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డివిజన్ పరిధిలోని తిమ్మక్క చెరువు, జేపీ కాలనీ డివిజన్ పరిధిలోని దోషం చెరువులలోను ఒక కోటి రూపాయల అంచనా వ్యయంతో అతి త్వరలో గుర్రపు డెక్క తొలగింపు పనులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. గుర్రపు డెక్క తొలగించడం వలన చెరువు నీటి సామర్థ్యం పెరగడంతో పాటు చెరువుల పరిశుభ్రత మెరుగుపడటం, భూగర్భ జలాలు మట్టం పెరగడం వంటి లాభాలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు మెట్టు కుమార్ యాదవ్, సపాన దేవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు నివార్తి, ఎట్టయ్య, టప్పు కుమార్, నర్రా బిక్షపతి, వెంకటేష్, సత్తయ్య, రామ్మోహన్, ఏఈ ఫైజాన్, తదితరులు పాల్గొన్నారు.

## ఏసీబీ వలలో భద్రాచలం అటవీశాఖ అధికారులు




భద్రాచలం, మే 7 (భారత శక్తి) : భద్రాచలం అటవీశాఖ ఎఫ్‌డీవో సుజాత, చర్ల ఇన్‌ఛార్జి డీఆర్‌వో కృష్ణయ్య ఏసీబీ వలకు చిక్కారు. రూ.3.5 లక్షల లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. రోడ్డు పనుల్లో కొన్ని చెట్లు తొలగించడంతో దానిపై కేసు నమోదు చేయకుండా ఉండేందుకు భద్రాచలం ఎఫ్‌డీవో సుజాత రూ.10 లక్షలు డిమాండ్ చేశారు. గురువారం రూ.3.5 లక్షలు తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ రమేశ్ ఆధ్వర్యంలో పోలీసులు ఆమెతోపాటు, చర్ల ఇన్‌ఛార్జి డీఆర్‌వో కృష్ణయ్యను అదుపులోకి తీసుకున్నారు.

## గంగుల కార్యాలయం, కౌశిక్ రెడ్డి కారుపై దాడిని ఖండించిన కేటీఆర్, హరీశ





హైదరాబాద్, మే 7 (భారత శక్తి) : కరీంనగర్‌లో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంప్ కార్యాలయంపై జరిగిన దాడి ఉదంతం తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. ఈ దాడిలో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి కారుని కూడా బీజేపీ కార్యకర్తలు ధ్వంసం చేశారు. ఈ ఘటనను బీఆర్ఎస్ అగ్రనేతలు కేటీఆర్, హరీశ్ రావు తీవ్రస్థాయిలో ఖండించారు. ప్రజాస్వామ్యంలో ఇటువంటి భౌతిక దాడులకు తావులేదని, ఇది అధికార పార్టీ అండతో జరుగుతున్న దుశ్చర్య అని వారు మండిపడ్డారు. ఘటన జరిగిన వెంటనే కౌశిక్ రెడ్డికి కేటీఆర్ ఫోన్ చేసి మాట్లాడారు. దాడి జరిగిన తీరును అడిగి తెలుసుకున్న కేటీఆర్... కౌశిక్ రెడ్డితో పాటు అక్కడ ఉన్న పార్టీ కార్యకర్తల భద్రత గురించి ఆరా తీశారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి (బండి సంజయ్) ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే, ఆయన అనుచరులు ఇలా బహిరంగంగా దాడులకు పాల్పడటం అత్యంత దురదృష్టకరమని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఇది శాంతిభద్రతల వైఫల్యానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. మాజీ మంత్రి హరీశ్ రావు ఈ ఘటనను 'ప్రజాస్వామ్యంపై జరిగిన దాడి'గా అభివర్ణించారు. ఎమ్మెల్యే కార్యాలయంపై కర్రలు, రాడ్లతో దాడి చేసిన వారిపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేసి, కఠినంగా శిక్షించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలో గూండాయిజం పెచ్చుమీరుతోందని, పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడం సరికాదని హరీశ్ రావు మండిపడ్డారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.